అనుదినం... జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ


శనివారం 15-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 119 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

## కృత్రిమ మేధస్సును నిషేధించాలి

- యుద్ధాలు, మరణాల నుంచి లాభాలను ఆర్జించరాదు : పోప్ ఫ్రాన్సిస్



బోర్గో ఎగ్నాజియా, ఇటలీ : ప్రాణాంతకమైన స్వయంప్రతిపత్తి ఆయుధాలపై నిషేధం విధించాలని పోప్ ఫ్రాన్సిస్ పిలుపిచ్చారు. ఇటలీలో జరుగుతున్న జీ-7 నేతల సదస్సులో కృత్రిమ మేధస్సు యొక్క ప్రమాదాలపై ఆయన ప్రసంగించారు. "సాయుధ ఘర్షణల విషాదాల నేపథ్యంలో ఈ 'ప్రాణాంతకమైన స్వయంప్రతిపత్తి ఆయుధాలు' అభివృద్ధి, వినియోగం గురించి పున:పరిశీలించాల్సిన ...11లో

## అందరికీ అందుబాటులో ధరణి పోర్టల్

### రెవెన్యూ శాఖ ప్రక్షాళనకు చర్యలు


- త్వరలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధరణి పోర్టల్‌ను సామాన్యులకు అందుబాటులో తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ధరణి కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి,ఎం.సునిల్ కుమార్, మధుసూదన్‌లతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి అధ్యయనం చేయకుండా హడావిడిగా తెచ్చిన ధరణి పోర్టల్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది భూ సమస్యలను ఎదుర్కొంటున్నారనీ, ఎన్నో కుటుంబాలు ఛిన్నాభిన్నమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే ధరణిలో పేరుకు పోయిన సమస్యల పరిష్కారం కోసం కమిటీని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఈ కమిటీ రాష్ట్రంలో భూ సంబంధిత నిపుణులు, అధికారులతో చర్చించడంతో పాటు 18 రాష్ట్రాల్లోని ఆర్వోఆర్ యాక్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించిందని తెలిపారు. భూ వివాదాల పరిష్కారం కోసం రెవెన్యూ ట్రిబ్యునళ్ల ఏర్పాటు, భూ సంబంధిత ముఖ్యమైన చట్టాలను కలిపి ఒకే చట్టంగా రూపొందించడం మొదలగు సిఫారసులను చేసిందని వెల్లడించారు. లోపభూయిష్టమైన 2020 ఆర్వోఆర్ చట్టానికనుగునంగా రూపొందించిన ధరణి పోర్టల్‌ను బలోపేతం చేయడంతో పాటు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా మార్పులు,చేర్పులు చేపట్టబోతున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పార్ట్-బి లో ఉంచిన భూ సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ధరణి కమిటీ చేసిన ...11లో

# శంకర్‌దాదాల తయారీ!




## విద్యార్థుల జీవితాలతో చెలగాటం

- బీహార్‌లో పేపర్లు దగ్ధం, గుజరాత్‌లో రూ.2.30 కోట్ల చెక్కుల రికవరీ...
- పరీక్షా కేంద్రాల ఎంపికకూ లంచాలు
- నీట్ లీక్‌పై కేంద్రం మౌనం
- పరీక్షా పే చర్చా అంటూ మోడీ దాంభికాలు

**నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్ )పరీక్ష పేపర్ లీక్ దుమారం రేపుతోంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లెక్కలేనన్ని ఉద్యోగ నియామక పరీక్షలు లీకైతే.. వాటిని రద్దు చేసి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికీ వ్యాపం లాంటి కుంభకోణంలో మిస్టరీలు.. అంతుచిక్కని హత్యలెన్నో.. తాజాగా నీట్ పరీక్ష పేపర్ లీక్ అయినా ఎన్టీఏ నోరువిప్పటం లేదు. ప్రతిపక్షాలు నిలదీస్తున్నా.. మోడీ ఇంకా 240 సీట్ల చుట్టూనే ఆలోచిస్తున్నట్టున్నారు. అందుకే రిలీఫ్ కోసం ఫారిన్ ట్రిప్‌కు రెడీ అయ్యారనే విమర్శ వినిపిస్తోంది. జీ7 దేశాల సదస్సు అంటూ ఇటలీకి పయనమయ్యారు. ఈ పర్యటనకు ముందే జమ్మూకాశ్మీర్‌పై సమీక్ష నిర్వహించిన ప్రధాని.. నీట్‌పై మాత్రం ఎందుకు నోరు విప్పడం లేదని విద్యార్థిలోకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.**

న్యూఢిల్లీ : నీట్ పేపర్ లీక్ కేసులో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) తీరు రోజురోజుకీ వివాదస్పదమవుతోంది. నీట్‌ను సక్రమంగా నిర్వహించామని కేంద్రం ముందు తప్పించుకునే ప్రయత్నం చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆరోపణలన్నింటినీ ఖండించారు. నీట్-యూజీలో పేపర్ లీకేజీ ఆరోపణలను తోసిపుచ్చిన ఆయన, 'దీనికి ఎలాంటి ఆధారాల్లేవు. పేపర్ లీకేజీకి ఎలాంటి సాక్ష్యాల్లేవు. ఎన్టీఏపై అవినీతి ఆరోపణలు నిరాధారమైనవి. ఇది చాలా విశ్వసనీయమైన సంస్థ " అని ఎన్టీఏకు క్లీన్‌చిట్ ఇచ్చారు. కానీ, నీట్ పేపర్ లీక్ వ్యవహారం తీగలాగితే డొంక కదిలినట్టు ఒకటొకటిగా బయటకు వస్తోంది. మొదట పాట్నా.., ఇప్పుడు గోద్రాలో పోలీసుల విచారణలో విస్తుగొలిపే విషయాలు వెలుగుచూస్తున్నాయి. నీట్ పేపర్ లీక్ కేసులో ఓ టీచర్ సహా ఐదుగురిని గోద్రా పోలీసులు అరెస్ట్ చేశారు.

**గోద్రా ఎగ్జామ్ సెంటర్‌లోనే..**

నీట్ యూజీ పరీక్షను మే 5న దేశవ్యాప్తంగా ఆయా పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. పరీక్ష రోజు, గుజరాత్‌లోని పంచమహల్ జిల్లా కలెక్టర్‌కు పరీక్షా కేంద్రం వద్ద గందరగోళంపై సమాచారం వచ్చింది. పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ తుషార్ భట్ మొబైల్ ఫోన్ నుంచి 30 మంది అభ్యర్థుల పేర్లు, మొబైల్ నంబర్లు లభ్యమయ్యాయి. ఈ 30 మంది అభ్యర్థులకు పరీక్ష ప్రారంభానికి ముందు వీలైనంత వరకు మాత్రమే ప్రయత్నించమని, మిగిలిన షీట్‌లను ఖాళీగా ఉంచాలని తుషార్‌భట్ ఉపదేశించారు. మిగిలిన సమాధానాలను ఓఎంఆర్ షీట్‌లో తుషార్ పూరించినట్టు సమాచారం.

**ముగ్గురు ప్రధాన నిందితులతో సహా..**

గోద్రాలో ముగ్గురు ప్రధాన నిందితులు సహా ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు తుషార్ భట్ ఫోన్ నుంచి పేపర్‌లీక్ సమాచారమిచ్చి విద్యార్థుల నుంచి డబ్బులు తీసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఇది తెలిసిన వెంటనే పరీక్ష రోజునే ...2లో

### పేపర్ లీక్ కాకుంటే బీహార్‌లో 13 మంది అరెస్ట్ ఎందుకు...?



- నీట్ అవకతవకలపై కేంద్రంపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మండిపాటు

'నీట్-యూజీ 2024'లో జరిగిన కుంభకోణాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ), విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ద్వారా కప్పిపుచ్చే ప్రయత్నాలను కేంద్రం ప్రారంభించిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ...2లో

## ఆ జీవోనే రేవంత్‌కు ఆయుధమా..?

### రైతు భరోసాపై కాంగ్రెస్ పక్కా వ్యూహం

- ఫామ్‌హౌస్‌లు, రియల్ ఎస్టేట్ స్థలాలు, వెంచర్లు తదితరాలకు మినహాయించే యోచన
- ఆ రూపంలో రూ.3 వేల కోట్ల వరకూ ఖజానాపై భారం తగ్గింపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిన ఒక ప్రధానమైన ఉత్తర్వే... నేటి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయుధం కాబోతోందా..? దాని ఆధారంగానే సీఎం రేవంత్ ఓ కీలక నిర్ణయానికి వడివడిగా అడుగులు వేయబోతున్నారా..? అంటే అవుననే అంటున్నాయి ప్రభుత్వ వర్గాలు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రైతు భరోసా అత్యంత ప్రధానమైంది. కేసీఆర్ సర్కారు 'రైతు బంధు' పేరిట అమలు చేసిన ఆ పథకం పేరును కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతు భరోసా'గా మార్చిన సంగతి తెలిసిందే. ఆ పథకం కింద కేసీఆర్ హయాంలో ఎకరానికి రూ.5 వేల చొప్పున రెండు పంటలకు కలిపి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అయితే తాము అధికారంలోకి వస్తే ఈ పెట్టుబడి సాయాన్ని రూ.7,500 (ఎకరాకు ఒక పంటకు)కు పెంచుతామంటూ రేవంత్ హామీనిచ్చారు. ఎన్నికల్లో ఈ హామీ కాంగ్రెస్‌కు పెద్ద ఎత్తున ఓట్లను రాల్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత వరసగా అసెంబ్లీ సమావేశాలు, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల కోడ్, అనంతరం ఎమ్మెల్సీ ఎలక్షన్ల కారణంగా రైతు భరోసాపై ప్రభుత్వం దృష్టి సారించలేదు. కానీ ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాల్సి ఉంది కాబట్టి కీలకమైన ఆ పథకంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇందుకు సంబంధించి గత కేసీఆర్ సర్కారు రూపొందించిన విధి విధానాలు, అమలు చేసిన పద్ధతి, విడుదల చేసిన ఉత్తర్వులపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు.

బీఆర్ఎస్ రెండోసారి ముందస్తు ఎన్నికలకు వెళ్లటానికి కొద్ది నెలల ముందు రైతు బంధును ప్రవేశపెట్టింది. తొలుత ఎకరానికి ఒక పంటకు రూ.4 వేల మేర ...11లో

## జులై 22 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు!



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ సమావేశాల తేదీలు కూడా దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. జులై 22 నుంచి ఆగస్టు 9 వరకు జరుగుతాయని ప్రభుత్వ వర్గాలు శుక్రవారం తెలిపాయి. ఈ సమావేశాల్లోనే ...11లో

## అహంకారం వల్లే 240 సీట్లకు పరిమితం

- మోడీ, బీజేపీపై ఆర్ఎస్ఎస్ నేత ఇంద్రేశ్‌కుమార్ విమర్శ
- నిజమైన సేవకుడు అహంకారంతో ఉండడు: మోహన్ భగవత్



వివరాలు 11లో

## వాయనాడ్ నుంచి ప్రియాంక పోటీ..!



న్యూఢిల్లీ : కేరళలోని వాయనాడ్‌లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ పోటీ చేసే అవకాశం ఉన్నట్టు ఓ సీనియర్ కాంగ్రెస్ నేత తెలిపారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేరళలోని వాయనాడ్, యూపీలోని రాయబరేలీ స్థానాల నుండి విజయం సాధించిన ...11లో

## గుజరాత్‌లో మత వివక్ష

- ముస్లిం మహిళ పట్ల స్థానికుల అభ్యంతరం
- ప్రభుత్వ పథకం కింద ఇల్లు కేటాయించొద్దని డిమాండ్
- ఆమె రాకతో ముప్పు ఏర్పడుతుందని ఆందోళన
- జిల్లా కలెక్టర్‌కు లేఖ.. వడోదరలో ఘటన



వివరాలు 3లో

## పెద్దపల్లిలో అమానుషం

### ఆరేండ్ల చిన్నారిపై లైంగికదాడి.. ఆపై గొంతు నులిమి హత్య

- తల్లి పక్కలో నుంచి అర్ధరాత్రి ఎత్తుకెళ్లిన దుండగుడు
- గాలించి పట్టుకున్న పోలీసులు
- నిందితున్ని ఉరి తీయాలని జనం ఆందోళన
- బాధిత కుటుంబంతో కలిసి రోడ్డుపై బైటాయింపు



దుండగుడిని ఉరితీయాలని డిమాండ్ చేస్తూ ధర్నా

### పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేయండి

- సీఎం రేవంత్ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెద్దపల్లి జిల్లాలో ఆరేండ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన అమానుష ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం తీవ్రంగా స్పందించారు. వెంటనే ఘటనకు బాధ్యుడైన వ్యక్తిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు

నవతెలంగాణ - సుల్తానాబాద్

రోజంతా ఆడుకుని రాత్రి అమ్మ పక్కన హాయిగా నిద్రపోతున్న చిన్నారిని అర్ధరాత్రి బూచోడిలా ఓ దుండగుడు ఎత్తుకెళ్లాడు. ఆపై లైంగిక దాడి చేసి అనంతరం గొంతు నులిమి చంపేశాడు. ఆ కుటుంబంతోపాటే రోజూ పని చేసే వలస కార్మికుడే ఈ దురాఘతానికి ఒడిగట్టాడు. ఈ అమానుష ఘటన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఓ రైస్‌మిల్లులో గురువారం అర్ధరాత్రి జరిగింది. పరారీలో ఉన్న నిందితుని పోలీసులు అదుపులోకి తీసుకోగా ఆ కిరాతకుడ్ని నడి రోడ్డుపై ఉరి తీయాలంటూ స్థానిక ప్రజలు ఆందోళనకు దిగారు. చిన్నారి తల్లిదండ్రులతో కలిసి కరీంనగర్ రాజీవ్ రహదారిపై బైటాయించారు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు ...11లో

## కవితతో కేటీఆర్ ములాఖాత్

### రెండు నెలల తర్వాత తీహార్ జైల్లో చెల్లిని కలిసిన అన్న

- ధైర్యంగా ఉండాలని సూచన
- కవితను కలిసిన మాజీ ఎంపీ వినోద్ కుమార్

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్ ములాఖాత్ అయ్యారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఆయన తీహార్ జైలుకు చేరుకున్నారు. అనంతరం జైలు నిబంధనల ప్రకారం దాదాపు 20 నిమిషాల పాటు కవితతో ముచ్చటించారు. ఈ సందర్భంగా న్యాయపర అంశాలపై చర్చించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ మనో ధైర్యం వీడొద్దని, తాము తోడుగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఇప్పటికే హైకోర్టులో బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ అయినందున, ఆ తీర్పు ప్రతికూలంగా వస్తే చేపట్టాల్సిన ...11లో



(ఫైల్)

### కేటీఆర్ ఎన్నిక చెల్లదని పిటిషన్

- హైకోర్టు నోటీసులు జారీ 2లో..

## పవన్‌కు పంచాయతీరాజ్

### ఐటీ మంత్రిగా లోకేష్

- అనితకు హోంమంత్రిత్వ శాఖ
- పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక, అసెంబ్లీ వ్యవహారాలు
- ఏపీలో శాఖల కేటాయింపు



(ఫైల్)

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో మంత్రివర్గానికి శాఖలు కేటాయించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. గెజిట్ నోటిఫికేషన్ సైతం విడుదలైంది. టీడీపీతోపాటు జనసేన, బీజేపీకి చెందిన సభ్యులు ఇటీవల మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. అనంతరం సచివాలయంలో సీఎం చంద్రబాబు జలవనరుల శాఖ అధికారులతో భేటీ అయ్యారు. పోలవరం సహా ఆయా ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సోమవారం పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు సందర్శించే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు శ్వేత పత్రాలు విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. గత పాలనకు ...2లో

# కారు స్టీరింగ్ ఎవరికి?

### హరీశ్‌కా... ప్రవీణ్‌కా..



- బీఆర్ఎస్ బాస్ సమాలోచనలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు పార్టీకి దూరమయ్యాయని ఆవేదన
- వారిని దగ్గర చేర్చుకునేందుకు ఎత్తుగడలు
- 'వెనకుండాలి.. అన్నీ తానై నడిపించాలి...' అనే వ్యూహం
- త్వరలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం
- ప్రముఖులతో సమాలోచనలు
- కార్యకర్తలు, అనుబంధ సంఘాలకు శిక్షణా శిబిరాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో వరస ఓటముల తర్వాత... ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రక్షాళనకు సిద్ధమైంది. శాసనసభ ఎలక్షన్లలో అధికారాన్ని కోల్పోయినప్పటికీ ఎంపీ ఎన్నికల్లో కొన్ని సీట్లను గెలవటం ద్వారా తిరిగి పుంజుకుంటామని భావించిన ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులకు నిరాశే ఎదురైంది. మరోవైపు అత్యధిక స్థానాల్లో క్రాస్ ఓటింగ్ చేయటం ద్వారా గులాబీ పార్టీ... ఎనిమిది సీట్లలో గెలవటానికి 'కమలానికి' దోహదపడిందనే అపవాదును మూటగట్టుకుంది. ఇలాంటి వైఫల్యాలన్నింటి నుంచి గట్టెక్కాలని భావించారో ఏమోగానీ...బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ ప్రక్షాళనకు నడుం బిగించారు. ఇందులో భాగంగా ఇంతకాలం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న తాను, ఇప్పుడు ఆ బాధ్యత నుంచి తప్పుకుని వేరే వారికి ఆ పదవిని అప్పగిస్తే ఎలా ఉంటుందని యోచిస్తున్నట్టు సమాచారం. ఇదే సమయంలో గౌరవాధ్యక్షుడి స్థానంలో 'అన్నీ తానై వెనకుండి' పార్టీని నడిపించాలని ఆయన భావిస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు మాజీ సీఎం తనకు అత్యంత సన్నిహితులు, సీనియర్లతో సమాలోచనలు జరుపుతున్నట్టు వినికిడి.

పార్టీ అధ్యక్షుడి స్థానాన్ని ట్రబుల్ షూటర్‌గా పేరు తెచ్చుకున్న ...11లో

## జమిలీపై కోవింద్ కమిటీ నివేదిక

### త్వరలో క్యాబినెట్ ముందుకు



ఢిల్లీ: వంద రోజుల ఎజెండాలో భాగంగా సాధ్యమైనంత త్వరగా 'ఒకే దేశం.. ఒకే ఎన్నికలు' సాధ్యాసాధ్యాలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ ఇచ్చిన నివేదిక కేంద్ర క్యాబినెట్ ముందుకురానుంది. ఇందుకు కేంద్ర న్యాయశాఖ సంసిద్ధమవుతున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వరుసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలి వంద రోజుల్లో చేపట్టే కార్యక్రమాల ప్రణాళిక రూపొందించుకోవాలని లోక్‌సభ ఎన్నికలకు ముందే ప్రధాని మోడీ అన్ని శాఖలకు సూచించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో న్యాయశాఖలోని శాసన విభాగం ...11లో

## రన్నింగ్ బస్సు దిగుతూ చక్రాల కింద పడి..

- ఇంటర్ విద్యార్థిని మృతి



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

హైదరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కదులుతున్న బస్సు నుంచి ఓ విద్యార్థిని కిందకు దిగుతూ జారి చక్రాల కింద పడిపోయింది. దాంతో అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. బోరబండ సంజయ్ నగర్‌కు చెందిన మెహరీన్(17) యూసుఫ్‌గూడలోని మాస్టర్స్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఆమె అక్క కూడా అదే కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. శుక్రవారం కాలేజీ అయిపోయిన అనంతరం యూసుఫ్‌గూడ చెక్ పోస్ట్ బస్టాప్‌లో కూకట్‌పల్లి డిపోకు చెందిన బస్సులో మెహరీన్ ఎక్కి ఫుట్ బోర్డుపై నిల్చుంది. అయితే బస్సులో ముందువైపు మహిళలతో నిండిపో వడంతో ఆమె అక్క ఎక్కలేదు. అది గమనించిన మెహరీన్ తాను కూడా దిగి ఇద్దరు కలిసి వేరే బస్సులో రావాలనే ప్రయత్నంలో కదులుతున్న బస్సును దిగేందుకు యత్నించింది. ఈ క్రమంలో ఆమె జారి కింద పడిపో యింది. డ్రైవర్ గమనించకపోవడంతో బస్సు ముందు చక్రాలు, వెనుక చక్రాలు కూడా ఆమెపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే విద్యార్థిని మృతిచెం దింది. మధురానగర్ పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

## వంద పడకల ఆస్పత్రుల్లో బ్లడ్ బ్యాంకులు

-మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతి జిల్లా కేంద్రంతో పాటు వంద పడకలున్న ప్రతి ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకులను ఏర్పాటు చేయాల్సిన అవసరముందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్ సీఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ సమీపంలో నిర్వహించిన ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లడ్ బ్యాంకుల ఏర్పాటు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ అధికారులను కోరారు. తాను కూడా ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డితో పాటు, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. వీటి ఏర్పాటు కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను వినియోగించుకోవాలని సూచించారు. అవి సరిపోకపోతే ప్రభుత్వం సహకరిస్తుందని భరోసానిచ్చారు. ఐఆర్ సీఎస్ కొనే వాహనాల రిజిస్ట్రేషన్‌పై పన్ను మినహాయింపునివ్వాలనీ, తలసేమియా రోగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఐఆర్ సీఎస్ చేసిన వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. వీటిని పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు మూఢ నమ్మకాలు తొలగించుకోవాలని కోరారు. రక్తదానంతో శరీరంలో రక్తం తగ్గదని స్పష్టం చేశారు. ప్రతి 120 రోజులకు ఒకసారి శరీరంలో కొత్త రక్తం ఉత్పత్తి అవుతుందని చెప్పారు. రాజ్ భవన్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ రక్తదాతలు,, రక్తాన్ని స్వీకరించే వారంతా రక్తబంధువులేనని అభివర్ణించారు. వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా చొంగ్తూ మాట్లాడుతూ అన్ని దానాల్లో ప్రాణాన్ని నిలిపే రక్తదానం విశిష్టమైందని తెలిపారు. ఐఆర్ సీఎస్ ప్రధాన కార్యదర్శి కె.మదన్ మోహన్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐఆర్ సీఎస్ అందిస్తున్న సేవలను వివరించారు. అత్యధికసార్లు రక్తదానం చేసిన రక్తదాతలను, రక్తదాన ప్రచారకులను అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ తెలంగాణ బ్రాంచ్ చైర్మెన్ అజయ్ మిశ్రా, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, గవర్నర్ సంయుక్త కార్యదర్శి జె. భవానీశంకర్ పాల్గొన్నారు.

## నిమ్స్‌లో ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని పలువురు డాక్టర్లు సూచించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిమ్స్ ఆస్పత్రి బ్లడ్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, బ్లడ్ బ్యాంక్ విభాగాధిపతి బి. శాంతి ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ డాక్టర్లు డాక్టర్ మహేష్, డాక్టర్ సుధీర్, డాక్టర్ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యాగౌడ్ తదితరులతో కలిపి 150 మంది రక్తదానం చేశారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 11 వేల మంది రక్తదానం చేసినట్టు శాంతి తెలిపారు. రక్తదాతలను ఆమె సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీజీలు టెక్నికల్ స్టాఫ్ మల్లికార్జున్, బిడుగు శేఖర్ నర్సింగ్ స్టాఫ్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మే నెల పారితోషికాలు చెల్లించాలి

- ఆశా యూనియన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మే నెల పారితోషికాలు తక్షణమే చెల్లించాలని ఆశా యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, రాష్ట్ర నాయకులు ఎం.మీనా, టి.యాదమ్మ,రాణి, లత, రీటా, రఫత్ పర్వీన్ శుక్రవారం వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్.వీ.కర్ణన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మే 29న 23 డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించామనీ, వాటన్నింటిని పరిష్కరించాలని కోరారు. అయితే పారితోషికాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయలేదనీ, బడ్జెట్ లేదని ప్రభుత్వం చెబుతున్నట్టు అధికారులు యూనియన్ నాయకులకు తెలిపారు. జూన్ నెల ప్రారంభమై 14 రోజులు గడుస్తున్నా గత నెల చేసిన పనికి పారితోషికాలు రాక ఆశాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని కమిషనర్‌కు తెలిపారు. వారి ఇబ్బందుల గురించి ప్రభుత్వంతో మాట్లాడి అకౌంట్లలో డబ్బులు వేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

## పేపర్ లీక్ కాకుంటే బీహార్‌లో 13 మంది అరెస్ట్ ఎందుకు...?

(మొదటిపేజీ తరువాయి)

మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. సుప్రీం పర్యవేక్షణలో జరుగుతున్న ఫోరెన్సిక్ విచారణే లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కాపాడుతుందన్నారు. నీట్ పేపర్ లీక్ కాకపోతే బీహార్‌లో పేపర్ లీక్ పేరుతో 13 మందిని ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. కోచింగ్ సెంటర్ యజమాని, పరీక్షా కేంద్రం నిర్వాహకులు కుమ్మక్కు కావడం వల్లే నీట్ పరీక్షా పత్రం లీకైందని, డబ్బులు ముట్టాయని ఆయన పేర్కొన్నారు. గుజరాత్‌లోని గోద్రాలో చీటింగ్ రాకెట్ గుట్టు రట్టు కాలేదా? అని నిలదీశారు. ఎన్టీఏను దుర్వినియోగం చేసిన కేంద్రం దేశంలోని 24 లక్షల మంది యువత ఆకాంక్షలను తుంగలో తొక్కిందన్నారు. నీట్ యూజీ-2024 కుంభకోణంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు రాకుండా చేసేందుకే కేంద్రం ఈ ఆటలాడినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) డైరెక్టర్ జనరల్‌ను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిందని తెలిపారు. కానీ దీనిపై విచారణ జరపాలన్న డిమాండ్‌ను పట్టించుకోకపోవడం బాధ్యతా రాహిత్యం అని వ్యాఖ్యానించారు.

## కేటీఆర్ ఎన్నిక చెల్లదని పిటిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సిరిసిల్ల సీటు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేటప్పుడు బీఆర్ఎస్ సీనియర్ నేత కేటీఆర్ సమర్పించిన ఎలక్షన్ అఫిడవిట్‌లో కొడుకు హిమాన్ష్ ఆస్తిని ఎలా సమకూర్చుకున్నది వివరించలేదంటూ కాంగ్రెస్ నేత కే.కే మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్ ఎలక్షన్ పిటిషన్లు వేశారు. వీటిని విచారించిన హైకోర్టు, కేటీఆర్‌తోపాటు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, రిటర్నింగ్ అధికారి అయిన ఆర్డీవోలకు నోటీసులిచ్చింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తూ శుక్రవారం జస్టిస్ ఎస్. రాజేశ్వరరావు ఆదేశాలిచ్చారు. తన భార్య, కూతురు మాత్రమే తనపై ఆధారపడ్డారనీ, కొడుకు హిమాన్ష్ మేజరని, తనపై ఆధారపడలేదని చెప్పారు. సిద్దిపేట మర్కూక్ మండలం వెంకటాపూర్‌లో 4 ఎకరాలు, ఎరబల్లిలో 32 ఎకరాలను హిమాన్ష్ కొన్నారనీ, దీనికి రూ.కోటి అయ్యిందనీ, ఈ డబ్బు హిమాన్ష్‌కు తండ్రి నుంచే వచ్చింది కాబట్టి ఈ వివరాలు చెప్పని కేటీఆర్ ఎన్నిక చెల్లదని తీర్పు చెప్పాలని కోరారు. వాదనల అనంతరం కేటీఆర్, ఈసీలకు, సిరిసిల్ల ఆర్డీవోలకు నోటీసులు ఇచ్చిన న్యాయమూర్తి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు

# నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి

- ఎన్టీఏ చైర్మెన్ డైరెక్టర్లను తప్పించాలి
- దోషులు ఎంతటివారైనా వదలొద్దు : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, నాగరాజు
- ఎస్వీకే వద్ద భారీ ర్యాలీ, నిరసన




నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలో నీట్ పరీక్ష గందరగోళం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం..గ్రేస్ మార్కులను తొలగిస్తామని చెప్పడం కాదు.. పేపర్ లీకేజీపై విచారణ జరిపి దోషులు ఎంతటి వారైనా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.. అనంతరం నిరసన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ.. నీట్ గ్రేస్ మార్కులు రద్దు చేసి.. ఈ నెల 23న రీ-ఎగ్జామ్ నిర్వహించి, 30న ఫలితాలు ఇస్తామని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలపడం కాదని, అసలు పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష లీకేజీపై కేంద్రం స్పందించకుండా.. ఎవరైతే గ్రేస్ మార్కులు పొందారో వారి స్కోర్ కార్డులు రద్దు చేసి, వారికి మళ్లీ రీ-ఎగ్జామ్ నిర్వహించడమంటే.. నీట్ అవకతవకలపై పక్కదారి పట్టించడమేనన్నారు. దీని వల్ల నీట్ ర్యాంకులు తారుమారై గందరగోళం ఏర్పడుతుందన్నారు. నీట్ పరీక్షపై ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయ కుండా, ఎన్టీఏ ఏకపక్షంగా వ్యవహరిస్తోం దన్నారు. పరీక్ష కంటే ముందు రోజు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో 13మందిని పేపర్ లీకేజీలో అరెస్టు చేశారని గుర్తు చేశారు. హర్యానాలో ఒకే సీరియల్ నెంబర్ కలిగిన ఎనిమిది మంది విద్యార్థులకు టాప్ ర్యాంకులు వచ్చాయని, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో ఇలాంటి లీకేజీ అంశాలు ముందుకొచ్చాయని చెప్పారు. వాటిపై విచారణ జరపకుండా కేవలం గ్రేస్ మార్కులు మాత్రమే రద్దు చేసి రీ ఎగ్జామ్ పెట్టడమంటే నీట్ అవకతవకలను విస్మరించడం అవుతుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రమే నీట్ ర్యాంకులు, పేపర్ లీకేజీ ఘటనలు జరుగుతున్నాయని, వాటిపై తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు నేతృత్వంలో విచారణ జరపాలన్నారు. మొత్తం రీ- ఎగ్జామ్ నిర్వహించి, ఎన్టీఏను రద్దు చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్టీఏ చైర్మెన్, డైరెక్టర్లను తప్పించాలని, వారిపై సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శు లు దామెర కిరణ్, మమత, వీరభద్రం, కె.అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రశాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య, లెనిన్ గువేరా, మందా శ్రీకాంత్, యార ప్రశాంత్, తారాసింగ్, జె.రమేష్, విఘ్నేష్, వినోద్, ప్రశాంత్, అరవింద్, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# పవన్‌కు పంచాయతీరాజ్

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికీ భిన్నత్వాన్ని చూపించాలని మంత్రులకు చంద్రబాబు చెబుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సచివాలయంలో ఉండాలనీ, కచ్చితంగా సమయ పాలన పాటించాలని నిర్ణయించారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో కొత్త మంత్రుల పర్యటన పూర్తయ్యాక తొలి క్యాబినెట్ భేటీ నిర్వహించే అవకాశముందని తెలిసింది. పోలవరం పర్యటన పూర్తయ్యాక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ప్రతిరోజూ సచివాలయానికి మంత్రులు రావాలని తనను కలిసిన మంత్రులకు చంద్రబాబు సూచించారు.

శాఖలపై పట్టు పెంచుకోవాలనీ, పాలనాపరంగా పూర్తిస్థాయి అవగాహన ఏర్పరచుకోవాలని మంత్రులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

### మంత్రులు... శాఖలు

1. చంద్రబాబు : సీఎం, సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు
2. పవన్‌కల్యాణ్ : పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణం, శాస్త్ర, సాంకేతిక శాఖలు
3. లోకేష్ : విద్యాశాఖ, ఐటీ, కమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ
4. అచ్చెన్నాయుడు : వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య శాఖ
5. కొల్లు రవీంద్ర : గనులు, భూగర్భ, అబ్కారీ శాఖ
6. నాదెండ్ల మనోహర్ : ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు
7. పి నారాయణ: పురపాలక, పట్టణాభివద్ధి
8. వంగలపూడి అనిత: హెూం, విపత్తుల నిర్వహణ
9. ఆనం రాం నారాయణ రెడ్డి: దేవదాయ శాఖ
10. పయ్యావుల కేశవ్: ఆర్థిక శాఖ, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాలు శాఖ
11. కొలుసు పార్థసారథి: గహ, సమాచార, పౌర సంబంధాలు
12. గొట్టిపాటి రవికుమార్: విద్యుత్
13. సత్యకుమార్ యాదవ్: ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమం, వైద్య, విద్య
14. ఎన్.రామానాయుడు : జలవనరుల అభివృద్ధి
15. ఎన్ఎండీ ఫరూక్ : న్యాయ, జస్టిస్, మైనార్టీ సంక్షేమం
16. బాల వీరాంజనేయస్వామి : సాంఘీక సంక్షేమం, సచివాలయం
17. గొట్టిపాటి రవి : విద్యుత్
18. కందుల దుర్గేష్ : పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ
29. జి. సంధారాణి : మహిళా శిశుసంక్షేమం, గిరిజన సంక్షేమం
20. బీసీ జనార్థన్‌రెడ్డి : రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు
21. టీజీ భరత్ : పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి
22. ఎస్.సవిత : బీసీ సంక్షేమం,హ్యాండ్లూమ్స్, టెక్‌టైల్స్‌త
23. వాసంశెట్టి సుభాష్ : కార్మిక, కర్మాగార, బాయిలర్లు, వైద్యబీమా సేవలు
24. కొండపల్లి శ్రీనివాస్: ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ, సాధికారత, సంబంధాలు
25. ఎం. రాంప్రసాద్‌రెడ్డి : రమాణా, యువజన,క్రీడలు

# శంకర్‌దాదాల తయారీ!

(మొదటిపేజీ తరువాయి)

తుషార్ భట్ సహా ఐదుగురు నిందితులు, ఇద్దరు ప్రధానోపాధ్యాయులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. వారందరి బెయిల్ పిటిషన్లను కోర్టు తిరస్కరించింది. 30 మంది అభ్యర్థుల తల్లిదండ్రులను కూడా పోలీసులు విచారించారు.

**కోట్లల్లో డీల్..**

నీట్ పేపర్ లీక్ వెనుక రూ.2.30 కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. ఇందులో పాత్రధారులు వెలుగులోకి రాగా.. .సూత్రధారులెవరన్నదానిపై ఇంకా మిస్టరీ కొనసాగుతోంది. అయితే బీజేపీ నేతల హస్తం లేకుండా పేపర్ లీక్ అసాధ్యమన్న వాదనలు వినిపిస్తున్నాయి. రాయ్ ఓవర్సీస్ యజమాని పరశురామ్ రాయ్‌కు మెడికల్ అడ్మిషన్ కోసం విద్యార్థుల తల్లిదండ్రులు చెక్కులు, డబ్బులు అందజేశారు. పరశురామ్ రాయ్ చెక్కుల ద్వారా రూ.2.30 కోట్ల ఆర్థిక లావాదేవీలు నడిపినట్టు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసులో ఎనిమిది బ్లాంక్ చెక్కులు, రూ.2.30 కోట్ల విలువైన చెక్కులు, ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తల్లిదండ్రులు, విద్యార్థుల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు కూడా వెలుగులోకి వచ్చాయి. అనుమానిత విద్యార్థులు, తల్లిదండ్రుల వాంగ్మూలాలను కూడా పోలీసులు తీసుకుంటున్నారు. నిందితుల మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. డబ్బులు తీసుకుని విద్యార్థులందరినీ నీట్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యేలా చేయాలన్న కుట్రే ఇదని పంచమహల్ ఎస్పీ హిమాన్షు సోలంకి తెలిపారు.

ఢిల్లీ హైకోర్టు సహా ఏడు హైకోర్టుల్లో నీట్ పరీక్ష కేసులపై దాఖలైన పిటిషన్లను బదిలీ చేయాలని జూన్ 14న ఎన్టీఏ సుప్రీంకోర్టుకు దరఖాస్తు చేసింది. వీటిలో ఒక పిటిషన్‌లో నీట్ పరీక్ష పేపర్ లీక్‌పై సీబీఐ విచారణకు డిమాండ్ చేశారు. ఈ పిటిషన్‌లో, పెద్ద ఎత్తున పేపర్ లీక్‌ల సంఘటనలను ఉటంకిస్తూ, కావాల్సిన పరీక్షా కేంద్రాన్ని ఎంచుకోవడానికి అనుసరిస్తున్న వ్యూహాల గురించి కూడా ప్రస్తావించి మరీ దండుకున్నట్టు తేలింది.

**ఆ మూడు రాష్ట్రాల విద్యార్థులు కోరుకున్నట్టుగా..**

ఉదాహరణకు ఒడిశా, జార్ఖండ్, గుజరాత్ వంటి రాష్ట్రాల విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరయ్యేందుకు గుజరాత్‌లోని గోద్రాలో ప్రత్యేక కేంద్రాన్ని ఎంచుకున్నారు. గోద్రాలోని ప్రత్యేక కేంద్రమైన జై జల్ రామ్ స్కూల్‌ను తమ కేంద్రంగా ఎంచుకోవడానికి రూ.10 లక్షలు లంచం ఇచ్చారు.

**ఎన్టీఏ సహకారం అందిస్తుందా..?**

పోలీసులు ఎన్టీఏ నుంచి అవసరమైన సమాచారం కోరారు. ఈ విద్యార్థులకు ఈ పరీక్షా కేంద్రాన్ని ఎలా కేటాయించారని ఎన్టీఏ అధికారులను అడిగారు? అసలు మొత్తం ప్రక్రియ ఏమిటి? సిబ్బందిని ఎలా కేటాయించారు? సిబ్బంది ఎంపిక ప్రక్రియ ఏమిటి? అంటూ ప్రశ్నలు సంధించారు. ప్రస్తుతం ఎన్టీఏ నుంచి ఇంకా ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు రాగానే ఎంపికలోనే స్కామా లేక పరీక్షలోనే స్కామ్ జరిగిందా అనేది తేలిపోనుంది.

**బీహార్‌లో కాలిన పేపర్లు లభ్యం**

బీహార్ పోలీసులు స్వాధీనం చేసుకున్న పేపర్లు, ఇవి లీకైన కాగితాలా కాదా అనేది ఇంకా స్పష్టంగా తెలియలేదని, దీనికి సంబంధించి ఎన్టీఏ ఎటువంటి సమాధానం ఇవ్వలేదని బీహార్ పోలీసులు అంటున్నారు. మధ్యప్రదేశ్, గుజరాత్ నుంచి బీహార్‌కు పేపర్ వచ్చినట్టు విచారణలో తేలింది. మూలాలను విశ్వసిస్తే, రవాణా సమయంలో పేపర్ లీక్ అయింది. వీటితో పాటు బీహార్ పోలీసులు లీకైన ప్రశ్న పత్రాలు కాలిపోయినట్టు కూడా గుర్తించారు. పేపర్ లీక్ కేసులో 13 మందిని అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కొందరు అభ్యర్థుల బంధువులు, బ్రోకర్లు కూడా ఉన్నారు. నీట్ పేపర్ లీక్ కేసులో పలువురు నిందితులు పోలీసుల వద్ద నేరం ఒప్పుకున్నారు.

**విద్యార్థులు హెచ్చరిస్తున్నా..**

నీట్ పరీక్షలో మొదటి నుంచి అక్రమాలు జరుగుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. పేపర్ లీక్‌పై విద్యార్థులు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించినా పరీక్ష ఆపలేదు. ఇప్పుడు గ్రేస్ మార్కులు వచ్చిన 1563 మంది విద్యార్థులకు జూన్ 23న మళ్లీ పరీక్షలు నిర్వహించాలని ఎన్టీఏ నిర్ణయించడంతో విద్యార్థుల ఆగ్రహం మరింత పెరుగుతోంది. ఎన్టీఏ తన తప్పును దాచుకునేందుకే ఇలా చేసిందని, దీని వల్ల 23 లక్షల మంది విద్యార్థులకు న్యాయం జరగబోదన్నారు.

## టీఎన్జీవో ప్రధాన కార్యదర్శిగా ముజీబ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారులు (టీఎన్జీవో) కేంద్రసంఘం ప్రధాన కార్యదర్శిగా ముజీబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులను సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రకటించాలని కోరారు. పీఆర్సీ రెండో కమిటీ తొందరగా నివేదికను అందజేయాలనీ, మెరుగైన ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని అన్నారు. కాంట్రిబ్యూషన్ ద్వారా అన్ని రిఫరల్ ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స కోసం ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)ను అమలు చేయాలని చెప్పారు.

JM FINANCIAL

జెఎం ఫైనాన్షియల్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ గుర్తింపు నెంబర్: U67190MH2007PLC74287
రిజిస్టర్డ్ ఆఫీసు చిరునామా: 7వ అంతస్తు, సినెర్జీ, అప్పాసాహెబ్ మరాఠె మార్గ్, ప్రభాదేవి, ముంబయి-400025
T: +91 22 6630 3030 | F: +911 22 6630 3223 | www. Jmfinancialarc.com

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3(1)తో చదవగల దిసెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002లోని సెక్షన్ 13(2) ప్రకారం పిరామల్ క్యాపిటల్ &హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇంతకుముందు దీవాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా తెలిసినది) వారు జెఎంఎఫ్ఏఆర్‌సి(జెఎం) (ఇకమీదట అసైనీగా పేర్కొబడును) వారిపేరున తేది.29 మార్చ్, 2023నాటి అసైన్‌మెంట్ అగ్రిమెంట్ ('ది అసైన్‌మెంట్ అగ్రిమెంట్') ఆధారంగా సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ("SARFAESI చట్టం")లోని సెక్షన్ 5(1)(బి) ప్రకారం అన్ని హక్కులు, టైటిల్ మరియు దానిపై వడ్డీతోసహా దానికోసం క్రియేట్‌చేసిన అంతర్లీన సెక్యూరిటీ ఇంట్రెస్ట్‌తోసహా (దిగువ పేర్కొన్న రుణాలతోపాటుగా) పూల్ ఆఫ్ లోన్‌ను అప్పగించింది. దిగువ సంతకందారు (జెఎం) అసైనీయొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరుచట్టం) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్3తో చదవగల సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, అధీకృత అధికారి సదరు చట్టంలోని సెక్షన్13(2) ప్రకారం బకాయిలను తిరిగిచెల్లించాలని కోరుతూ రుణగ్రహీత(లు) ("సదరు రుణగ్రహీతలు") డిమాండ్ నోటీసుజారీచేశారు, వారివివరాలు కూడా దిగువ ఇవ్వబడినవి. పైన పేర్కొన్న దానికి అనుగుణంగా, ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, రుణగ్రహీత(లు) జెఎం వారికి చెల్లించాల్సిన బకాయిని ఈ ప్రకటన జారీ చేయబడిన తేదీ నుంచి 60రోజుల్లోపు తిరిగిచెల్లించాల్సి ఉంటుంది. చెల్లించాల్సిన బకాయిల మొత్తాలు దిగువ చూపబడినవి. సదరు మొత్తాన్ని భవిష్యవడ్డీతోపాటుగా కలుపుకొని డిమాండ్ నోటీసులో పేర్కొన్న విధంగా దిగువ పేర్కొన్న తేదీ/లకు అనుగుణంగా బకాయి చెల్లింపు తేదీనాటికి లెక్కించి తిరిగిచెల్లించవలెను. సదరు మొత్తాన్ని రుణ ఒప్పందంలోని డాక్యుమెంట్లు/రైటింగ్ అనుగుణంగా ఒకవేళ రుణగ్రహీత(ల) ద్వారా జారీచేయబడి ఉన్నట్టయితే దీనిలోని నిబంధనలకు అనుగుణంగా తిరిగిచెల్లించాల్సి ఉంటుంది. రుణాల బకాయికి సంబంధించి సెక్యూరిటీగా దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు సంబంధించిన ఆస్తులు జెఎంవద్ద తనఖాపెట్టబడినవి.

| రుణగ్రహీత(లు), హామీదారు(ల) యొక్క పేరు | డిమాండ్ నోటీసు తేదీ మరియు ఎన్‌పిఏ తేదీతో మొత్తం | సెక్యూర్డ్ ఆస్తి యొక్క వివరాలు (స్థిరాస్తి) |
|---|---|---|
| (ఎల్‌సి నెం.00700011611 హైదరాబాద్ బ్రాంచ్) రోజ కామరాజుగడ్డ (రుణగ్రహీత) నాగేశ్వర రావు కామరాజుగడ్డ (సహ-రుణగ్రహీత 1) | ఓపెన్ ప్లాట్ నెం.24, అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామం, రామోజీ ఫిల్మ్‌సిటీ దగ్గర, హయాత్‌నగర్ మండలం, హైదరాబాద్, రంగారెడ్డి, తెలంగాణ-501505. | 28-05-2024/ రూ.1386064/- (రూపాయలు పదమూడు లక్షల ఎనభైఆరువేల అరవైనాలుగు మాత్రమే) ఎన్‌పిఏ తేది (11-03-2021) |
| (ఎల్‌సి నెం.06500001725 కరీంనగర్ బ్రాంచ్)రోజ కామరాజుగడ్డ (రుణగ్రహీత) నాగేశ్వర రావు కామరాజుగడ్డ (సహ-రుణగ్రహీత 1) | ప్లాట్ నెం.49, శ్రీ లక్ష్మీ సాయి నగర్, శ్రీనివాస గార్డెన్ దగ్గర, మంచిర్యాల, ఆదిలాబాద్, తెలంగాణ-504208 | 28-05-2024/ రూ.2395268/- (రూపాయలు ఇరవైమూడు లక్షల తొంభైఐదువేల రెండువందల అరవైఎనిమిది మాత్రమే) ఎన్‌పిఏ తేది (12-05-2021) |

పైన పేర్కొన్న విధంగా జెఎం వారికి సంబంధిత రుణగ్రహీతలు బకాయిలను తిరిగిచెల్లించడంలో విఫలమైనట్లయితే, సదరు చట్టంలోని సెక్షన్ 13(4) మరియు వర్తింపదగిన నిబంధనలకు ప్రకారం జెఎం వారు సదరు సెక్యూరిటీ ఆస్తులకు సంబంధించి అనుగుణంగా ముందుకెళ్తారని తెలియజేయనైనది. ఈక్రమంలో పూర్తి రిస్క్ అయ్యే వ్యయప్రయాసలను రుణగ్రహీతలే భరించాల్సి ఉంటుందని తెలియజేయనైనది. సంబంధిత రుణగ్రహీతలు పైన పేర్కొన్న సంబంధిత చట్టం ప్రకారం ఆస్తులను ఇతరుల పేరిట బదలాయించడం, విక్రయించడం, లీజుకు ఇవ్వడం లేదా మరేఇతర మార్గాల ద్వారా లావాదేవీలకు పాల్పడటం నిషేధించబడింది. ఎలాంటి కార్యకలాపాలను చేపట్టాలని భావించినా జెఎం వారి నుంచి లిఖిత పూర్వకంగా అనుమతి పొందాల్సి ఉంటుంది. పైన పేర్కొన్న యాక్ట్‌లోని నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించినా, అతిక్రమించినా సదరు చట్టంలోని నిబంధనల మేరకు వారంతా శిక్షించబడతారు మరియు/లేదా జరిమానా విధించబడతారని తెలియజేయనైనది.

తేది: 15-06-2024,
ప్రదేశం: నిజామాబాద్, తెలంగాణ

సం/- (అధీకృత అధికారి)
జెఎం ఫైనాన్షియల్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్

## రైతుల సాయంపై రంధ్రాన్వేషణ చేస్తారా?

- సీఎం రేవంత్‌కు నిరంజన్‌రెడ్డి ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతులకు ఇచ్చే సాయంపై కూడా రంధ్రాన్వేషణ చేస్తారా? అంటూ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. రుణమాఫీ అందరికీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరైందికాదని పేర్కొన్నారు. రుణమాఫీ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ డేటాను ప్రాతిపదికగా తీసుకోవాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల హామీమేరకు ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినా ఇంకా కట్ ఆఫ్ డేట్ కూడా నిర్ణయించకపోవడమేంటని ప్రశ్నించారు. దేశంలోనే కేసీఆర్ తొలిసారి రైతుబంధు పథకం అమలు చేయడంతో కేంద్రంపై ఒత్తిడి పెరిగి పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకాన్ని తీసుకొచ్చిందని ఆయన గుర్తు చేశారు.

## కేసీఆర్ అవినీతిపై ఈడీ, సీబీఐలతో విచారణ జరిపించాలి

- గజ్జెల కాంతం, సతీష్ మాదిగ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అవినీతి జరిగిందని కాంగ్రెస్ నేతలు గజ్జెల కాంతం, సతీష్‌మాదిగ ఆరోపించారు. కేసీఆర్ అవినీతిపై రాష్ట్రానికి చెందిన విచారణ సంస్థలతోపాటు ఈడీ, సీబీఐలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆయన్ను వెంటనే కేసిఆర్‌ను జైలుకు పంపాల్సిన అవసరముందన్నారు. కాళేశ్వరంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేయాలని కోరారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ముప్పై వేల ఎకరాల ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని తెలిపారు. ఇందులో కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, కల్వకుంట్ల కవిత భాగస్వాములేనని వారు ఆరోపించారు. దేశంలో గోమాతకు ఉన్న రక్షణ, మాతృమూర్తులకు లేదన్నారు. బీజేపీ పాలనలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయనీ, చివరకు బేటీ బచావో అనే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ సీనియర్ నేత యడ్యూరప్ప 17 ఏండ్ల బాలికను లైంగిక వేధింపులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

## చేసిన తప్పులకు కేసీఆర్ సమాధానం చెప్పాల్సిందే...

- డాక్టర్ లింగం యాదవ్, ఇందిరా శోభన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పులకు, చేసిన పొరపాట్లకు మాజీ సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాల్సిందేనని టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్ డిమాండ్ చేశారు. ఆయన పాలన భూకబ్జాలు, లిక్కర్, గొర్రెలు, చేపల వంటి కుంభకోణాలతో నిండిపోయిందని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేత ఇందిరా శోభన్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. గొర్రెల కుంభకోణంలో మాజీ సీఎంకు ఇప్పటికే ఈడీ నోటీసులు జారీ చేసిందన్నారు. తమ కుటుంబానికి ప్రయోజనం చేకూర్చేలా ఆయన వ్యవహరించారని విమర్శించారు. కేసీఆర్ అరాచకాలు ఒక్కొక్కటిగా బయటికి తీస్తామంటూ కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పొందుపరిచిందని గుర్తు చేశారు. విద్యుత్ కొనుగోలుపై కమిషన్ ఏర్పాటు చేసి కేసీఆర్‌కు నోటీసులిచ్చినా ఆయన సమాధానం చెప్పుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేత ఇందిరాశోభన్ మాట్లాడుతూ గరిబీ హటావో నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ ఇండ్లు అందించిందని విమర్శించారు. 2,91,000 ఇండ్లు మంజూరైతే, బీఆర్ఎస్ ఇచ్చింది మాత్రం 46973 ఇండ్లు మాత్రమే ఇచ్చిందన్నారు. కేసీఆర్, మోడీ పేద ప్రజలను మోసం చేశారని ఆరోపించారు.

## విద్యాశాఖకు మంత్రి కావలెను : బీజేపీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో విద్యా శాఖకు మంత్రి కావలెను అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ ప్రకటించారు. బడిబాట మొదలైందిగానీ రాష్ట్రంలో చదువుల మంత్రి లేరనీ, అదే మద్యానికి మాత్రం మంత్రి ఉన్నారని దెప్పిపొడిచారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. పుస్తకాలపై ఇంకా పాత సీఎం, పాత మంత్రి, అధికారుల పేర్లు ఉండటం దారుణమన్నారు. పర్యవేక్షణ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది అనడానికి ఇంతకంటే ఏం నిదర్శనం కావాలని అడిగారు. రాష్ట్రంలో 26 జిల్లాలకు డీఈఓలు లేరనీ, 62 డిప్యూటీ ఈఓలకు గానూ ఒక్కరూ డ్యూటీలో లేరని విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
ఇరిగేషన్ సర్కిల్, హిల్ కాలనీ, నల్లగొండ జిల్లా

నల్లగొండ జిల్లా, హిల్ కాలనీ, ఇరిగేషన్ సర్కిల్ నుండి టెండర్లు ఆహ్వానించుచున్నారు. టెండర్ నోటీసు నెం. 02SE/ICHE/2024-25, Dated : 13.06.2024 పని పేరు: 2024-25 కొరకు హైలెవెల్ కాలనీ, నాగార్జునసాగర్ డ్యాం, నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రంలోని 7 ఎంఎల్డీ వాటర్ ట్రీట్‌మెంట్‌యొక్క ఆపరేషన్ & నిర్వహణ & క్రొత్త పంపుల సరఫరా& ఫిక్సింగ్ అంచనా మొత్తం రూ.24,97,133/-, తేది: 14.06.2024 నుండి 21.06.2024, 3.00 వరకు దరఖాస్తులు లభిస్తాయి మరియు చివరి తేదీ : 21.06.2024, 5.00 వరకు స్వీకరిస్తారు. తదుపరి సమాచారము కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్‌ను సంప్రదించగలరు.
సం/- పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, హిల్ కాలనీ.
DIPR R.O.No.618-PP/CL/ADVT/1/2024-25, Dt. 14-06-2024

తెలంగాణ ప్రభుత్వం
ది సూపరింటెండింగ్ ఇంజనీర్ ట్రైబల్ వెల్ఫేర్ సర్కిల్ వారి కార్యాలయం వరంగల్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీస్ నెం. డిబి2/56/జి-ఎస్‌జిటి/68 టు 87/2024-2025 తేది : 10.06.2024
బిల్డింగ్, అప్రోచ్ రోడ్లు & మరమ్మతు పనుల సంఖ్య (20), పూర్వపు ఖమ్మం, వరంగల్ & ఆదిలాబాద్ జిల్లాలలో, (20) పనుల మొత్తం విలువ రూ.366.32 లక్షలు. బిడ్ సమర్పణ ప్రారంభ తేది : 21.06.2024. ముగింపు తేది : 29.06.2024 సా.3.00 గం. తదుపరి వివరాలను "ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ మార్కెట్ ప్రదేశం https://tender.telangana.gov.in వద్ద చూడగలరు. 0870-2957645, (7893235624 TA to SE)
సం./- సూపరింటెండింగ్ ఇంజనీర్, ట్రైబల్ వెల్ఫేర్, వరంగల్.
DIPR R.O.No.89-DP/CL/ADVT/1/2024-25, Dt:14.06.2024

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, మహిళా, శిశు వికలాంగుల మరియు వయోవృద్ధుల అభివృద్ధి ఏజెన్సీ, ఆదిలాబాద్
ప్రకటన
ఇందువెంట జతపరచబడిన జిల్లా సంక్షేమ అధికారి, శిశుగృహ ఆదిలాబాద్‌లోని శిశుగృహం, విద్యానగర్, బస్‌డిపో దగ్గర, ఆదిలాబాద్ నందు ఉంచబడినవి, వారు ఐసిపిఎస్ యొక్క రెగ్యులర్ పర్యవేక్షణలో ఉన్నారు. ఇద్దరు వదిలి వేయబడినవి పిల్లల ఫోటోగ్రాఫ్‌లను సమర్పించబడినవి. అసలు తల్లిదండ్రులు బాలికను క్లైమ్ చేయుటకు రుజువులతో సహా ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 రోజులలో దిగువ సంతకం దారును సంప్రదించవలయును, లేనిచో ఈ పిల్లలను వదిలి వేయబడినదిగా ప్రకటించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తతకు ఇవ్వబడును.



ధాత్రి
పుట్టిన తేది:
27-02-2024



జాహ్నవి
పుట్టిన తేది:
06-05-2024

సం/- జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగ & వృద్ధుల శాఖ, ఆదిలాబాద్
DIPR R.O.No.97-DP/CL/ADVT/1/2024-25, Dt: 14.06.2024

తెలంగాణ ప్రభుత్వం
శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర హార్టికల్చర్ యూనివర్సిటీ
అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, ములుగు (గ్రా & మండలం), సిద్దిపేట-502279
రిఫరెన్స్ ఎడివిటి 001/అడ్మిషన్స్/డిప్లమా/2024 తేది: 14.06.2024
హార్టికల్చర్ 2024-25 ప్రవేశాల్లో డిప్లమా కొరకు డిప్లమా-2024 కొరకు దరఖాస్తు
విద్యా సంవత్సరం 2024-25 కొరకు డిప్లమా-2024 కొరకు పాలీసెట్-2024/ఎస్ఎస్‌సి ఉత్తీర్ణులైన లేదా తత్సమాన పరీక్ష మరియు ఇంటర్మీడియట్ ఫెయిల్ అర్హతగల అభ్యర్థుల నుండి హార్టికల్చర్‌లో రెండు సంవత్సరాల డిప్లమా కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తు, ప్రాస్పెక్టస్ మరియు ఇతర వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www. skltshu.ac.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. దరఖాస్తు స్వీకరణకు చివరి తేది: 15.07.2024. పూర్తిచేసిన దరఖాస్తులను వీరికి పంపించాలి. ది రిజిస్ట్రార్, శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర హార్టికల్చర్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, ములుగు (గ్రా & మండలం), సిద్దిపేట-502279, తెలంగాణ రాష్ట్రం.
DIPR R.O.No.631-PP/CL/ADVT/1/2024-25, Dt. 14-06-2024 సం/- రిజిస్ట్రార్


తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘం కార్యాలయము - తొర్రూరు
నెం.1311/మం.సి.టి/2024/ఎ1 పత్రిక ప్రకటన తేది: 13/06/2024
మూడవ పిలుపు అంగడి బహిరంగ వేలం
ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియచేయునది, పురపాలకసంఘంచే ప్రతి మంగళవారం నిర్వహించబడు అంగడి పశువుల రహదారి, మేకలు, గొర్రెలు రహదారి వసూలు తైబజారు (గంపటీటి) వసూలు మరియు చికెన్ వ్యర్థముల సేకరణ చేయు అధికారము మరియు వేలములు 2024-2025 సం॥నకు గాను (20-06-2024 నుండి 31-03-2025 వరకు) బహిరంగ వేలం ద్వారా పురపాలక సంఘ కార్యాలయము నందు తేది: 20-06-2023 గురువారము రోజున ఉ॥ 11-00 గంటల నుండి మం॥ 03-00 గం॥ల వరకు శ్రీయుత కమీషనర్ పురపాలక సంఘం తొర్రూరు వారిచే వేలములు వేయబడును మరియు సీల్డు టెండర్లు స్వీకరించబడును కావున అభిలాషులు ఈ దిగువ చూపబడిన నిబంధనలకు లోబడి వేలము మరియు టెండరు పాటలో పాల్గొనుటకు కోర్నైనది. వేలములు అంగీకరించు / నిరాకరించు అధికారములు పురపాలకసంఘమునకు కలదు. వేలము పాటలో పాల్గొను వారు ఈ క్రింద చూపబడిన విధముగా డిపాజిట్లు వేలం వేయు రోజునకు ముందుగా రాతలు పరస్తూ Municipal Fund Thorrur Municipality గారి పేరున విడివిడిగా డి.డి.లను 19/06/2024 రోజు సా॥ 5.00 గం॥ల వరకు చెల్లించి రశీదులు మరియు షెడ్యూల్స్ పొందగలరు.

| వేలము వివరములు | డిపాజిట్ రూ॥లు | రిజిస్ట్రేషన్ ఖర్చు | మొత్తం రూ॥లు | షెడ్యూలు ధర |
|---|---|---|---|---|
| ఎ. పశువుల రహదారి | 4,00,000-00 | 1,00,000-00 | 5,00,000-00 | 3000-00 |
| బి. మేకలు- గొర్రెల రహదారి | 4,00,000-00 | 1,00,000-00 | 5,00,000-00 | 3000-00 |
| సి. తైబజారు (గంపటీటి) | 2,70,000-00 | 30,000-00 | 3,00,000-00 | 1000-00 |
| డి. చికెన్ వ్యర్థముల సేకరణ | 10,000-00 | ------ | 10,000-00 | 1000-00 |

పూర్తి వివరములకు మునిసిపల్ మేనేజర్ (ఇ/సి) గారిని సంప్రదించగలరు చరవాణి నెం. 8523071316
నోట్: అంగడి వేలములకు సంబంధించిన పూర్తి వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు సంప్రదించగలరు.
ఇట్లు
సం/- కమీషనర్,
తొర్రూరు పురపాలక సంఘం
DIPR R.O.No.654-PP/CL/ADVT/1/2024-25, Dt:14.06.2024

# ప్రత్యేక హోదా కుదరదు

## ప్రస్తుత నిబంధనల ప్రకారం ఆచరణ సాధ్యం కాదు



**ఏపీ, బీహార్‌లకు ఆర్థిక ప్యాకేజీలు విడుదల చేసే అవకాశం : నిపుణుల వెల్లడి**

**న్యూఢిల్లీ:** కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఏపీ, బీహార్ వంటి రాష్ట్రాల ప్రత్యేక హోదా డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. ఏపీ నుంచి టీడీపీ- జనసేన, బీహార్ నుంచి జేడీ(యూ)లు కేంద్రంలో మోడీ సర్కారు మళ్లీ ఏర్పడటంలో కింగ్ మేకర్‌లుగా మారాయి. ఈ రెండు రాష్ట్రాల్లోని పార్టీలూ తమ రాష్ట్రాల్లో అధికార పార్టీలే. దీంతో ప్రత్యేక హోదా అంశం ఆసక్తికరంగా మారింది. వాస్తవానికి 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి, ఎన్నో ఏండ్ల క్రితం నుంచి బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలన్న డిమాండ్లు వినిపించాయి. ప్రస్తుతం ఈ రెండు రాష్ట్రాలకు చెందిన అధికార పార్టీలు కేంద్రంలో మోడీ ప్రభుత్వ ఏర్పాటుకు కీలకంగా మారటం నేపథ్యంలో.. ప్రత్యేక హోదాను టీడీపీ, జేడీ(యూ)లు బలంగా వినిపించే అవకాశాలున్నాయని వార్తలు వెలువడుతున్నాయి. అయితే ప్రస్తుత నిబంధనల ప్రకారం రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఉండదని నిపుణులు చెప్తున్నారు.

వారి అభిప్రాయాల ప్రకారం.. ఆగస్టు 2014లో 13వ ప్రణాళికా సంఘం రద్దుతో, 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక, సాధారణ కేటగిరీ రాష్ట్రాల మధ్య ఎలాంటి భేదాన్ని చూపలేదు. ప్రభుత్వం 14వ ఫైనాన్స్ కమిషన్ సిఫారసులను ఆమోదించింది. ఏప్రిల్ 1, 2015 నుంచి కేంద్రం నుంచి రాష్ట్రాలకు పన్ను పంపిణీని 32 శాతం నుంచి 42 శాతానికి పెంచింది. ఏదైనా వనరులను అంతరం ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు రెవెన్యూ లోటు గ్రాంట్ల కొత్త నిబంధనను కూడా జోడించింది.

కొత్త నిబంధన ప్రకారం, 2014-15లో రూ. 3.48 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్రాలకు 2015-16లో మొత్తం వికేంద్రీకరణ(డివల్యూషన్) రూ. 1.78 లక్షల కోట్లకు పెరిగి రూ.5.26 లక్షల కోట్లకు చేరింది. జనాభా పనితీరును ప్రోత్సహించడానికి ఉద్దేశించిన ఫార్ములా ద్వారా రాష్ట్రాల వాటా నిర్ణయించబడుతుంది. ప్రతి రాష్ట్రం దాని స్వంత పన్ను ఆదాయాన్ని సమీకరించుకోవటానికి ప్రయత్నిస్తుంది. ఫార్ములా భౌగోళిక ప్రాంతం, అటవీ విస్తీర్ణం, రాష్ట్ర తలసరి ఆదాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటుంది. 2019లో జమ్మూకాశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా రూపొందించిన తర్వాత ఎన్‌కే సింగ్ నేతృత్వంలోని 15వ ఆర్థిక సంఘం పన్నుల పంపిణీని సవరించి, 42 శాతం నుంచి 41 శాతానికి తగ్గించింది. కాబట్టి రాష్ట్రాలకు ప్రస్తుతం పన్ను పంపిణీ 2026 వరకు 41 శాతంగా ఉన్నది.

**మోడీ 3.0 నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం హోదాను పునః సమీక్షించాలని, ప్రత్యేక కేటగిరీ హోదా కోసం ఏపీ, బీహార్‌ల డిమాండ్‌లను నెరవేర్చాలని నిర్ణయించుకుంటే, ఆ ప్రతిపాదనను అరవింద్ పనగారియా ఆధ్వర్యంలోని 16వ ఆర్థిక సంఘానికి లేదా వాటి క్లియరెన్స్ కోసం నిటి ఆయోగ్‌కు పంపాల్సి ఉంటుంది. ఏపీ, బీహార్‌లతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లు కూడా ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేస్తున్నాయి.**

మార్చి 2015 వరకు వర్తించే ప్రత్యేక కేటగిరీ హోదా కింద, ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలు అన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేంద్రం నుంచి ఆర్థిక సహకారంలో 90 శాతం పొందుతున్నాయి. రాష్ట్రాల సహకారం కేవలం 10 శాతానికి పరిమితం చేయబడింది. అసోం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్, మిజోరం, సిక్కిం, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్ వంటి రాష్ట్రాలు 2015కి ముందు ప్రత్యేక కేటగిరీ రాష్ట్ర హోదాను పొందాయి. ప్రత్యేక హోదా కేటగిరీ లేనప్పటికీ ఈశాన్య, కొండ ప్రాంతాలకు 90:10 నిబంధన ఇప్పటికీ వర్తిస్తున్నది. అన్ని ఇతర రాష్ట్రాలు 60:40 నిష్పత్తిలో కేంద్ర నిధులను అందుకుంటాయి. అంటే.. 60 శాతం కేంద్ర ప్రభుత్వ సహకారం, 40 శాతం రాష్ట్రాల వాటా.

ప్రస్తుత నిబంధనల ప్రకారం రాష్ట్రాలకు ప్రత్యేక కేటగిరీ హోదా లేదన్నది స్పష్టమని నిపుణులు చెప్తున్నారు. కానీ, రెవెన్యూ లోటు, వనరుల అంతరాన్ని ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు అదనపు ఆర్థిక సహాయ ప్యాకేజీని మంజూరు చేసే అవకాశం కేంద్రానికి ఉన్నదని వారు అంటున్నారు. కాబట్టి, ప్రత్యేక హోదాకు బదులు ఈ పథకం కింద ఏపీ, బీహార్‌లకు అదనపు నిధులు మంజూరు చేసే అవకాశాముంటుందని నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు.



# గుజరాత్‌లో మత వివక్ష

**ముస్లిం మహిళ పట్ల స్థానికుల అభ్యంతరం**

- ప్రభుత్వ పథకం కింద ఇల్లు కేటాయించొద్దని డిమాండ్
- ఆమె రాకతో ముప్పు ఏర్పడుతుందని ఆందోళన
- జిల్లా కలెక్టర్‌కు లేఖ.. వడోదరలో ఘటన

**గాంధీనగర్ :** ప్రధాని మోడీ స్వంత రాష్ట్రంలోని ఒక ప్రభుత్వ పథకంలో మత వివక్ష చర్చకు దారి తీస్తున్నది. ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖలో ఉద్యోగం చేస్తున్న ఒక ముస్లిం మహిళ(44)కు ముఖ్యమంత్రి ఆవాస్ యోజన కింద హర్నిలోని వడోదర మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) తక్కువ ఆదాయ వర్గాలకు చెందిన గృహ సముదాయంలో నివాసం కేటాయించింది. తన మైనర్ కొడుకుతో కలిసి కొత్త ఇంటికి వెళ్లచ్చని సదరు మహిళ సంతోషపడింది. 462 యూనిట్లతో కూడిన ఆ హౌసింగ్ కాంప్లెక్స్‌లో ఆమె రాక పట్ల వ్యతిరేకత వ్యక్తమైంది. ఆమె ఆ కొత్త ఇంటిలోకి వెళ్లకముందే కాంప్లెక్స్‌లోని 33 మంది నివాసితులు ఆమె మతం పేరును కారణంగా పేర్కొంటూ అభ్యంతరం తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదును పంపారు. ఆమె రాక ముప్పును, ఇబ్బందిని కలిగిస్తుందని పేర్కొన్నారు. కాగా, ఈ కాంప్లెక్స్‌లో ఇల్లు కేటాయించబడినవారిలో ఆమె ఒక్కరే ముస్లిం వ్యక్తి అని అధికారులు చెప్తున్నారు. ఈ ఘటనపై స్పందించటానికి వడోదర మున్సిపల్ కమిషనర్ దిలీప్ రాణా, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ అర్పిత్ సాగర్‌తో సహా మరికొందరు ముఖ్య అధికారులు ఎవరూ ముందుకురాకపోవటం గమనార్హం.

బాధిత ముస్లిం మహిళ మాట్లాడుతూ.. 2020లో ఇక్కడి స్థానికులు తన ఇంటి కేటాయింపు చెల్లదని కోరుతూ ముఖ్యమంత్రి కార్యాలయానికి (సీఎంఓ) లేఖ రాసినప్పుడు నిరసనలు ప్రారంభమయ్యాయి. అయితే, హర్ని పోలీస్ స్టేషన్ సంబంధిత అన్ని పార్టీల వాంగ్మూలాలను నమోదు చేసి, ఫిర్యాదును ముగించింది. ఇదే అంశంపై ఇటీవల జూన్ 10వ తేదీన నిరసన చేపట్టారు. "నేను వడోదరలోని అన్ని వర్గాలు నివసించే పరిసర ప్రాంతాల్లో పెరిగాను. నా కొడుకు అందరినీ కలుపుకొని పోయే పరిసరాల్లో ఎదగాలని నేను ఎప్పుడూ కోరుకున్నాను. కానీ, నా కలలు చెదిరిపోయాయి. నేను ఎదుర్కొంటున్న వ్యతిరేకతకు పరిష్కారం లేదు. నా కొడుకు ఇప్పుడు 12వ తరగతి చదువుతున్నాడు. జరిగే విషయాలను అర్థం చేసుకునేంత వయస్సులో ఉన్నాడు. వివక్ష అతనిని మానసికంగా ప్రభావితం చేస్తుంది" అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

హిందువుల ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో వేరొక వర్గానికి చెందినవారికి ఇంటిని కేటాయిస్తే ప్రశాంత జీవితానికి భంగం కలుగుతుందని ఇక్కడి స్థానికులు అధికారులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. వేరే మతాలకు చెందినవారికి ఇక్కడ ఇల్లు కేటాయించటాన్ని తాము ఇష్టపడమని వివరించారు. హౌసింగ్ కాలనీలోని అనేక కుటుంబాలు మాంసాహారులు అయినప్పటికీ, వేరే మతం వారు రావటం ఇక్కడి నివాసితులలో ఆందోళనను రేకెత్తించిందని మరికొందరు అన్నారు.

### ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యంగా

# బ్రిటన్, ఫ్రాన్స్, ఉక్రెయిన్ నేతలతో మోడీ చర్చలు

**అపూలియా, ఇటలీ :** ద్వైపాక్షిక సంబంధాలను, పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా, ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌లతో విడివిడిగా ద్వైపాక్షిక చర్చలు జరిపారు. జీ-7 సదస్సు నేపథ్యంలో ఈ భేటీలు చోటు చేసుకున్నాయి. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా మోడీ జరుపుతున్న విదేశీ పర్యటన ఇది. రష్యా, ఉక్రెయిన్ ఘర్షణలకు సంబంధించిన వివిధ అంశాలపై మోడీకి జెలెన్స్కీ వివరించారు. చర్చలు, దౌత్య పరిష్కారాల ద్వారా మాత్రమే సమస్యను పరిష్కరించుకోవాలన్నది భారత్ వైఖరని మోడీ స్పష్టం చేశారు. గతేడాది మేలో హిరోషిమా సదస్సులో కూడా జెలెన్స్కీతో మోడీ భేటీ అయ్యారు.

భారత్, బ్రిటన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకై చర్యలు తీసుకోవడానికి మోడీ, రిషి సునాక్‌లు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. "రక్షణ, భద్రత, వాణిజ్యం, ఆర్థిక సహకారం, ప్రజల మధ్య సంబంధాలు వంటి పలు రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను ఇరువురు నేతలు సమీక్షించారు. 2030 వరకు అనుసరించాల్సిన ప్రణాళిక అమలుపై చర్చించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చల్లో పురోగతిని సమీక్షించారు." అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

రక్షణ, అణు, రోదసీ రంగాల్లో ఫ్రాన్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి గల మార్గాలపై మాక్రాన్‌తో మోడీ చర్చించారు. కీలకమైన అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొత్త స్థాయిలకు తీసుకెళ్లాలని ఇరుపక్షాలు నిర్ణయించాయని జైస్వాల్ తెలిపారు.



# ముంబయిని ముంచెత్తుతున్న వర్షాలు

- జలమయమైన పలు ప్రాంతాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా

**ముంబయి :** భారీ వర్షాలు ముంబయిని ముంచెత్తుతున్నాయి. దీంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భూలేశ్వర్, కల్బాదేవీ ప్రాంతాల్లో గురువారం సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా నిలిచి పోయిందని, బహన్ ముంబయి ఎలక్ట్రిసిటీ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్ట్ (బెస్ట్)కి ఫోన్ చేసినా స్పందించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలు రైళ్ల రాకపోకలపై ప్రభావం చూపుతున్నాయని పశ్చిమ రైల్వే పేర్కొంది. ట్రాక్‌లను వరదలు ముంచెత్తకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపింది. కాగా జూన్ 14 నుంచి 19 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణ శాఖ వెల్లడించింది



# ప్రవాసీయులు కేరళ జీవనాడి

- కువైట్ నుంచి కొచిన్ ఎయిర్‌పోర్ట్‌కు భారతీయుల మృతదేహాలు
- కేరళ సీఎం విజయన్, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రుల నివాళి

**కోచి :** ప్రవాసీయులు కేరళకు జీవనాడి వంటివారని, ఇంతమంది ఈ అగ్నిప్రమాదంలో మరణించడం దేశానికి తీరని నష్టమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వ్యాఖ్యానించారు. కువైట్ అగ్ని ప్రమాదంలో మరణించిన 45మంది భారతీయుల మృతదేహాలు కొచిన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి శుక్రవారం చేరుకున్నాయి. మృతి చెందినవారిలో 23మంది మలయాళీలే. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు విమానాశ్రయానికి చేరుకుని మృతులకు నివాళు లర్పించారు. శుక్రవారం ఉదయం 10.30గంటలకు ఈ మృతదేహాలను తీసుకుని భారత వాయు సేనకు చెందిన విమానం ఇక్కడ ల్యాండ్ అయింది. కోచి విమానాశ్రయం వద్ద పినరయి విజయన్ విలేకర్లతో మాట్లాడారు. ఈ సంఘటన తర్వాత కువైట్ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుందని అన్నారు. భారత ప్రభుత్వం కూడా సరైన సమయంలో చక్కగా జోక్యం చేసుకుందని పేర్కొన్నారు. మృతదేహాల శవపేటికలపై పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు.

**స్వస్థలాలకు మృతదేహాల తరలింపు**

ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో మృతదేహాలను వారి వారి స్వస్థలాలకు తరలించారు. తర్వాత అదే విమానం మిగిలిన మృతదేహాలను తీసుకుని సాయంత్రం నాలుగు గంటలకు ఢిల్లీ చేరుకుంది. విమానంలో మృతదేహాలతోపాటు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్, తమిళనాడు మైనారిటీ సంక్షేమం, ప్రవాస తమిళుల సంక్షేమ మంత్రి కెఎస్ మస్తాన్ వున్నారు. వారు కూడా కొచిన్ ఎయిర్‌పోర్టులో నివాళు లర్పించారు. 45 మృతదేహాలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్‌కు సంబంధించిన ప్రక్రియ అంతా విమానాశ్రయంలోనే జరిగింది. మృతుల కుటుంబీకులు, బంధువులు అందరూ విమానాశ్రయంలో తమవారి కోసం వేచిచూడడం కనిపించింది. తమిళనాడుకు చెందిన వారి మృతదేహాలను రోడ్డు మార్గంలో తరలించారు. విమానాశ్రయం వెలుపల అంబులెన్సులు బారులు తీరి కనిపించాయి. కేరళ ప్రభుత్వ అభ్యర్థన మేరకు మృతదేహాలను తీసుకురావడానికి విదేశాంగ శాఖ ప్రత్యేక విమానం ఏర్పాటు చేసిందని కేరళ రెవెన్యూశాఖ మంత్రి కె.రాజన్ చెప్పారు. కేరళ అధికార ప్రతినిధిగా వెళ్ళేందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జికి కువైట్ వెళ్లడానికి కేంద్రం అనుమతి నిరాకరించడంపై కేరళ ప్రతిపక్ష నేత విమర్శించారు.

**మరో భారతీయుడు మృతి**

అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో భారతీయుడు శుక్రవారం మరణించాడని కువైట్ విదేశాంగ మంత్రి విలేకర్లకు తెలిపారు. దీంతో మృతుల సంఖ్య 46కి పెరిగిందని అధికారులు తెలిపారు. భవనం కింద అంతస్తులో గార్డు రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని భావిస్తున్నారు.

**మాటలకందని విషాదం**

కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాద విషాదం మాటలకందనిదని కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ వ్యాఖ్యానించారు. ప్రవాసీల పట్ల, వారి కఠోర శ్రమ పట్ల కేంద్ర, రాష్ట్రాలకు చాలా గౌరవం వుందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి సురేష్ గోపి వ్యాఖ్యానించారు. ఈ విషాదం చాలా బాధాకరమైందని అన్నారు. ఈ ప్రమాద మృతుల్లో ఒడిషాకు చెందిన ఇద్దరు వ్యక్తులు కూడా వున్నారు. వారి మృతికి ఒడిషా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. వీరి మృత దేహాలు శుక్రవారం సాయంత్రానికి ఢిల్లీ నుండి ఒడిషా చేరుకున్నాయి.

### వ్యవసాయ మంత్రిగా

# శివరాజ్ చౌహాన్ వద్దు

## నియామకాన్ని వ్యతిరేకించిన ఎస్కేఎం, ఏఐకేఎస్



**న్యూఢిల్లీ :** కేంద్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ, రైతు సంక్షేమం శాఖలను 2017లో ఆరుగురు రైతుల హత్యలకు బాధ్యుడైన శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కేటాయించడాన్ని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం), అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) తీవ్రంగా వ్యతికేకించాయి. ఈ మేరకు వేరువేరుగా ప్రకటనలు విడుదల చేశాయి. ఎస్కేఎం తన ప్రకటనలో 'కనీస మద్దతు ధర, రుణమాఫీ కోసం, దేశంలో పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలకు వ్యతిరేకించగా మధ్యప్రదేశ్‌లో 2017 జూన్ 6న ఆందోళన చేస్తున్న సమయంలో ఈ రైతులను హత్య చేశారు' అని తెలిపింది.

దేశంలో వ్యవసాయ సంక్షోభం కారణంగా ప్రతిరోజూ 31 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఈ సమస్యను పరిష్కరించడంలో ఎన్డీఏ ప్రభుత్వం మొదటి క్యాబినెట్ సమావేశం విఫలమైందని, రైతులకు అనుకూలంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఎస్కేఎం విమర్శించింది. కనీస మద్దతు ధర కోసం సి2 ప్లస్ 50 పర్సెంట్ ఫార్ములాపై హామీ, రుణాల మాఫీ, విద్యుత్ ప్రయివేటీకరణ రద్దు, ఉత్పత్తి వ్యయం తగ్గింపు, బీమా-పెన్షన్ హామీ వంటి పెండింగ్‌లో డిమాండ్లపైనా, ప్రతీ రైతు కుటుంబానికి సగటు నెలకు రూ 500 చొప్పున అందచేసే ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి సంబంధించిన బకాయిలు రూ. 20 వేల కోట్లు విడుదల వంటి అంశాలపై ఎన్డీఏ క్యాబినెట్ ఎలాంటి నిర్ణయాలను ప్రకటించలేదని పేర్కొంది.

తాజా లోక్‌సభ ఎన్నికల్లో 159 గ్రామీణ నియోజకవర్గాల్లో ఓటమి నుంచి ఎన్డీఏ, బీజేపీ ఎటువంటి పాఠాలు నేర్చుకోలేదని ఈ వైఖరి స్పష్టం చేస్తోందని ఎస్కేఎం తన ప్రకటనలో తెలిపింది. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే విధానంలో బీజేపీ ఎలాంటి మార్పులు చేస్తుందని రైతులకు ఏ విధమైన భ్రమలు లేవని ఎస్కేఎం పేర్కొంది. రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, చిన్న ఉత్పత్తిదారులు ఐక్యం కావాలని, దేశవ్యాప్తంగా మరో దశ ప్రజా ఉద్యమాలకు తమను తాము సిద్ధం చేసుకోవాలని ఎస్కేఎం పిలుపునిచ్చింది. ప్రజల మధ్య ఐక్యతను నిర్మించడానికి ఎస్కేఎం కట్టుబడి ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఎన్నికల అనంతర పరిస్థితులను అంచనా వేయడానికి ఎస్కేఎం జనరల్ బాడీ సమావేశం జూలై 10న న్యూఢిల్లీలో నిర్వహించనున్నట్లు, వివిధ నిర్దిష్ట డిమాండ్లపై భవిష్యత్ కార్యచరణను జనరల్ బాడీ పరిశీలిస్తుందని తెలిపింది.

అలాగే ఈ ప్రకటనలో బీజేపీ ఎంపీ, సినీ నటి కంగనా రనౌత్‌ను మహిళా సెక్యూరిటీ గార్డు చెంప దెబ్బ కొట్టడం సమర్ధనీయం కాదని ఎస్కేఎం తెలిపింది. అయితే చారిత్రాత్మక రైతు ఉద్యమానికి వ్యతిరేకంగా కంగనా రనౌత్ అహంకారపూరిత, దురుద్దేశపూరిత ప్రకటనలను ఎస్కేఎం విమర్శించింది.

కాగా, చౌహాన్‌ను వ్యవసాయ శాఖ మంత్రిగా నియమించడాన్ని ఏఐకేఎస్ కూడా ఖండించింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో మధ్యప్రదేశ్‌లో మందసౌర్‌లో జరిగిన ఘటనకు చౌహాన్ బాధ్యత వహించాలని స్పష్టం చేసింది. 17వ విడత పీఎం కిసాన్ నిధిని విడుదల చేయాలనే కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని కేవలం కంటి తడుపు చర్యగా అభివర్ణించింది. 159 గ్రామీణ నియోజకవర్గాల్లో ఓటమి చెందినా బీజేపీ ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని విమర్శించింది.

# యడియూరప్పకు ఊరట

## తదుపరి విచారణ వరకూ అరెస్టు వద్దని హైకోర్టు ఆదేశం



**బెంగళూరు :** పోక్సో చట్టం కింద నమోదైన కేసులో కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు ఆ రాష్ట్ర హైకోర్టు ఊరట కలిగించింది. తదుపరి విచారణ వరకూ అరెస్టు చేయవద్దని పోలీసుల్ని శుక్రవారం ఆదేశించింది. 17 ఏండ్ల బాలికపై వేధింపుల కేసులో యడియూరప్పకు వ్యతిరేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టు (పోక్సో కోర్టు) గురువారం సాయంత్రం నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదయింది.ఈ నేపథ్యంలో యడియూరప్ప హైకోర్టులో రెండు వేరువేరు పిటీషన్లు దాఖలు చేశారు. ఈ కేసులో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ చట్ట బద్ధతను ప్రశ్నిస్తూ ఒక పిటీషన్‌ను, సెషన్ కోర్టు జారీ చేసిన అరెస్టు వారెంట్ ఆధారంగా తనను అరెస్టు చేయవద్దని కోరుతూ మరొక పిటీషన్‌ను వేశారు. ఈ పిటీషన్లను శుక్రవారం జస్టిస్ కృష్ణ ఎస్ దీక్షిత్ విచారించారు. ఈ కేసు విచారణ కోసం సీఐడీ ముందు యడియూరప్ప హాజరైన విషయాన్ని, విచారణకు సహకరించిన విషయాన్ని కోర్టు గుర్తించింది. అలాగే, ఈ నెల 17న సీఐడీ ముందు విచారణకు హాజరవుతానని యడియూరప్ప తెలిపిన విషయాన్ని ప్రస్తావించింది. దీంతో తదుపరి విచారణ వరకూ యడియూరప్పను అరెస్టు చేయవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం యడియూరప్ప బీజేపీ పార్లమెంటరీ బోర్డు, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులుగా ఉన్నారు. 2012 ఫిబ్రవరిలో సహాయం కోరి తన తల్లితోపాటు వచ్చిన 17 ఏండ్ల బాలికపై యడియూరప్ప తన నివాసంలోనే లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సదాశివనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. యడియూరప్పను ఇంకా ఎందుకు అరెస్టు చేయలేదని కర్నాటక హైకోర్టు ఇటీవల ప్రశ్నించింది. దీంతో, ఈ నెల 12న విచారణకు హాజరు కావాలని యడియూరప్పకు సీఐడీ సమన్లు జారీ చేసింది. యడియూరప్ప విచారణ కు హాజరుకాకపోవడంతో ఆయనను అరెస్టు చేయడానికి వారెంట్ జారీ చేయాలని కోరుతూ సిఐడి ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఆశ్రయించింది. దీనిపై అంగీకరిస్తూ గురువారం సాయంత్రం యడియూరప్పపై కోర్టు నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది.

# పోషకాహార లోపంతో దయనీయ పరిస్థితులు !

## గాజాలో పరిణామాలపై కమల్ అద్వాన్ ఆస్పత్రి హెడ్ ఆందోళన

- తాజా దాడుల్లో 9మంది మృతి



**గాజా :** ఇజ్రాయిల్ మూర్ఖత్వం, దురహంకారం గాజాలో బాలల ఉసురు తీస్తోంది. మానవతా సాయం సరఫరాలకు వీల్లేకుండా దారులన్నీ మూసివేయడంతో గాజాకు ఆహార సరఫరాలు నిలిచిపోయాయి. దీంతో ఆకలితో పిల్లలు అల్లాడుతున్నారు. తాజాగా సరైన పోషకాహారం లేక ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తడంతో 14ఏళ్ళ ముస్తఫా హిజాజి మరణించాడు. గాజా ఆరోగ్య వ్యవస్థ చాలా దయనీయమైన స్థితిలో వుందని వైద్య సరఫరాలు, ఇంధన కొరత కారణంగా సక్రమంగావైద్య సేవలు అందించలేకపోతున్నామని కమల్ అద్వాన్ ఆస్పత్రి హెడ్ హొసామ్ అబూ సఫియా ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఇజ్రాయిల్ హెలికాప్టర్ గన్‌షిప్‌లు, అటాక్ డ్రోన్‌లు, యుద్ధ విమానాలు రఫాపై దాడులు కొనసాగిస్తున్నాయి. మరోవైపు వీధుల్లో ఎక్కడ చూసినా పోరాట దృశ్యాలే కనిపిస్తున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటివరకు 37,266మంది మరణించారు. 85,102మంది గాయపడ్డారు. గత 24గంటల్లో ఒక నివాస భవనంపై ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో ముగ్గురు పిల్లలతో సహా ఏడుగురు మరణించగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు. తూర్పు రఫాలో మరో ఇద్దరు చనిపోయారు.

కనీస వైద్య సరఫరాలు వున్నా మనం చాలామంది ప్రాణాలు కాపాడవచ్చని కమల్ అద్వాన్ ఆస్పత్రి హెడ్ హొసామ్ అబూ వ్యాఖ్యానించారు. పోషకాహార లోపంతో బాధపడే కేసులను పరిష్కరించ వచ్చన్నారు. కానీ అవసరమైన సరఫరాలు, వసతులు లేకపోవడంతో పోషకాహారం లోపం ఎదుర్కొంటున్న వారిలో సమస్యలు మరింత ముదిరి తీవ్ర పర్యవసా నాలకు దారి తీస్తున్నాయన్నారు. కేవలం మైదా పిండి తప్ప మరే విధమైన ఆహారపదార్థాలు అందు బాటులోవుండడం లేదని, తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పశు సంపద లేకుండా పోయిందని, దాంతోఎలాంటి మాంసం లేదని, ప్రొటీన్ల లోపం తీవ్రంగా వున్నందువల్ల కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వు వంటి వాటి కోసం అదనపు చికిత్సలు చేయాల్సిన అవసరం ఏర్పడుతోందన్నారు. అయితే వైద్య సరఫరాలు, ఆహార పదార్థాలు ఇలా అందుబాటులో ఏవీ లేకపో వడంతో తమకు చేతులు కట్టేసినట్లు అవుతోందని ఆయన ఒక ఇంటర్వ్యూలో తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. రెండు మాసాల క్రితమే ఉత్తర గాజాలో పోషకాహార లోపంతో 26మంది పిల్లలు మరణించారు. సరైన ఆహారం లేక సుదీర్ఘకాలం ఇదే పరిస్థితి వుంటే పిల్లల్లో చాలా తీవ్రమైన పర్యవసానాలు ఎదురవుతాయ న్నారు. ఇకనైనా తక్షణావసరాలు తీరేలా అన్ని రకాల ఆహార పదార్థాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. రాబోయే రోజుల్లో ఎలాంటి సాయం అందకపోతే మరింత మంది పిల్లలు మృత్యువాత పడే అవకాశం వుందని హెచ్చరించారు. గత రెండు మాసాలుగా గాజాలోకి ఎలాంటి పోషకాహార పదార్థాలు రాలేదని పాలస్తీనా ఆరోగ్య శాఖ వెల్లడించింది. ప్రస్తుతం 200మందికి పైగా పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, వీరికి త్వరలో ఎలాంటి సప్లిమెంట్ అందని పక్షంలో మృత్యువుకు చేరువయ్యే ప్రమాదముందన్నారు.

సంపాదకీయం

# 'భగవత్' గీత వెనుక...



"భారతీయ జీవన విధానంలో మర్యాద అనేది ఒక భాగం. ఆ మర్యాదే మన సంస్కృతి. మన ధర్మం. మర్యాదను పాటించేవాడు పని చేసుకుంటూ పోతాడు తప్ప నేనే చేశాను అని అహంకరించడు. అలా అంతానేనే అని అహంకరించేవాడికి నేను ప్రజాసేవకుడిని అని చెప్పుకునే అర్హతలేదు"... సరిగ్గా కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి, నూతన మంత్రివర్గం సమావేశమవుతున్న వేళ, సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలివి. ఇవి ఎవరినుద్దేశించి?ఆయన అంతటితో ఆగలేదు.... "ఏడాదిగా మణిపూర్ శాంతికోసం ఎదురు చూస్తోంది. పదేళ్ళుగా అక్కడ శాంతి నెలకొనివుంది. పాత తుపాకీ సంస్కృతి ముగిసిపోయింది. కానీ ఏడాది క్రితం అక్కడ అశాంతి అంటుకుందో అంటించబడిందో తెలియదుగానీ ఆ మంటలు ఇంకా మండుతూనే ఉన్నాయి..." అన్నారు.

> వాస్తవానికి బీజేపీ అధికారాన్నేమీ కోల్పోలేదు. వారనుకున్న 400+ రాలేదనేదే వీరి ఆక్రోషానికి కారణం. వచ్చుంటే ఏమేం చేయాలి అని వేసుకున్న బ్లూ ప్రింట్ భగ్నమైందనేదే వీరి ఆవేదన. మైతీలకు కుకీలకు మధ్య ఘర్షణ రాజేయడం ఆరెస్సెస్ గేమ్ ప్లాన్‌లో అంతర్భాగమే. ఇప్పుడు హఠాత్తుగా మణిపూర్ మంటల గురించి వీరు మాట్లాడటం ఆశ్చర్యమే మరి! నిజానికి సంఘ్‌నేతలు 'ఆవేదన' చెందుతున్నట్లుగా ఈ ధోరణులన్నీ బీజేపీలో ఇప్పుడు కొత్తగా మొదలైనవేమీ కావు. పదేండ్ల క్రితమే మొదలై అయిదేండ్లుగా ఊపందుకొన్నవే. కాషాయపెద్దల కండ్లముందే వారి కనుసన్నల్లో జరుగుతున్నవే. కానీ ఇవేవో ఇప్పుడే మొదలైనట్టు, తామేదో ఇప్పుడే గుర్తించినట్టు సంఘ్ పెద్దలు మాట్లాడటమే విడ్డూరంగా ఉంది.

ఇప్పుడు ఆయన ఎవరిగురించి మాట్లాడుతున్నారో అర్థమవుతోంది కదూ...!

"రాజకీయాల్లో ఎదుటి పక్షం ఎప్పుడూ ప్రతిపక్షమే అవుతుంది తప్ప శత్రుపక్షం కాదు. ప్రత్యర్థిని విరోధిగా చూడకూడదు. వారు మరో కోణం చూపుతారు. వ్యవస్థలో ఆ అవకాశం ఎప్పుడూ ఉండాలి. ఇరుపక్షాల మధ్య ఉండాల్సింది పోటీయేకానీ యుద్ధం కాదు" అని హితవు పలికారు. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని అన్నీ అబద్ధాలే ప్రచారం చేశారన్నారు... ఇప్పుడిక ఆయన ఏ పేరూ చెప్పకపోయినా ఎవరి గురించి మాట్లాడుతున్నారన్నది సుస్పష్టం. సంఘ్‌నూ దాని సమస్త పరివారాన్నీ పక్కన పెట్టి, నాదీ "గ్యారంటీ" అని ప్రకటించుకున్నది ఎవరు? అసత్య అర్థసత్య విభజన విద్వేష ప్రసంగాలతో విషం చిమ్మింది ఎవరు? మణిపూర్ మారణకాండను కనీసం కన్నెత్తి చూడకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా ఉన్నది ఎవరు? కేసులతో వేధించి, జైళ్లకు పంపించి, అనేకానేక భయాందోళనలకు గురిచేసి, ఆఖరికి వారి బ్యాంకు ఖాతాలను సైతం నిలిపేసి... ఎన్నికల్లో ఎదుటి పక్షానికి పోరాడే అవకాశమే లేకుండా దారులన్నీ మూసేసిన పన్నాగాలు ఎవరివి? అంతా బహిరంగ రహస్యమే కదా. అందువల్ల సర్ సంఘ్‌చాలక్ ఆగ్రహావేదనలు ఎవరినుద్దేశించినవో ప్రత్యేకించి చెప్పనవసరంలేదు.

అయితే... ఈ ఆరెస్సెస్ అగ్రనేత 'ఆక్రందనలు' అర్థం చేసుకోదగినవీ, అక్షర సత్యాలే అయినా, ఇందులో చిత్తశుద్ధిని చూడలేం. ఎందుకంటే, ఇవన్నీ వీరి ప్రమేయం లేకుండానే జరిగాయా? అలా జరగడం సాధ్యమేనా? ఆరెస్సెస్ ప్రమేయం లేకుండానే మోడీ తనని తాను దైవాంశసంభూతుడిగా ప్రకటించుకున్నాడా? అయినా ఈ పదేండ్లుగా లేనిది వీరికిప్పుడే ఎందుకీ జ్ఞానోదయమైందీ? జూన్ నాలుగుకు ముందు ఈ హితబోధలో అభిశంసనలో ఎందుకు బయటికి పెగల్లేదు. ఇవీ ఇప్పుడు ప్రశ్నలు. అసలీ విభజన విద్వేష భావజాలానికీ ఫాసిస్టు ధోరణులకూ మూలమే వీరు కదా. నిజానికి ఆరెస్సెస్ ఆధ్వర్యంలోని రెండువందల యాభై పైచిలుకు సంస్థలలో బీజేపీ ఒకటి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే బీజేపీ అనేది ఆరెస్సెస్ రాజకీయ విభాగం మాత్రమే. ఆ బీజేపీకి సైద్ధాంతిక నాయకత్వం అందించేదే ఆరెస్సెస్. దానికి సర్వాధిపతి సర్ సంఘ్‌చాలక్. అందువల్ల బీజేపీనీ ఆరెస్సెస్‌ను వేరుగా చూడలేం. పైగా ఈ సర్ సంఘ్‌చాలక్‌కు, వీరి ప్రధాన స్థావరమైన నాగ్‌పూర్ కేంద్రానికీ బీజేపీలో తిరుగే ఉండదని ప్రతీతి. మరి అలాంటి ఈ సర్వాధినేత ఇప్పుడు ఎందుకు ఆందోళన చెందుతున్నారు? నాగ్‌పూర్‌కూ ఢిల్లీకి మధ్య అంతరం పెరుగుతున్నదా? నాగ్‌పూర్ ఆధిపత్యానికి సవాలుగా ఢిల్లీలో అధికారం ఘనీభవిస్తున్నదా? ఇది నమ్మశక్యమేనా?

ఇక ఆరెస్సెస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' ప్రచురించిన ఒక వ్యాసాన్ని కూడా ఇక్కడ ప్రస్తావించాలి. సంఘ్ సీనియర్ నేత రతన్ శార్దా రాసిన ఈ వ్యాసంలో మితిమీరిన అతివిశ్వాసమే బీజేపీ కొంపముంచిందని పేర్కొన్నారు. వాస్తవానికి బీజేపీ అధికారాన్నేమీ కోల్పోలేదు. వారనుకున్న 400+ రాలేదనేదే వీరి ఆక్రోషానికి కారణం. వచ్చుంటే ఏమేం చేయాలి అని వేసుకున్న బ్లూ ప్రింట్ భగ్నమైందనేదే వీరి ఆవేదన. మైతీలకు కుకీలకు మధ్య ఘర్షణ రాజేయడం ఆరెస్సెస్ గేమ్ ప్లాన్‌లో అంతర్భాగమే. ఇప్పుడు హఠాత్తుగా మణిపూర్ మంటల గురించి వీరు మాట్లాడటం ఆశ్చర్యమే మరి! నిజానికి సంఘ్‌నేతలు 'ఆవేదన' చెందుతున్నట్లుగా ఈ ధోరణులన్నీ బీజేపీలో ఇప్పుడు కొత్తగా మొదలైనవేమీ కావు. పదేండ్ల క్రితమే మొదలై అయిదేండ్లుగా ఊపందుకొన్నవే. కాషాయపెద్దల కండ్లముందే వారి కనుసన్నల్లో జరుగుతున్నవే. కానీ ఇవేవో ఇప్పుడే మొదలైనట్టు, తామేదో ఇప్పుడే గుర్తించినట్టు సంఘ్ పెద్దలు మాట్లాడటమే విడ్డూరంగా ఉంది. అందువల్ల ఇదంతా కేవలం ఓ తంతులా కనిపించడంలో ఆశ్చర్యంలేదు. ఇంతకీ ఈ తతంగమంతా ఎందుకు? జరిగిన పరాభవం నుంచి తప్పుకునేందుకా? లేక దోషం బీజేపీదే తప్ప తమది కాదని చెప్పుకునేందుకా? బహుశా తాము ప్రజల విశ్వాసం కోల్పోతున్నామన్న సత్యాన్ని మరుగుపరిచేందుకు కాబోలు..! ఏమైతేనేం.. మొత్తానికి అటు కమలనాథులు ఇటు కాషాయపెద్దలు... నేతగణమంతా కలిసి నాటకాన్ని రక్తికట్టిస్తున్నారు...!

# నూతన పార్లమెంట్‌లో 'నారీశక్తి' ఏది?





పి.సతీష్
9441797900

మహిళలను జాతి నిర్మాణ ప్రదాతలుగా మలచడానికి, నారీ శక్తిని గౌరవించడానికి ప్రధాని మోడీ పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లో ఆమోదించారని గతేడాది సామాజిక మాధ్యమాల్లో హోరెత్తిపోయే ప్రచారం జరిగింది. పార్లమెంట్ ఆమోదించిన మహిళా చట్టం ప్రకారం పార్లమెంటు, శాసనసభ ఎన్నికలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 2026లో జాతీయ జనాభా గణన పూర్తయి, ఆ పిమ్మట పార్లమెంటు స్థానాల పునర్వ్యవస్థీకరణ(డి- లిమిటేషన్) పూర్తయిన పిదప అమలులోకి వస్తుంది.అంటే 2029లో మాత్రమే అది అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.ఏదైనా కారణాల వల్ల ఈ డెడ్‌లైన్ మిస్ అయితే 2034లో జరగబోయే ఎన్నికల వరకు మహిళా రిజర్వేషన్లు అమలయ్యే పరిస్థితి లేదని మనం అర్థం చేసుకోవాలి.

ఇటీవల జరిగిన 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఎప్పటివలే మహిళా సభ్యుల ప్రాతినిధ్యం తీసికట్టుగానే ఉంది. దేశవ్యాప్తంగా 74 మంది మహిళలు మాత్రమే ఎంపీలుగా ఎన్నికయ్యారు.ఇది మొత్తం పార్లమెంట్ సభ్యుల్లో 13.6శాతం మాత్రమే.2019లో 78 మంది మహిళా పార్లమెంట్ సభ్యులు ఎన్నికయ్యారు. ఇది 14.4శాతంగా ఉంది.గత ఎన్నికల్లో 726 మంది మహిళలు పోటీ చేయగా,2024 ఎన్నికల్లో పోటీ చేసేవారి సంఖ్య 797కి పెరిగింది.అయినా ఎన్నిక అయిన మహిళా పార్లమెంట్ సభ్యుల సంఖ్య తగ్గడం గమనార్హం.ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించే విషయం మనకు తెలిసిందే.రాష్ట్రాలలో శాసనసభలకు జరిగే ఎన్నికల సందర్భంగా,మహిళలకు ప్రత్యేకంగా కొన్ని సంక్షేమ పథకాలను కూడా రాజకీయ పార్టీలు ప్రకటిస్తూ ఉంటాయి. ఈసారి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల లాగే, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మహిళా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అనేక పార్టీలు తమ మ్యానిఫెస్టోలలో ప్రత్యేక పథకాలను పొందుపరిచాయి. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా ఎన్నికల్లో పాలక, ప్రతిపక్ష పార్టీలు మహిళలే కేంద్ర బిందువు అన్నట్టుగా అనేక పథకాలు తీసుకువచ్చాయి.వీటన్నింటి ప్రభావం ఎన్నికల్లో ఉంటుందని, ఓట్లు వేయడానికి మహిళా ఓటర్లు పోటెత్తుతారని అందరూ భావించారు. కానీ అలా జరగలేదు. ఎండతీవ్రతతో పాటు ఓటింగ్ పట్ల నిరాసక్తతతో ఓటింగ్ శాతం తగ్గింది.

2019లో దేశవ్యాప్తంగా 67.01శాతం పురుష ఓటర్లు ఓట్లేయగా,67.18 శాతం మహిళా ఓటర్లు ఓట్లేశారు.ఈ ఎన్నికల్లో 65.8శాతం పురుష ఓటర్లు ఓట్లేస్తే,65.78శాతం మాత్రమే మహిళా ఓటింగ్ నమోదయ్యింది. ఈ ఎన్నికల్లో 31 కోట్ల మంది మహిళా ఓటర్లు ఓట్లేసినప్పటికీ ,గతంతో పోలిస్తే దాదాపు రెండు శాతం మహిళా ఓటింగ్ తక్కువ నమోదవడం గమనార్హం. అస్సాం , ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల లో మాత్రం 80శాతం పైబడి మహిళా ఓటింగ్ నమోదైంది.2019లో పార్లమెంట్ ఎన్నికలకు పోటీపడిన మహిళల్లో 9.4శాతం గెలిస్తే, ఈసారి 9.6శాతం మంది మాత్రమే గెలిచారు.పశ్చిమ బెంగాల్ నుంచి అత్యధికంగా 11 మంది మహిళలు పార్లమెంటుకు ఎన్నికవడం విశేషం. 2023లో ప్రపంచ వ్యాప్తంగా 52 దేశాల్లో పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి.ఇంటర్ పార్లమెంటరీ యూనియన్(ఐపియు) సమాచారం మేరకు ప్రపంచ వ్యాప్తంగా 27.6శాతం మహిళలు పార్లమెంటు సభ్యులుగా గెలుపొందారు.ఈ విషయంలో 185 ప్రపంచ దేశాల్లో భారత్ స్థానం 143 గా ఉంది. ఇది ఈ ఏడాది ఎన్నికలు జరగడానికి ముందు మన దేశ పరిస్థితి. ఈ ఎన్నికల తర్వాత, మన దేశ స్థానం ఇంకా దిగజారే ప్రమాదం లేకపోలేదు. ఫిన్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, న్యూజిలాండ్, స్వీడన్ దేశాలు ఎప్పుడో మహిళా సమానత్వాన్ని సాధించాయి. అక్కడి ప్రజాప్రతినిధుల్లో అత్యధికులు మహిళలే. ఫలితంగా ఎలాంటి పథకాలైనా నూటికి నూరుశాతం విజయవంతమవుతుంటాయి.

మన దేశం పార్లమెంట్‌లో మహిళల భాగస్వామ్యం అంతంత మాత్రంగా ఉంటే, అనేక దేశాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆశాజనకంగా ఉన్నాయి.ఈ మధ్యే మెక్సికోలో క్లాడియో మొట్టమొదటి మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు.అధ్యక్ష స్థానం కోసం పోటీ పడిన ఇద్దరు అభ్యర్థులు మహిళలు కావడం విశేషం. ఇదేదో ఒక రోజులో జరిగింది కాదు. మెక్సికో కూడా లిబరల్ దేశమేమీ కాదు.అక్కడ కూడా చాందసవాద శక్తులు,గుత్త పెట్టుబడిదారీ శక్తులు వివిధ రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని అడ్డుకుంటూనే ఉన్నాయి. అయితే,ఈ శక్తులపై పురోగామి శక్తులు,ఫెమినిస్టులు దశాబ్దాలుగా పోరాటం సాగిస్తూనే ఉన్నారు.దాని ఫలితమే ప్రస్తుతం మెక్సికోలో కొన్ని సానుకూల పరిణామాలు చోటు చేసుకున్నాయి

మన దేశంలో పార్లమెంటరీ రంగంలోనే కాదు నిర్ణయాత్మక రంగాలలో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉండడం వల్లనే,దేశం అనుకున్న రీతిలో అభివృద్ధి చెందడానికి అవరోధంగా ఉంది.1947లో దేశ మొత్తం అక్షరాస్యత కేవలం 12శాతం ఉండగా నాడు మహిళల్లో అక్షరాస్యులు 6శాతం మాత్రమే. ప్రస్తుతం మొత్తం అక్షరాస్యత 77.7శాతం ఉండగా మహిళలది 70.3శాతంగా నమోదైంది. పురుషులతో పోలిస్తే మహిళల అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్నప్పటికీ స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లతో పోలిస్తే గణనీయంగా పెరిగింది.1957లో కేరళ లో నంబూద్రి నేతృత్వంలో వామపక్ష ప్రభుత్వం భూ సంస్కరణలు అమలు చేసింది.1977లో పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు ప్రభుత్వం కూడా భారీగా భూ సంస్కరణలు అమల్లోకి తీసుకొచ్చింది. మిగులు భూమిని పేద ప్రజలకు ఇవ్వబడింది.తినడానికి ఆహారం,చదువుకోవడానికి విద్య ప్రజలకు లభించింది.అందుకే మానవాభివృద్ధిలో మొదటి స్థానం కేరళ రాష్ట్రానిది. 100శాతం అక్షరాస్యత సాధించబడింది.ఈ నిర్ణయాల వల్ల కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మహిళల స్థితిగతులు గణనీయంగా పెరిగాయి.

1992లో 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా మహిళలకు అన్ని స్థానిక సంస్థల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించారు. తర్వాత 2002లో పట్టణ స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగాన్ని మరోసారి సవరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, త్రిపుర, కేరళ రాష్ట్రాల్లో పంచాయతీల్లోనూ మహిళలకు 50శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. ఫలితంగా వారి ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాల్లోనూ మహిళలు సమర్థంగా తమ విధుల్ని నిర్వర్తిస్తున్నారు. పారిశ్రామిక, ఐటీ, సాంకేతిక, బ్యాంకింగ్ రంగాల్లో ముందంజ వేస్తున్నారు. ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగంలో సమాన అవకాశాలు అంది పుచ్చుకుంటున్నారు. కార్యాలయంలో నూతనత్వం, సామర్థ్యం, సమానత్వాన్ని తీసుకురావడానికి సంస్థలు ఎక్కువగా మహిళలను నియమించుకోవాలని చూస్తున్నాయి. ఐటీ తర్వాత బ్యాంకింగ్, అకౌంటింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగాల్లో అతివలకు అత్యధిక అవకాశాలు లభిస్తున్నాయి. దేశాభివృద్ధికి మహిళలు చేస్తున్న సేవ ఏ జీడీపీ లెక్కలతోనూ కొలవలేనిది. చంద్రయాన్3 అద్భుత విజయంలో మహిళా సైంటిస్టుల పాత్ర తిరుగులేనిది. అయితే, అన్ని రంగాలలో మన దేశంలో మహి ళలు తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారు. కానీ అనుకున్న స్థాయిలో వారి పురోగతి మాత్రం ముందుకు సాగడం లేదు.

చదువు, అవకాశాల్లో ఆడపిల్లలపై వివక్ష, భ్రూణ హత్యలు, అత్యాచారాలు దేశంలో ఏదోమూలన నిత్యం జరుగుతూనే ఉన్నాయి. స్త్రీలకు స్వేచ్ఛ, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి చట్టాలు తీసుకొచ్చినా పోరాటం తప్పడం లేదు.మహిళలపై, బాలికలపై జరుగుతున్న హింస ఆకృత్యాలు పెరుగుతూనే ఉన్నాయి. అసంఘటిత రంగాలలో మహిళలు వారి కనీస సదుపాయాల కోసం నిత్యం పోరాటం చేయాల్సి వస్తుంది. భారతదేశానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన మహిళా రెజ్లర్లపై కూడా లైంగిక వేధింపులు తప్పలేదు. మణిపూర్‌లో కుకీ ప్రజలపై జరిగిన దాడులు, మహిళలపై జరిగిన అత్యాచారాల ఘటనలపై విచారం వ్యక్తం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలని సుప్రీం కోర్టు హెచ్చరిక చేసేవరకు కూడా కేంద్రం పట్టించుకోలేదు. మహిళా ముఖ్యమంత్రులు ఉన్న చోట్ల కూడా మహిళలు, చిన్నారులపై దాడులు యథేచ్ఛగా ఎందుకు కొనసాగుతున్నాయి?మన దేశంలో పురుషాధిక్య ధోరణి,లైంగిక అణచివేత పోవాలంటే చట్టసభల్లో కేవలం మహిళల ప్రాతినిధ్యం పెరిగితే మాత్రమే సరిపోదు, రాజకీయాల తీరుతెన్నులు కూడా మారాల్సివుంది.

18వ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో ఎన్నికైన పార్లమెంట్ సభ్యులలో 93శాతం మంది కోటీశ్వరులని, అనేకమంది ఎంపీలకి నేర చరిత్ర ఉందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ అనే స్వచ్ఛంద సంస్థ తెలియచేస్తోంది.ధనమయ, నేరమయ రాజకీయాలు రూపుమాపకుండా పురోగామి, మహిళాభ్యుదయ రాజకీయాలు సాధ్యమా అనేదే ప్రశ్న? బాధాకరమైన విషయం ఏమిటంటే మహిళాభ్యుదయంలో ముందంజలో ఉన్న కేరళ రాష్ట్రం నుంచి ఒక్క మహిళా పార్లమెంట్ సభ్యులు కూడా ఎన్నిక కాలేదు. కనుక,పార్లమెంట్‌లో,చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచే మహిళా చట్టాన్ని తక్షణమే అమలు చేయాలి. ప్రజల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలతో ముందుకొచ్చే వామపక్ష, అభ్యుదయ శక్తులను ప్రజలు ఆదరించాలి. మతవాద, చాందసవాద రాజకీయ శక్తులను ఓడించాలి. అన్ని రకాల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడే, ప్రత్యామ్నాయ శక్తుల రాజకీయ ప్రాబల్యం పెరిగినప్పుడే నిజమైన మహిళాభ్యున్నతి, మహిళా సాధికారత సాధ్యం.

> మన దేశం పార్లమెంట్‌లో మహిళల భాగస్వామ్యం అంతంత మాత్రంగా ఉంటే, అనేక దేశాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆశాజనకంగా ఉన్నాయి.ఈ మధ్యే మెక్సికోలో క్లాడియో మొట్టమొదటి మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు.అధ్యక్ష స్థానం కోసం పోటీ పడిన ఇద్దరు అభ్యర్థులు మహిళలు కావడం విశేషం. ఇదేదో ఒక రోజులో జరిగింది కాదు. మెక్సికో కూడా లిబరల్ దేశమేమీ కాదు.అక్కడ కూడా చాందసవాద శక్తులు,గుత్త పెట్టుబడిదారీ శక్తులు వివిధ రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని అడ్డుకుంటూనే ఉన్నాయి. అయితే,ఈ శక్తులపై పురోగామి శక్తులు,ఫెమినిస్టులు దశాబ్దాలుగా పోరాటం సాగిస్తూనే ఉన్నారు.దాని ఫలితమే ప్రస్తుతం మెక్సికోలో కొన్ని సానుకూల పరిణామాలు చోటు చేసుకున్నాయి.

> ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాల్లోనూ మహిళలు సమర్థంగా తమ విధుల్ని నిర్వర్తిస్తున్నారు. పారిశ్రామిక, ఐటీ, సాంకేతిక, బ్యాంకింగ్ రంగాల్లో ముందంజ వేస్తున్నారు. ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగంలో సమాన అవకాశాలు అంది పుచ్చుకుంటున్నారు. కార్యాలయంలో నూతనత్వం, సామర్థ్యం, సమానత్వాన్ని తీసుకురావడానికి సంస్థలు ఎక్కువగా మహిళలను నియమించుకోవాలని చూస్తున్నాయి. ఐటీ తర్వాత బ్యాంకింగ్, అకౌంటింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగాల్లో అతివలకు అత్యధిక అవకాశాలు లభిస్తున్నాయి. దేశాభివృద్ధికి మహిళలు చేస్తున్న సేవ ఏ జీడీపీ లెక్కలతోనూ కొలవలేనిది. చంద్రయాన్3 అద్భుత విజయంలో మహిళా సైంటిస్టుల పాత్ర తిరుగులేనిది. అయితే, అన్ని రంగాలలో మన దేశంలో మహి ళలు తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారు. కానీ అనుకున్న స్థాయిలో వారి పురోగతి మాత్రం ముందుకు సాగడం లేదు.

> మన దేశంలో పార్లమెంటరీ రంగంలోనే కాదు నిర్ణయాత్మక రంగాలలో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉండడం వల్లనే,దేశం అనుకున్న రీతిలో అభివృద్ధి చెందడానికి అవరోధంగా ఉంది.1947లో దేశ మొత్తం అక్షరాస్యత కేవలం 12శాతం ఉండగా నాడు మహిళల్లో అక్షరాస్యులు 6శాతం మాత్రమే. ప్రస్తుతం మొత్తం అక్షరాస్యత 77.7శాతం ఉండగా మహిళలది 70.3శాతంగా నమోదైంది. పురుషులతో పోలిస్తే మహిళల అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్నప్పటికీ స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లతో పోలిస్తే గణనీయంగా పెరిగింది.1957లో కేరళ లో నంబూద్రి నేతృత్వంలో వామపక్ష ప్రభుత్వం భూ సంస్కరణలు అమలు చేసింది.1977లో పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు ప్రభుత్వం కూడా భారీగా భూ సంస్కరణలు అమల్లోకి తీసుకొచ్చింది. మిగులు భూమిని పేద ప్రజలకు ఇవ్వబడింది.తినడానికి ఆహారం, చదువుకోవడానికి విద్య ప్రజలకు లభించింది. అందుకే మానవాభివృద్ధిలో మొదటి స్థానం కేరళ రాష్ట్రానిది.

ప్రాచీన కవిత్వం సంకెళ్లు తెంపిన
గండ్రగొడ్డలై గర్జించాడు
నవకవితకు తొలి వేకువై కలం
విదిల్చిన గళం తానే అయ్యాడు
ఆకాశాన విహరిస్తున్న కవితా కన్యను
దివి నుండి భువికి దింపి
దీనుల హీనుల ఆకలికేకలు
విని తరించమన్నాడు!
యమాతారాజభానస బానిసత్వం
రద్దుచేసి ఛాందస ఛందస్సుకు

## యుగకవి!



చెలియలి కట్టేసి..
పతితుల భ్రష్టుల
బాధాసర్పద్రష్టుల
ఆకలి ఆవేదనల కవితా మంత్రం
జగమంతా వినేలా కోడై కూసాడు
సంకుచిత భావాల మళ్ల తెగ్గొట్టి
అనంత భావజలధిని
సమస్త శ్రామిక కవితా సేద్యానికి
జలజలా ప్రవహింపజేశాడు!
మానవత్వమే కవిత్వమన్న తత్వాన్ని
సలసలా మరిగే తన భావాల
కొలిమిలోంచి
పాఠకుల మెదళ్లలో భగభగా వొంపుతూ
ధ్వంస జీవితాల ఆకలి పేగులతో
నవకవన రుద్రవీణ
మోగించి పండిత
పామరుల్ని ప్రభావితుల్ని చేసాడు!
కుక్కపిల్ల అగ్గిపుల్ల సబ్బుబిళ్ల..
కాదేదీ కవిత కనర్హమంటూ ప్రతీ
పాఠకుణ్ణి తన్ను మించిన కవిగా
మల్చేంత ప్రేరణ అవుతూ మరో
ప్రపంచం పిలిచిందంటూ
నవయుగాన్నే పలవరిస్తూ
మహాప్రస్థానం వైపు సాగిపోయాడు..!!

(నేడు శ్రీశ్రీ వర్ధంతి)

- భీమవరపు పురుషోత్తమ్
సెల్: 9949800253

# అధికారం కారాదు ఏకపక్షం!





మేకిరి దామోదర్
9573666650

మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని వర్గాల ప్రజలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన స్థాయిలో అభివృద్ధి సాధించబడాలి, అలా కాకపోతే అది ప్రజాస్వామ్యం అనబడదు. ప్రజా సంక్షేమమే ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మని భావిస్తారు. పాలకుల పాలనా విధానాలు, ప్రణాళికలు క్షేత్రస్థాయిలో వాటి అమలుపై ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉంటేనే అభివృద్ధి, స్వేచ్ఛ, సమానతలు కాపాడబడతాయి. రాజకీయ నాయకు (పార్టీ)ల తప్పుడు విధానాల ఫలితంగా అన్నెం,పున్నెం ఎరగని లక్షల, కోట్ల మంది ఆ ఫలితాన్ని అనుభవించాల్సి వస్తుంది. మొన్నటి ఎన్నికల ఫలితాల్లో అవి స్పష్టంగా కనిపించాయి. ఈ ఫలితాల నుంచి పాఠాలు, గుణ పాఠాలు పాలక, ప్రతిపక్షాలకు నేర్చుకోవాల్సిందే. అభివృద్ధి అంటే? ప్రజల ఖాతాల్లో డబ్బులు వేయడం కాదు. పాలన అంటే అప్పులు చేసి ప్రజలకు అంటగట్టడం, పంచిపెట్టడం పేరుతో పాలకులు వెనకేసుకోవడం అంతకన్నా కాదు!?. పవర్ అంటే అహంకారం కానే కాదు, బాధ్యతతో కూడిన సేవ అనేది విస్మరించరాదు. ప్రజాస్వామ్యంలో వ్యక్తిపూజ, నిరంకుశత్వ అవకాశవాద ఓటు బ్యాంకు రాజకీయాలకు కాలం చెల్లిందనే రీతిలో జనం ఓటు కర్రుతో కాల్చివాత పెట్టారు! ప్రజల ముందు ఈ విద్వేష రాజకీయ వేషాలు నడవవన్న సంగతి తెలుసుకోవాలి. అనుకున్న మెజార్టీ రాకపోవడానికి కారణాలు విశ్లేషించుకోవాలి. అలాగే అధికారపక్షాన్ని ఇకనుంచి సరైన దారిలో నడిపించడం ప్రతిపక్షాల బాధ్యతేనని గుర్తుంచుకోవాలి.

నూతన పార్లమెంట్‌లో కొలువుదీరిన ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అభివృద్ధి ఎజెండాకు ప్రాధాన్యమిస్తేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. భారత ప్రజాస్వామ్యం ఇంకెంత మాత్రం ఏకపక్షం కాకూడదని బలంగా కోరుకున్న ఓటర్ల విజ్ఞతకు తాజా ఫలితాలు అద్దం పడుతున్నాయి. నేడు ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం సంకీర్ణ ధర్మాన్ని పాటిస్తూ ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో వ్యవహరించాలి. ప్రజల ఆకాంక్షలకి పట్టం కడుతూ, నెరవేర్చే దిశగా ముందుకు సాగాలి. అంతేకాదు సమాఖ్య స్ఫూర్తికి పెద్దపీట వేస్తూ రాష్ట్రాలను కలుపు కొని వెళ్తేనే మనుగడ సాగిస్తామనేది కాదనలేని వాస్తవం. సంకీర్ణ రాజనీతి ప్రదర్శిస్తేనే దేశానికి క్షేమదాయకం అవుతుంది. మన భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఉందంటున్నారు మన ప్రధాని. అభివృద్ధి రేటు ఏడు శాతం అని చెబుతున్నారు. వృద్ధి అంత వేగంగా ఉంటే నిరుద్యోగం ఎందుకు ఉందన్నది ఓ చిక్కుముడి. ఇప్పటికైనా దానిపై ప్రభుత్వాలు నేడు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రాజకీయంగా నిలదొక్కుకోవడానికో, భవిష్యత్తులో మళ్లీ అధికారం చేపట్టడానికో ఓటు బ్యాంకు రాజకీయాలకో నగదు బదిలీ పథకాలు అమలు చేస్తున్నారు. దీని మూలంగా అతి ప్రధానమైన ప్రజల ఆరోగ్యం, విద్య, వైద్యం మీద పెట్టాల్సినంత శ్రద్ధ, తగినన్ని నిధులు ఖర్చు చేయడం లేదు. పేదరికంలో ఉన్నవారికి ఈ పథకాలు ఉపశమనం మాత్రమే. కానీ దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేరలన్నా, అభివృద్ధి కావాలన్నా వారి కొనుగోలు శక్తి పెంచడం ద్వారానే సాధ్యమవుతుంది. ఉపాధి కల్పించడంతో పాటు జీవన ప్రమాణాలు మెరుగుపరచాలి. ఇప్పటి వరకు ఆ దృష్టి మన పాలకుల్లో లేకపోవడం పెరుగుతున్న పేదరికానికి సంకేతం. ప్రజల అవసరాలు, వారి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని స్వల్పకాలిక, దీర్ఘకాలిక విధానాలతో ప్రాధాన్యాన్ని గుర్తించి వ్యవహరించాల్సి ఉంది. కానీ ఈరోజు గడిచిపోతే చాలు అనుకునే విధంగా వ్యవహరిస్తే? మరి విద్య, వైద్యం, ఆరోగ్యం ఎప్పటికీ సామాన్యులకు అందని ద్రాక్షగానే మిగలనుంది.

75 ఏండ్ల స్వాతంత్ర్య 'అమృతోత్సవాలు' జరుపుకున్నాం. సాంకేతిక వినియోగం కూడా బాగా పెరిగింది. కానీ దేశ సంపద మాత్రం కొద్ది మంది వద్ద కేంద్రీకృతం అవ్వడంతో అభివృద్ధిలో అసమానతలు, నిరుద్యోగం, పేదరికం మాత్రం ఇప్పటికీ అలానే కొనసాగుతున్నాయి. దీనికి తోడు రాజకీయ పార్టీ(నాయకు)ల్లో, అధికారుల్లో అంకితభావం, నిజాయితీ తగ్గి స్వార్థం పెరిగిపోయి ప్రజా ప్రయోజనాలు విస్మరిస్తున్నారు. ప్రపంచంలోనే యువ జనాభా ఎక్కువ గల మనదేశంలో ముఖ్యంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే అభివృద్ధే మనకు అవసరం. దానిపై దృష్టి పెడితేనే అభివృద్ధి జరుగుతుంది. ఇప్పుడున్న అసమానతలను తగ్గించాలి, అప్పుడే సహకార ధోరణి పెరుగుతుంది. క్షేత్రస్థాయిలో ఆదాయ వనరులు ఎలా పెంచాలి? లబ్ధిదారులకు ఎలా అందించాలనేది నేటి పాలకులు గమనించి పాటించాల్సి ఉంది. ఈ సమస్య మూలాలు గుర్తించి పరిష్కరించాలి. అమెరికా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశమని చెప్పుకునే ముందు ఆ పాలకుల, సమాజం వినూత్న విధానాలను, ఫలితాలను అధ్యయనం చేయాలి. ఆ తర్వాత మన విద్య ,వైద్యంలో పరిశోధనలు, ఉన్నత చదువులపై ప్రత్యేక దృష్టితో ఉద్యోగ అవకాశాలు పెంపొందించాలి.

మన దేశ రాజ్యాంగంలో పొందుపరచుకున్న విధంగా మనది రాష్ట్రాల సమాహారం. ఆ సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలి. మనదేశంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య భిన్న అభిప్రాయాలు ద్వంద్వ విధానాలు కనిపిస్తున్నాయి. పన్నుల వాటా-బదిలీ అయినా, పెట్టుబడులైనా నిష్పాక్షికంగా వ్యవహరిస్తే దేశానికి మంచిది.రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీపడితే దేశానికి కూడా మంచిదే కదా!.కేంద్రం గుత్తాధిపత్యం, ఏక చత్రాధిపత్యంతో వ్యవహరించరాదు. ఇప్పటివరకు మందబలంతో చేసిన చట్టాలు ప్రజలకు మేలుకంటే నష్టాన్నే ఎక్కువ చేశాయి. సభలో చర్చించకుండా ప్రతిపక్షాల సలహాలు, సూచనలు తీసుకోకుండా చేసిన నిర్ణయాల పట్ల ప్రజలు ఒకింత అసహనంతోనే ఉన్నారన్న విషయం పాలకులు గమనంలో పెట్టుకోవాలి. అలాగే స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తుందనే అభిప్రాయం కూడా ప్రజల్లో బలంగా వచ్చింది. ఎందుకంటే దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరిగిన తీరే దానికి నిదర్శనం. అధికారంలోకి రావడానికి మత,విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా వారి పట్ల ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోలేదు. ఎందుకు రాజకీయ నాయకులకు లోబడిందనే విమర్శలు వచ్చాయి? ఇది పాలకపక్షం పట్ల సహజంగానే వ్యతిరేకతను పెంచింది. అందుకే ఎన్నికల్లో చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చారు జనం. అధికార యంత్రాంగాన్ని తమ చెప్పు చేతుల్లో ఉంచుకోకూడదు. వారిని స్వేచ్ఛగా పనిచేయించాలి.

కేంద్రం ఇవ్వాల్సిన నిధుల్లో రాష్ట్రానికో తీరు, ప్రాంతానికో తీరు తమ డబులింజన్ సర్కార్లు ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ ప్రాధాన్యత, ఎక్కువ సౌకర్యాలు కల్పిస్తున్నది. పెట్టుబడులు, మౌలిక వసతులు అక్కడికే వెళుతున్నాయి. ప్రయివేటు పెట్టుబడులు కూడా అక్కడే పెట్టించి కార్పొరేట్ శక్తులకు లాభం చేకూరుస్తున్నది. ఇది మారాల్సిన అవసరం ఉన్నది. అన్ని రాష్ట్రాలను సమాన అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగాలి. సంకీర్ణ ప్రభుత్వం ఆ బాధ్యతను తీసుకోవాలి. ఎన్డీయేపై ఒత్తిడిని పెంచి ఇప్పటివరకు అందని రాష్ట్రాలకు నిధులు వచ్చేలా చూడాలి. రాజకీయ పార్టీలైనా అధికార, ప్రతిపక్షాలైనా అంతిమ లక్ష్యం ప్రజా ప్రయోజనాలే అనే అంశాన్ని విస్మరించకూడదు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన, విద్య, వైద్య రంగాల పరిపుష్టికి ప్రాధాన్యతనిస్తూ పాలన చేయాలి. విద్వేషం, కుల, మత, ప్రాంత, లింగ వివక్ష, విభేదాలు లేని విధంగా సమ్మిళిత అభివృద్ధికి పాటుపడుతూ పౌర స్వేచ్ఛను పరిరక్షించాలి. ఈ తీర్పు నుండి "పాలక, ప్రతిపక్షాలను అధికారానికి బెత్తెడు దూరంలో ఉంచిన ప్రజల చైతన్యం ఓ గుణపాఠం" నేర్పుతుంది. పాలకులంటే ప్రభువులు కాదనే ఆలోచనతో ప్రజల ఆకాంక్ష మేరకు పాలన సాగించాలి.లేదంటే అధికారానికే కాదు, ప్రజలకే దూరమవుతారు.

> 75 ఏండ్ల స్వాతంత్ర్య 'అమృతోత్సవాలు' జరుపుకున్నాం. సాంకేతిక వినియోగం కూడా బాగా పెరిగింది. కానీ దేశ సంపద మాత్రం కొద్ది మంది వద్ద కేంద్రీకృతం అవ్వడంతో అభివృద్ధిలో అసమానతలు, నిరుద్యోగం, పేదరికం మాత్రం ఇప్పటికీ అలానే కొనసాగుతున్నాయి. దీనికి తోడు రాజకీయ పార్టీ(నాయకు)ల్లో, అధికారుల్లో అంకితభావం, నిజాయితీ తగ్గి స్వార్థం పెరిగిపోయి ప్రజా ప్రయోజనాలు విస్మరిస్తున్నారు. ప్రపంచంలోనే యువ జనాభా ఎక్కువ గల మనదేశంలో ముఖ్యంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే అభివృద్ధే మనకు అవసరం. దానిపై దృష్టి పెడితేనే అభివృద్ధి జరుగుతుంది. ఇప్పుడున్న అసమానతలను తగ్గించాలి, అప్పుడే సహకార ధోరణి పెరుగుతుంది. క్షేత్రస్థాయిలో ఆదాయ వనరులు ఎలా పెంచాలి? లబ్ధిదారులకు ఎలా అందించాలనేది నేటి పాలకులు గమనించి పాటించాల్సి ఉంది.

నవతెలంగాణ 5
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
శనివారం | జూన్ 15, 2024 | www.navatelangana.com

## బిల్డ్ ఎక్స్‌పో - 2024 కరపత్రం విడుదల



నవతెలంగాణ - భగత్‌నగర్

కరీంనగర్‌లో సెప్టెంబర్ 13, 14, 15 తేదీలలో నిర్వహించనున్న బిల్డ్ ఎక్స్ పో-2024 కరపత్రాన్ని అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ (ఇండియా), సివిల్ ఇంజనీర్స్ అండ్ ఆర్కిటెక్ట్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో అసోసియేషన్ ప్రతినిధులు ఏసీసీఈ చైర్మన్ ఈగల రాజేందర్, కేసీసీఈఏడబ్ల్యూ ప్రెసిడెంట్ రాజేష్ కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ కరీంనగర్‌లోని వైశ్యభవన్ ముందు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సెక్రటరీ ఈ.గడ్డం హరికిషన్, సెక్రెటరీ దూస సురేష్, ట్రేజరర్ పెద్ది ప్రమోద్, సివిల్ ఇంజనీర్స్ కోలా అన్నారెడ్డి, సబ్బని శ్రీనివాస్, భీమనాతిని రంజిత్, బషీర్ పాల్గొన్నారు.

# దండిగా రా'బడి'



### ప్రయివేటు స్కూళ్లలో రూ.50వేల నుంచి రూ.లక్ష దాటిన ఫీజు

- పుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫాంకు అదనపు వసూలు
- ఒక్కో పాఠశాలలో ఒక్కో సిలబస్
- బహిరంగ మార్కెట్‌లో దొరకని పుస్తకాలు
- ఎంఆర్‌పీ ధరతోనే విక్రయాలు..
- ఒక్కో పుస్తకంపై 50శాతానికిపైగా మార్జిన్
- ఒక్కో కార్పొరేట్ స్కూల్ పుస్తకాల విక్రయాలపైనే రూ.4కోట్లకుపైగా వ్యాపారం
- 50శాతం మార్జిన్ చూసుకున్నా.. రూ.2కోట్ల నుంచి రూ.2.5కోట్ల లాభం
- ఇదంతా కండ్లెదుటే ఉన్నా.. కదలని అధికార యంత్రాగం..



**ప్రస్తుత పరిస్థితుల్లో విద్య వ్యాపారమైపోయింది. రూ.లక్షల్లో ఖర్చు పెడితే తప్ప చదువు'కొన'లేని పరిస్థితి నెలకొంది. మంచి లాభదాయక వ్యాపారం కావడంతో ఏయేటికాయేడు పోటీపడి మరీ కొంగొత్త పేర్లతో పదుల సంఖ్యలో ప్రయివేటు పాఠశాలలు వెలుస్తుండటం ఇందుకు అద్దం పడుతోంది. డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలే పాఠశాలలూ తెరుస్తున్నాయంటే నష్టం లేని బిజినెస్‌గా స్కూల్ ఎడ్యుకేషన్ మారిందని చెప్పొచ్చు. బహిరంగ మార్కెట్‌లో దొరకని, పక్క పాఠశాలలో లభించని సిలబస్‌ను పరిచయం చేస్తూ ఆయా పుస్తకాలను బహిరంగంగానే పాఠశాలల్లోనే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దండిగా రా'బడి' ఉన్న ప్రయివేటు పాఠశాలల విద్యావాపారంపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం..**

*నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి*

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కరీంనగర్, రామగుండం వంటి రెండు కార్పొరేషన్లు ఉండగా.. కొత్తపల్లి, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్, సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇవేగాకుండా మేజర్ పంచాయతీలు మరో 20వరకూ ఉన్నాయి. పెద్దఎత్తున పట్టణీకరణ ఉన్న ఉమ్మడి జిల్లాలో సుమారు 650 వరకూ ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 20వరకూ టెక్నో ఈ టెక్నో, కాన్సెప్ట్, ఇంటర్నేషన్, ఒలంపియాడ్, సిబీఎస్‌సీ పేర్లతో ఏసీ క్యాంపస్‌లతో కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో నర్సరీ నుంచి 10వ తరగతి వరకూ సగటున పాఠశాల స్థాయిని బట్టి ఫీజు రూ.20వేల నుంచి రూ.70వేల వరకు ఉంది. కార్పొరేట్ స్కూళ్లలో నర్సరీ స్థాయికే రూ.80వేల నుంచి రూ.లక్ష వసూలు చేస్తున్నారు. ఆపై తరగతులు పెరుగుతున్నా కొద్దీ చివర పదో తరగతి ఫీజు రూ.2లక్షలు వసూలు చేస్తున్నాయి. ఈ ఫీజులేగాకుండా హాస్టల్ వసతి కల్పించే పాఠశాలలు రూ.70వేల నుంచి రూ.లక్షన్నర అదనంగా వసూలు చేస్తున్నాయి. ఇదంతా ఒకెత్తయితే.. డిగ్రీ, ఆపై ఉన్నత విద్యాసంస్థల యాజమాన్యాలు సైతం లాభసాటిగా ఉన్న పాఠశాల విద్యాసంస్థలను నెలకొల్పుతున్నాయి. ఒకే బ్రాంచికి ఉన్న అనుమతులతో రెండు, మూడు బ్రాంచీలు నిర్వహిస్తున్నారు.

### యథేచ్ఛగా నిబంధనలకు పాతర..

ప్రభుత్వ జీవో నెంబర్ 91 ప్రకారం.. ప్రతి ప్రయివేటు పాఠశాలలో గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లా స్థాయిలో ఫీజు నియంత్రణ కమిటీలను నియమించాల్సి ఉంది. గవర్నింగ్ బాడీ ప్రతిపాదించే ఫీజులను నియంత్రణ కమిటీ ఆమోదించాలనే నిబంధన ఉంది. ప్రాథమికోన్నత స్థాయి తరగతి వరకూ రూ.25వేలు, ఉన్నత పాఠశాలల్లో రూ.30వేలు మించి ఫీజు వసూలు చేయకూడదనే కండీషన్ కూడా ఉంది. ఈ నిబంధనలు అతిక్రమిస్తే అంతకు 10రెట్లు జరిమానా విధించే అవకాశమూ ఉంది. అయితే, ఈ నిబంధనల్లో ఏ ఒక్కటీ అమలు కావడం లేదు. అమలు చేయాల్సిన ప్రభుత్వాలూ పట్టించుకోకపోగా.. ప్రభుత్వ యంత్రంగమూ 'మామూలు' వ్యవహారంగా మార్చేసింది. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు గగ్గోలు పెట్టినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటే విద్యావ్యాపారం ఏ స్థాయిలో పర్సంటేజీ బాగోతం సాగుతుందో బేరీజు వేసుకోవచ్చు.

**కరీంనగర్‌లోని మంకమ్మతోటకు చెందిన శ్రీనివాస్ తన కొడుకును మంచి స్కూళ్లో వేయాలని భావించి దగ్గర్లోని ఓ కార్పొరేట్ స్కూల్‌ను సంప్రదించాడు. నర్సరీలో జాయిన్ చేసేందుకు వెళ్లిన అతను ఫీజుల రేట్లు చూసి బెంబేలెత్తాడు. నర్సరీ ఫీజు రూ.30వేలు కాగా.. అడ్మిషన్ ఫీజు, పుస్తకాలు, స్కూల్ డ్రెస్, టై, బెల్ట్, ఐడీ కార్డు కలుపుకుని మరో రూ.12వేలు చెప్పారు. పాఠశాల హంగూ ఆర్భాటాలు, అక్కడి కలర్‌ఫుల్ గదులు, చక్కటి ఇంగ్లీష్ సంభాషణలు చూసి తన్మయం చెందినా రూ.42వేల వరకూ ఫీజు చెల్లించేందుకు వారం పాటు ఆలోచనలో పడ్డాడు. పక్కనే ఉన్న మరో బడ్జెట్ స్కూల్‌లో సంప్రదించాడు. అక్కడ కొంత ఉపశమనంగా ఫీజులు కనిపించినా.. పై వస్తువులతోపాటు ఫీజులన్నీ కలిపి రూ.25వేలు దాటుతోంది. ఇలా ఏ ఒక్క ప్రయివేటు పాఠశాలకు వెళ్లినా నర్సరీకే రూ.20వేల నుంచి రూ.30వేల వరకూ ఫీజులు ఉండటంతో చేసేది లేక తన స్థాయిలో ఫీజు చెల్లించదగ్గ పాఠశాలలో చేర్పించాడు. ఇది ఒక శ్రీనివాస్ పరిస్థితియే కాదు.. నర్సరీ చదివే పిల్లవాడి నుంచి మొదలు పదోతరగతి వరకూ రూ.30వేల నుంచి రూ.లక్షన్నరదాటే ఫీజులు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు..**

### 50శాతం పుస్తకాలు, నోటుబుక్కుల అమ్మకాలపైనే..

ఐదేండ్లుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఓ ట్రెండ్ నడుస్తోంది. ఢిల్లీ కేంద్రంగా కొందరు పబ్లిషర్స్ కొత్త బోధనా ప్రక్రియను పరిచయం చేస్తున్నారు. నిపుణులతో ఆయా పాఠశాలల్లో స్టాఫ్‌కు శిక్షణ ఇస్తున్నారు. ఆయా సంస్థలే తమ పబ్లిషర్స్ ముద్రించిన పుస్తకాలను అంటగడుతున్నాయి. అయితే ఇందులో ఓ వ్యాపార మెళకువను పాఠశాలకు సొమ్ము చేయిస్తున్నారు. వాళ్లు ఇచ్చే పుస్తకాలు బహిరంగ మార్కెట్‌లో ఎక్కడా విక్రయించకుండా నేరుగా పాఠశాలలకే ఇస్తున్నారు. పోటీ పడీ పుస్తకంపై ఉండే ఎంఆర్‌పీపైనా 50 నుంచి 60శాతం మార్జిన్ ఇస్తున్నారు. ఇలా ఒక్కో పాఠ్యపుస్తకం నర్సరీ స్థాయిలోనే రూ.250 నుంచి రూ.300 ఎంఆర్‌పీ ఉంటోంది. అదే ధరకు తల్లిదండ్రులకు విక్రయిస్తున్న పాఠశాల యాజమాన్యాలకు ఒక్కోదానిపై రూ.150వరకు లాభం వస్తోంది. ఇలా నర్సరీ మూడు నుంచి నాలుగుసెక్షన్లు ఉన్న ఒక్కో పాఠశాలలో కనీసంగా వంద మందికి పైగానే ఉంటున్నారు. ఈ లెక్కన నాలుగు పాఠ్య పుస్తకాలపై కనీసంగా రూ.500చొప్పున రూ.50వేలు మిగులుతోంది. ఇలా ఐదో తరగతి వరకూ రూ.5లక్షలు మిగులుతోంది. ఒక్క బడ్జెట్ స్కూల్‌కే రూ.5లక్ష వ్యాపారం సాగితే ఇక కార్పొరేట్ స్కూళ్లు, దాని బ్రాంచీల్లో వచ్చే ఆదాయం రూ.25లక్షల వరకూ ఉంటోంది. మొత్తంగా అన్ని పాఠశాలలు కలిపి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 650 పాఠశాలల్లో సగటున రూ.150కోట్ల వ్యాపారం సాగుతోంది.

## వైరాగ్యం ప్రభాకర్, పెనుగొండ బసవేశ్వర్‌కు పెందోట సాహిత్య పురస్కారాలు


వైరాగ్యం ప్రభాకర్


పెనుగొండ బసవేశ్వర్

నవతెలంగాణ - కరీంనగర్

సిద్దిపేటకు చెందిన శ్రీవాణి సాహిత్య పరిషత్ సంస్థ పెందోట పురస్కారాల కోసం 2023 సంవత్సరంలో ప్రచురించిన పుస్తకాలకు ఆహ్వానం పలకగా.. అందులో కరీంనగర్ జిల్లాకు చెందిన వైరాగ్యం ప్రభాకర్, పెనుగొండ బసవేశ్వర్ ఇద్దరు కవులు ఎంపికయ్యారు. ఆ సంస్థప్రకటనతో స్పందించిన సుమారు 80మంది కవులు, రచయితలు తమ పుస్తకాలను పంపించారు. అందులో నుంచి 9 పుస్తకాలకు బాల సాహిత్య, 4 పుస్తకాలకు సాహిత్య విభాగంలో మొత్తం 13 పురస్కారాలను సంస్థ వ్యవస్థాపకులు పెందోట వెంకటేశ్వర్లు ప్రకటించారు. ఇందులో కరీంనగర్ కు చెందిన కవి, రచయిత, విమర్శకులు భవానీ సాహిత్య వేదిక అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన బాలగేయ సారస్వతం పుస్తకానికి పెందోట బాల సాహిత్య పురస్కారానికి ఎన్నికైంది. మరో కవి, రచయిత కార్టూనిస్ట్, తెలంగాణ రచయితల వేదిక ఉపాధ్యక్షుడు పెనుగొండ బసవేశ్వర్ రచించిన 'ప్రశ్నను మింగిన కాలం' కవిత్వానికి పెందోట సాహిత్య పురస్కారం లభించాయి. త్వరలో సిద్దిపేటలో జరగనున్న కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రముతో సత్కరించనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. కరీంనగర్ కు చెందిన ఇరువురు కవులకు సాహిత్య పురస్కారం లభించడం పట్ల పలువురు కవులు తమ హర్షం వ్యక్తం చేశారు.

## మావోయిస్టు దంపతుల లొంగుబాటు..


రివార్డు అందిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

నవతెలంగాణ - కరీంనగర్ క్రైమ్

వరంగల్ జిల్లాకు చెందిన ఇద్దరు మావోయిస్టు దంపతులు శుక్రవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి వివరాలు వెల్లడించారు. హన్మకొండ జిల్లా హసనపర్తి మండలం సుదంపల్లి గ్రామానికి చెందిన తిక్క సుశ్మిత 27 ఇంటర్మీడియెట్ వరకు చదువుకుంది. మావోయిస్టు సానుభూతిపరుడుగా పనిచేసిన తన తండ్రి సుధాకర్‌ను చూసి తానూ ఆకర్షితురాలై తన చదువు అనంతరం 2016 వ సంవత్సరంలో ఛత్తీస్‌గడ్‌లోనిబీజాపూర్ జిల్లా కోమటిపల్లి గ్రామ అటవీప్రాంతంలో బడే చొక్కారావు సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరింది. ఛత్తీస్‌గడ్‌లోని సుకుమా జిల్లా పరియా గ్రామానికి చెందిన మడకం దూల సీపీఐ మావోయిస్టు పార్టీలోని తన అన్నయ్య ఐయేత చూసి ఆకర్షితుడైన 2015 వ సంవత్సరంలో అందులోచేరాడు. మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న సమయంలోనే సుశ్మిత, దూల మధ్య పరిచయం ఏర్పడి 2020 మార్చిలో వివాహం చేసుకున్నారు. తరువాత వివిధ హోదాల్లో పలు చోట్ల పనిచేసారు. మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోయి, తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకం గురించి తెలుసుకుని వీరిరువురూ వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిరువురికి ఒక్కొక్కరికి నాలుగు లక్షల నగదు రివార్డ్‌ను కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి బ్యాంకు డీడీ రూపంలో వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పి తిరుమల్ మరియు హసనపర్తి ఇన్‌స్పెక్టర్ జె సురేష్ పాల్గొన్నారు.

## టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ముజీబ్ హుస్సేన్

నవతెలంగాణ - కరీంనగర్ : టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం ముజీబ్ హుస్సేన్‌ని ఏకగ్రీవంగా టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో కేంద్ర కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. అలాగే కరీంనగర్ జిల్లాకు చెందిన గూడ ప్రభాకర్ రెడ్డిని కార్యదర్శిగా చోటు కల్పించారు. రాగి శ్రీనివాస్‌ని కూడా గతంలో జిల్లా సహాధ్యక్షులుగా చేసిన వారిని కూడా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ముజీబ్ హుస్సేన్, ప్రభాకర్ రెడ్డి, రావి శ్రీనివాస్ లకు కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస రెడ్డి, సంఘం లక్ష్మణరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పెద్దఎత్తున అభివృద్ధి పనులు : మేయర్ సునీల్ రావు



నవతెలంగాణ - కరీంనగర్

స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన వెయ్యి కోట్ల నిధులతో నగర వ్యాప్తంగా పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ అభివృద్ధిలో భాగంగా శుక్రవారం మేయర్ 13వ డివిజన్‌లో పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణుతో కలిసి రాంచంద్రపూర్ కాలనీలో 13లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ని కలిసిన బోయినపల్లి ప్రవీణ్‌రావు



నవతెలంగాణ - కరీంనగర్

బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ కుమార్ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు.

## ఉద్యోగులకు ప్రగతిచక్ర త్రైమాసిక అవార్డుల ప్రదానం



నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరంలో 2023-24 ఆర్థిక సంవత్సరం 3వ, 4వ త్రైమాసికంలో రీజియన్ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పురుషోత్తం మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన డ్రైవర్లతో ఇతర డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రమాదాలు నివారించే అవకాశం ఉంటుందని, ప్రతి త్రైమాసికంలో ప్రశంసా పత్రం, నగదు పురస్కారాల అందజేయడం వల్ల డ్రైవర్లకు ఉత్తేజం కలుగుతుందన్నారు. కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కరీంనగర్ జోన్ ఎంతో చరిత్ర ఉన్న జోన్ అని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. జోన్ కరీంనగర్ రీజియన్ ప్రథమ స్థానంలో ఉంటుందని, ఇదంతా సిబ్బంది సమిష్టి కృషి ఫలితమేనని అన్నారు. కరీంనగర్ జోన్‌కు ప్రతి రోజు 5.05 కోట్ల లక్ష్యం టార్గెట్ కాగా జోన్ రోజుకు 5.14 కోట్లు ఆర్జిస్తుందని, టార్గెట్ కన్నా ఇది 0.08 కోట్లు అధికము అని తెలిపారు. రానున్న రోజులలో డీలక్స్, ఆపై సర్వీసులలో ఆదాయాన్ని పెంపొందించుకొనుటకు కృషి చేయాలన్నారు. రీజనల్ మేనేజర్ ఎస్.సుచరిత మాట్లాడుతూ.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది, సూపర్‌వైజర్లకు ప్రగతి చక్ర అవార్డులు 2023-24 సంవత్సరం 3వ, 4వ త్రైమాసికానికి ప్రదానం చేస్తామన్నారు. ఈ అవార్డుల కింద శాలువా, ప్రశంసా పత్రంతో సన్మానించి నగదు పురస్కారం కూడా అందజేశామని తెలిపారు. 3వ త్రైమాసికంలో వి.రాజన్న (డ్రైవర్, కరీంనగర్-2 డిపో, 624 లీటర్ల ఆయిల్ ఆదా చేశారు), టి.రమాదేవి (కండక్టర్, వేములవాడ డిపో, అత్యధిక ఇన్‌సెంటివ్ రూ.4824లు అర్జించారు), జి.సురేష్ (అద్దె బస్సు డ్రైవర్, జగిత్యాల డిపో, అత్యధిక ఇన్‌సెంటివ్ రూ.4439లు అర్జించారు), 4వ త్రైమాసికంలో వి.రాజన్న (డ్రైవర్, కరీంనగర్-2 డిపో, 633 లీటర్ల ఆయిల్ ఆదా చేశారు), నర్సింహులు (కండక్టర్, వేములవాడ డిపో, అత్యధిక ఇన్‌సెంటివ్ రూ.19023లు అర్జించారు), కే.సుధాకర్ (అద్దె బస్సు డ్రైవర్, వేములవాడ డిపో అత్యధిక ఇన్‌సెంటివ్ రూ.24167లు అర్జించారు) మొత్తం 60 మంది ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్) కే.సత్యనారాయణ, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) భూపతి రెడ్డి, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, రీజియన్‌లోని అన్ని డిపోల మేనేజర్లు, అన్ని డిపోల ట్రాఫిక్, మెకానికల్ సూపర్‌వైజర్లు, సేఫ్టీ వార్డెన్‌సస, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు, వెల్ఫేర్ బోర్డు కమిటీ సభ్యులు, రీజనల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శిగా మహమ్మద్ సూఫీయన్



నవతెలంగాణ - భగత్‌నగర్

యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శిగా నగరానికి హౌసింగ్ బోర్డుకు చెందిన మహమ్మద్ సూఫీయాన్‌ను నియమించినట్లు యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ కరీంనగర్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ ఉత్తర్వులు జారీ చేశారు.. కరీంనగర్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహమ్మద్ అమీర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. సహకరించిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మహమ్మద్ అమీర్, అబ్దుల్ రెహమాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇసుక అక్రమ దందాను అరికట్టాలి

**సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

నవతెలంగాణ - మానకొండూరు

మానకొండూరు మండల వ్యాప్తంగా జరుగుతున్న ఇసుక అక్రమ దందాను వెంటనే అరికట్టాలని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని శ్రీనివాస్‌నగర్, లింగాపూర్, వెల్ది, వేగురుపల్లి, ఊటూరు గ్రామాలలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక దందా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. వెంటనే పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు చర్యలు చేపట్టి అరికట్టాలని డిమాండ్ చేశారు. అధికార యంత్రాంగం అలసత్వం కారణంగా భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఇసుకను కొంతమంది అక్రమార్కులు ధనార్జన ధ్యేయంగా ఇష్టానుసారంగా దందా కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. రోడ్ల వెంట సామాన్య ప్రజలు తిరగడానికి వీలు లేకుండా ఫిట్నెస్ లేని వాహనాలతో రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుంటే అధికార యంత్రాంగం నిమ్మకు నిరేత్తినట్టు వ్యవహరిస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రైతు భరోసా హామీని వర్షాకాల సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇంకా అమలు చేయడంలేదన్నారు. వెంటనే రైతు భరోసా అమలు చేయాలన్నారు. గ్రామ జ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ సంబంధించి క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఉన్నాయని సంబధిత సైట్ ఓపెన్ కావడం లేదని, సర్వర్ డౌన్ పేరుతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే అందరికీ జీరో బిల్లులు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆగస్టులో అమలు చేస్తానన్న రైతు రుణమాఫీ వెంటనే అమలు చేసి కొత్తగా బ్యాంకులో 18శాతంనిధులతో రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పలు గ్రామాల చెరువులో అక్రమంగా తరలిస్తున్న మట్టిని అరికట్టడంలో అధికార యంత్రంగాము జాప్యం చేస్తుందని అన్నారు. మండలంలోని నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటేప్రజలు ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్, మండల కమిటీ సభ్యుడు రాయికంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## రూ.10182.70 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక ఖరారు..

**కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**


మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ - కరీంనగర్

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 10182.70 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విడుదల చేశారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లతో రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, రికవరీ, పీఎం జీపీవై రుణాలు, ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖలతో పాటు పలు పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళికకు సంబంధించిన బుక్‌లెట్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..వ్యవసాయ అవసరాల కోసం రూ.3673.92 కోట్లు, ఎంఎస్‌ఎంఈ కింద రూ.2997.06 కోట్లు, విద్యా రుణాలు రూ.44.55 కోట్లు, గృహ రుణాలు రూ.192.00 కోట్లు, ఇతర రంగాలకు గానూ రూ.3275.17 కోట్ల రుణాలను బ్యాంకర్లు అందించాలని ఆదేశించారు. 2023 -24 ఆర్థిక సంవత్సరంలో 9927 స్వయం సహాయ బృందాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.64,049.25 లక్షలు అందించాలనేది లక్ష్యమని తెలిపారు. ఈ సంవత్సరం మార్చి 31 వరకు 12010 సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ.77021.92 లక్షల బ్యాంకు లింకేజీ అందించి 120.25 శాతం లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా రెండో స్థానం సాధించిందని వెల్లడించారు. ఇందుకు అధికారులు, బ్యాంకర్లను అభినందిస్తున్నానని అన్నారు. జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు రుణాలు అందించేందుకు బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి వంద శాతం లక్ష్యసాధనకు బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. బ్యాంకర్లు వినియోగదారులు, రైతులకు అత్యుత్తమంగా పని చేయాలని సూచించారు. రైతులకు పంట రుణాలను అందించాలని, ఇబ్బంది పెట్టవద్దని, రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామ గ్రామాన సేవలు మరింత విస్తృత పర్చాలని, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. గ్రామీణ అమాయక ప్రజలు సైబర్ నేరాల్లో చిక్కుకోకుండా అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఫోన్లకు వచ్చే గుర్తుతెలియని మెసేజ్లను ఓపెన్ చేయవద్దని సూచించారు. ప్రధానమంత్రి ఫార్మాలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ (పీఎం ఎఫ్ఎంఈ)పథకం క్రింద 180 లక్ష్యం కాగా జిల్లాలో 210 యూనిట్లను గ్రౌండింగ్ చేశామని తెలిపారు. వివిధ కార్యకలాపాల క్రింద బేకరీ, స్పైసస్, ఫ్లోర్ మిల్, రోస్టర్ మెషిన్, దాల్ మిల్, బియ్యం ఆధారిత ఉత్పత్తులు తదితర యూనిట్లను గ్రౌండింగ్ చేశామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చేయూతను అందించేందుకు బ్యాంకర్ల ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కోరారు. రైతులు తమ రుణాలను రెన్యూవల్ చేసుకునే అంశంపై వారికి అవగాహన కల్పించాలని, జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ బ్యాంకర్లు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా పంట రుణాలను అందించాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 నెల వరకు రూ.9954.20 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు గానూ రూ.4234.16 కోట్లు, ఎంఎస్‌ఎంఈ రంగంలో రూ.1763.02 కోట్లు, విద్యా రుణాలకు రూ.18.23 కోట్లు, హౌసింగ్ లోన్స్ రూ.299.61 కోట్లు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లకు రూ.770.22 కోట్లు, ఇతర రంగాలకు సంబంధించి రూ.2938.96 కోట్లు రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులైన రైతులందరికీ రుణాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాల్లో 133.04 శాతం పూర్తయిందని, పెండింగ్‌లో ఉన్న రుణాల ప్రతిపాదనలు సైతం బ్యాంకర్లకు అందించి త్వరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ప్రధానమంత్రి స్వానిది కింద మొదటి, రెండో, మూడో సారి రుణం దరఖాస్తు చేసుకున్న వారి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. బ్యాంకర్లు నియమ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ పవన్ కుమార్, ఎల్డీఎం ఆంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్ కుమార్, డీఆర్డీఓ శ్రీధర్, మెప్మా ఇన్చార్జి పీడీ స్వరూపా రాణి, జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, ఆర్బీఐ అధికారి పల్లవి, నాబార్డ్ డీడీఎం దిలీప్, ఎస్బీఐ ఏజీఎం వెంకటేష్, చీఫ్ మేనేజర్ రామచంద్రుడు, యుబీఐ ఏజీఎం సురేశ్, చీఫ్ మేనేజర్ కలీం, టీజీబీ ఆర్ఎం బాల నాగు, కేడీసీసీబీ సీఈఓ సత్యనారాయణ రావు, చేనేత శాఖ ఏడీ చరణ్, అడిషనల్ డీఆర్డీఏ సునీత, అన్ని బ్యాంకుల కంట్రోలర్స్, కో ఆర్డినేటర్స్, వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైపరీత్యాల కంటే ముందే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

• జగిత్యాల అదనపు కలెక్టర్ పి. రాంబాబు

నవతెలంగాణ-జగిత్యాల

ప్రకృతి వైపరీత్యాల కంటే ముందే ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలు, వరదల వల్ల ప్రమాదానికి గురయ్యే ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. గత సంవత్సరం అనుభావాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్డీవోలు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

# చక్క 'బడి'ందా..?

• విద్యార్థులకు అందుబాటులోకి రాని సౌకర్యాలు
• 591 అమ్మ ఆదర్శ స్కూళ్లలో పనులు షురూ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఈనెల 12 నుంచి ప్రభుత్వ పాఠశాలు పునః ప్రారంభమయ్యాయి. జగిత్యాల జిల్లాలో మొత్తంగా 791 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 62983 మంది విద్యార్థులు చదువుతున్నారు. దాదాపు అన్ని పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు పూర్తి స్థాయిలో ఆంగ్ల మాధ్యమ తరగతులను నిర్వ హిస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ మొదలైంది. దీంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడనుంది. మరోవైపు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్ల గడిచినా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిలో మార్పులేదు. గత ప్రభుత్వం మన ఊరు- మన బడి పథకం ప్రవేశపెట్టి అభివృద్ధి పనులు చేపట్టింది. కానీ అవి అసంపూర్తిగానే మిగిలిపోయాయి. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయలేదనే వాదనలున్నాయి. దీంతో అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణ పనులు సైతం పూర్తికాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో అభివృద్ధి పనులు చేపట్టింది. ఈ పనుల్లో 80 శాతం వరకు పూర్తయ్యాయని అధికారుల సమాచారం. కాని క్షేత్రస్థాయిలో చాలా వరకు అంతంత మాత్రంగానే పూర్తయ్యాయనేది నగ్న సత్యం. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పేలా లేవు.

### పలు పాఠశాలల్లో నత్త నడకన పనులు..

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య అందిస్తామన్న పాలకుల హామీ నీటిమూటలే అయ్యిందనే అభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి. మన ఊరు - మనబడి పథకం కింద జిల్లాలో 96 పాఠశాలలో పనులు పూర్తికాలేదు. ప్రస్తుతం అమ్మఆదర్శ పాఠశాలల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 591 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో ప్రస్తుతం 495 అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ఎంపిక కాబడినాయి. మిగితా 96 మన ఊరు-మన బడి పథకంలోఎంపిక కాబడి పనులు పూర్తికాక ప్రస్తుతం ఆ పనులను కూడా కొనసాగిస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ఎంపిక కాబడిన 591 పాఠశాలకు సంబంధించిన పనులను పంచాయతీ రాజ్ శాఖకు 14, టీఎస్ఈడబ్ల్యూ ఐడీసీకి 05, ఇరిగేషన్‌శాఖకు 01 మండలం చొప్పున కేటాయించారు.

### కేటాయించిన నిధులు రూ. 44 కోట్లు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం 591 పాఠశాలలో పనులు చేపట్టేందుకు రూ.44 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో 591 పాఠశాలల్లో అదనపు తరగతి గదుల మరమ్మతులు, మరుగు దొడ్లలో మిగిలిపోయిన పనులు, తాగునీరు, విద్యుద్దీకరణ, కొత్త టాయిలెట్స్ పనులు జరుగుతున్నాయి.



2023-24 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 62716, 2024-25 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 62730 అందులో బాలురు 29360 బాలికలు 33370, 2024-25 విద్యా సంవత్సరంలో తేదీ 13-06-2024 నాటికి బడిబాట కార్యక్రమంలో 696 మంది విద్యార్థులు చేరారు. బుధవారం జరిగిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. జగిత్యాల నియోజకవర్గంలో అమ్మఆదర్శ పాఠశాలలో భాగంగా 480 పాఠశాలలు ఎంపిక చేశారు. ఈ పాఠశాలల ఎంపికలో ప్రజా ప్రతినిధులకు సరైన సమాచారం లేదని స్టేజి పైననే అసహనం వ్యక్తం చేశారు. జగిత్యాల పట్టణంలో మనబడి మన బస్తిలో భాగంగా రూ.7 కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేశారు. తేదీ 13-06-2024 వరకు 21950 మంది పిల్లలకు స్కూలు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. 85 శాతం యూనిఫాంలు ఆయా పాఠశాలలకు చేరాయి.

## ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కటుకం గణేష్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న గణేశ్

నవతెలంగాణ-కోరుట్ల

కోరుట్ల పట్టణానికి చెందిన సామాజిక వేత్త, రక్తదాన సంధానకర్త, చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కటుకం గణేష్‌కు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవార్డు, సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

## ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, జగిత్యాల మండల రజక సంఘం అధ్యక్షుడు మర్రిపెల్లి పోచాలు పక్షవాతంతో బాధపడుతూ పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారిని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరామర్శించారు. అలాగే జగిత్యాల పట్టణ 15వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కువైట్ మల్లేశం (ముద్దం రాజమల్లు) అనారోగ్యంతో జగిత్యాలలో చికిత్స పొందుతూ ఉండగా వారిని ఎమ్మెల్యే పరామర్శించారు.

## ఫిట్నెస్ లేని బస్సులు రోడ్డెక్కితే చర్యలు

• జిల్లా రవాణాశాఖాధికారి వంశిధర్
• రవాణా శాఖ అధికారుల తనిఖీలు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఫిట్నెస్ లేని స్కూల్, కాలేజీ బస్సులు రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల జిల్లా రవాణా శాఖాధికారి వంశీధర్ హెచ్చరించారు. ఫిట్నెస్ లేని ప్రయివేట్ స్కూల్, కాలేజీ బస్సులను శుక్రవారం అధికారులు తనిఖీ చేశారు. బస్సు ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అధికారులు తనిఖీ చేశారు. ఫిట్నెస్ లేని మూడు స్కూల్ బస్సులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వంశీధర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో 470 స్కూల్, కాలేజ్ బస్సులకు గాను 320 బస్సులు మాత్రమే ఫిట్నెస్ కలిగి ఉన్నాయని మిగతా150 బస్సులు ఫిట్నెస్ చేయించుకోవాలని యజమానులకు సూచించారు. ఇందులో ఏమైనా బస్సులు స్క్రాప్‌కు వెళ్లాయా ఇంకా ఎన్ని బస్సులు ఉన్నాయో సమాచారం ఇవ్వాలని యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చామని డిటిఓ తెలిపారు.

## ధరూర్‌లో అంగన్‌వాడీ బడిబాట

నవతెలంగాణ-జగిత్యాలటౌన్


పాల్గొన్న చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు

జగిత్యాలరూరల్ మండలంలోని టీఆర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బడిబాటలో భాగంగా అక్షరాభ్యాసం, పలకల వితరణ, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఏసీడీపీవో వీరలక్ష్మి మాట్లాడుతూ.. రెండేండ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించా లన్నారు. ఈ కార్యక్రమంలో కురిక్యాల కృష్ణమూర్తి 25 పలకలు వితరణ చేశారు. ఏసీడీపీవో వీరలక్ష్మి, సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ టీచర్స్ వనిత పాల్గొన్నారు. జగిత్యాల టౌన్

జగిత్యాల పట్టణంలోని ఉప్పరిపేట, చింతకుంటవాడ అంగన్‌వాడీ కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సూపర్‌వైజర్ జి. జానకి పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలో అందిస్తున్న ప్రాథమిక విద్యా విధానం, సేవలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, వైశాలి, జ్యోతి, ఇంద్రజ, కల్పన పాల్గొన్నారు.

## టీఎన్జీవో రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-జగిత్యాల


సన్మానిస్తున్న జిల్లా నాయకులు

హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవో రాష్ట్ర సంఘ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అధ్యక్షతన (33) జిల్లాల అధ్యక్ష కార్యదర్శులతో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జగిత్యాల జిల్లా తరఫున జిల్లా అధ్యక్షులు భోగ శశిధర్, జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎం హుస్సేని ఏకగ్రీవంగా కోఆప్షన్ ద్వారా ఎన్నుకున్నారు. జగిత్యాల జిల్లా ఉద్యోగుల పక్షాన జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్, జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి, ట్రెసా జిల్లా అధ్యక్షుడు యం.డి.వకీల్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం


అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు

మండలంలోని డబ్బా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ప్రతిభ మాట్లాడుతూ.. పిల్లలను అంగన్‌వాడీకి పంపించాలన్నారు. ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుందరగిరి గంగామణి, వై సంజీవరాణి, ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు మనోజ్, ప్రసాద్, అశోక్, రాజ్ కుమార్, స్వామి, లింగస్వామి, భవాని పాల్గొన్నారు.

## పదవి లేకున్నా ప్రజాసేవ కొనసాగించాలి

• ప్రజల మధ్యన ఉంటేనే నాయకులుగా గుర్తింపు
• జగిత్యాల జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత

నవతెలంగాణ-సారంగాపూర్

పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవ కొనసాగించాలని, ప్రజల మధ్య ఉంటేనే నాయకులుగా గుర్తింపు వస్తుందని జగిత్యాల జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత అన్నారు. శుక్రవారం సారంగాపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సారంగాపూర్ ఎంపీపీ కోల జమున శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పిటిసి సభ్యులు మేడిపల్లి మనోహర్‌రెడ్డితో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత సమస్యలపై అవగాహన ఉన్న ప్రజా ప్రతి నిధులు పదవిలో ఉన్నా లేకున్నా వారి సూచనలను పరిగణలోకి తీసుకొని తదనుగుణంగా అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులైనా, అధికారులైనా పక్షపాత ధోరణి అవలంబించకుండా సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశానికి కొందరు మండల స్థాయి అధికారులు రాకుండా తమ సిబ్బందిని పంపించడం పట్ల ఆమె అసహనం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్‌లో జరిగే సమావేశాలకు జిల్లా స్థాయి అధికారులు, మండల పరిషత్‌లో జరిగే సమావేశాలకు మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు హాజరు కావాలన్నారు. ఇందుకు సంబంధించి అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని, సమావేశానికి రాని అధికారులకు మెమో పంపించి తగు చర్య తీసుకోవాలని ఎంపీడీవో లచ్చులు ను ఆదేశించారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

ఈ సమావేశంలో సభ్యులు ఆయా గ్రామాల్లోని పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ,జడ్పిటిసి, ఎంపీటీసీ సభ్యులకు ఈ సమావేశం చివరి సమావేశం కావడంతో పాటు వారి పదవీకాలం ముగుస్తుండడంతో వారందరినీ శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీటీసీ సభ్యులు ఈ ఐదేళ్ల తమ పదవి కాలంలో మంచి చెడులను నెమరు వేసుకొని తమకు సహకరించిన అధికారులకు పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు. నంతరం ముఖ్య అతిథిగా హాజరైన దావ వసంతను అధికారులు,ప్రజాప్రతినిధులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు సొల్లు సురేందర్, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు జోగినపల్లి సుధాకర్ రావు, ఎంపిటిసి సభ్యులు మానాల ప్రసన్నమాల, ఏలేటి మమత, రంగ విమల, భూక్య లావణ్య, ఎంపీడీవో లచ్చులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అల్బెండజోల్ మాత్రలు పిల్లలందరికీ వేయించాలి

• జగిత్యాల జిల్లా అదన కలెక్టర్ రాంబాబు

నవతెలంగాణ-జగిత్యాల

నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పిల్లందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయించాలని జగిత్యాల అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఉన్నత అధికారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..1నుంచి 19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. దీనిపై అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. ఈనెల 20న మాత్రలు వేసుకునే విధంగా చూడాలన్నారు. ఎవరైనా తప్పిపోయిన పిల్లలను 27న నిర్వహించే' మ్యాప్- అప్' రోజున మాత్రలు వేయించాలని తెలిపారు. ఈ కార్యమంలో జడ్పీ పీఈవో యామ్ రఘువరన్, డీఆర్‌డీవో యామ్ సంపత్‌రావు, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి దేవరాజ్, జిల్లా విద్యాధికారి ప్రతినిధి ఇంటర్మీడియట్ విద్యాధికారి బి. నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

## చిన్నపాటి వర్షానికే పొంగుతున్న డ్రైనేజీ


పొంగుతున్న డ్రైనేజీ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణం లోని 20వ వార్డు మార్కండేయ నగర్‌లో చిన్నపాటి వర్షానికి డ్రైనేజీ పొంగుతోంది. రోడ్లు మొత్తం జలమయమై వరదలు పారుతూ ఒక చిన్న కాలువ లాగా ప్రవహి స్తుంది. అధికారులు కానీ, రాజకీయ నాయకులు కానీ పట్టించుకోవడం లేదు అని కాలనీ వాసులు వాపోతున్నారు.

## బాజమ్మ కుంట పరిశీలన

నవతెలంగాణ-మల్లాపూర్



మండల కేంద్రంలో ఉన్న బాజమ్మ కుంటను ఇరిగేషన్ రాకేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాజమ్మ కుంట ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోగా, ఆయా కట్టు రైతులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చిన స్పందించడం లేదని వాపోయారు. వీడిసి అధ్యక్షుడు సంఘ గంగారాజం సంబంధిత అధికారులకు సమాచారం అందించి బాజమ్మ కుంట మరమ్మతులు చేయాలని కోరారు. అనంతరం ఏ ఈ రాకేష్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులకు సమస్యను నివేదించి పరిష్కరిస్తానని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

• జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్

నవతెలంగాణ-జగిత్యాల

రక్తదానం చేసి ఎందరో ప్రాణాలు కాపాడాలని జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రపంచరక్త దాతల దినోత్సవం సందర్భంగా స్థానిక మోతేవాడ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 20 సంవత్సరాలుగా, ప్రతి సంవత్సరం జూన్ 14వ తేదీని ప్రపంచ రక్త దాతల దినోత్సవంగా నిర్వహిస్తుందన్నారు. రక్త దానంలో అపోహలను నివృత్తి చేసి, భయాలను తొలగించి రక్తదానాన్ని ప్రోత్సహించడం, నాణ్యమైన రక్త మార్పిడి సంబంధిత మెలకువలను నేర్పడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సమియుద్దీన్, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, సహాయ మలేరియా అధికారి, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

## గ్రానైట్ బండ మీద పడి వృదుడి మృతి

నవతెలంగాణ-మల్యాల

బండ మీద పడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మల్యాల మండలంలోని బల్వంతాపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన నెలబోయిన వర్షయ్య (65) నెల రోజుల క్రితం ఫిట్స్ వ్యాధి వచ్చి మతిస్థిమితం సరిగా లేక రాత్రిపూట లేచి తిరుగుతున్నారు. శుక్రవారం వేకువజామున కట్టె పట్టుకొని నిద్రలేచి బయటకు పోయాడు. ఉదయం గ్రామ శివారులోని శ్రీమారుతి రామ క్వారీలో బండపై పడి చనిపోయాడు. కొడుకు నెలబోయిన నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

మనస్తాపంతో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన సున్నం రవి (42) అదే గ్రామానికి చెందిన రెబ్బటి రాజేందర్ అనే వ్యక్తి తనకు రెండు లక్షల రూపాయలు అప్పుగా ఇవ్వకుండానే ఇచ్చినట్టు బెదిరించి కొట్టి సంతకం తీసుకున్నాడు. ఆ డబ్బులను ఇప్పుడు చెల్లించాలని బెదిరించాడు. అంతేకాకుండా కనుక జగన్, చెప్పుల శ్రీనివాస్, గంట గణేష్ మృతుడు రవి నుండి డబ్బులు అప్పుగా తీసుకొని తిరిగి చెల్లించకుండా ఇబ్బంది పెట్టారని, డబ్బులు ఇవ్వమని అడిగితే చంపుతామని బెదిరించారని సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సున్నం లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్ల ఒక కొడుకు ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని సాతారం, మొగిలిపేట గ్రామం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్ శుక్రవారం తెలిపారు. సాతారం వాగు నుండి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని సమాచారం మేరకు వెళ్లగా అక్కడ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అక్రమ ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బోధన అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మల్లాపూర్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలు బోధన అధ్యాపకలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అలీముద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీజీటీ హిందీ, పిజిటి బొటని ఎమ్మెస్సీ బిఈడి అర్హత గలవారు ఈనెల 18వ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## ఎల్‌ఓసి అందజేసిన జీవన్‌రెడ్డి


ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన అశోక్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా భాదితుడి చికిత్స కోసం రూ.2,50,000 ఎల్‌ఓసిని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అందించారు.

## అక్షరాభ్యాసం చేయించిన జీవన్ రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



జగిత్యాలరూరల్ మండలం పోరండ్ల గ్రామంలోని అంగన్వాడీ 2 కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.. వీరి వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి బోనాలలో పాల్గొన్న ఎమ్మెల్సీ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి బోనాలను పండుగ కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ధరూర్‌లో బేటి బచావో బేటి పడావో కార్యక్రమం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్ర బృందం ధరూర్‌లో మహిళా సాధికారత, భేటీ బచావో బేటి పడావో పథకంపై అవగాహన కల్పించారు. మొబైల్ సోషల్ మీడియా దుష్ప్రభావం, బాల్యవివాహాల నిషేధ చట్టం, మహిళ రక్షణ చట్టాలను వివరించారు. హెల్ప్ లైన్ నెంబర్స్ 100, 112, 181, 14567, 1098 సఖి సేవలు, అంగన్వాడీ సేవలు, చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్స్ ,సీనియర్ సిటిజన్స్ రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దేశవేణి గంగాభవాని అధ్యక్షురాలు, మహిళా సంఘం సభ్యులు,చైల్డ్ హెల్ప్ లైన్ స్టాఫ్, మహిళా సాధికారత కేంద్ర బృందం పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT METPALLY**
**S.O.P. No. 05 of 2024**

BETWEEN:
**Yadagiri Vanitha, W/o. Rama Rao, Age: 53 years, R/o H.No.4-80, Gumlapoor village of Korutla Mandal, Jagityal District.**
...Petitioner

And

**1) The Account Officer, Employee's provident Fund Organization Regional Office, Karimnagar.**
**2) To whomsoever may concern.**
...Respondents No.1 and 2

To,
**1) The Account Officer, Employee's provident Fund Organization Regional Office, Karimnagar.**
**2) To whomsoever may concern.**

The above named petitioner filed the above suit for Succession. The summons were served to respondents through the Hon'ble Court Bailiff. As per the order of the Hon'ble Court the substitute mode of service of summons as in the form of publication in Nava Telangana Daily News Paper Jagityal District Edition. The case is posted for appearance of Respondent No.2 on 25-06-2024. Therefore if you Respondent No.2 or any others is having are objection for Succession of Petitioner attend before the Hon'ble Senior Civil Judge Court at Metpally on **25-06-2024 at 10.30 a.m,** by personally or through an advocate otherwise this Hon'ble Court may decide the matter infavour of petitioner.

[By order of the Court]
**Sd/-**
**Jilla Venkateshwarlu**
**Advocate, Metpally.**
H.No. 1-10-147, Kalanagar
Metpaly Town and Mandal,
Jagityal District.
Cell:9440393567.

## సార్‌కు సలాం ..



సమస్యల సాకులు చెబుతూ నామ మాత్రంగా వృత్తి చేస్తూ సమయ పాలన గడుపుతూ నెల నెలా జీతాలు పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు కొందరిని చూస్తుంటాం. కానీ మనం వేలల్లో జీతాలు తీసుకున్నప్పుడు తమ వృత్తికి న్యాయం చేయాలనే సంకల్పంతో కొందరు ఉంటారు. అదే కోవ చెందినవారు ఈ ఫొటోలో చూస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్. అనంతపల్లి ప్రాథమిక పాఠశాలలో గత ఎనిమిది సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. ప్రతి రోజు విద్యార్థులను తన ద్విచక్ర వాహనంపై బడికి తీసుకువచ్చి మళ్లీ సాయంత్రం విద్యార్థులను ఇంటి వద్దకు చేర్చుతున్నాడు. దీంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి శ్రీనివాస్‌ను గ్రామస్తులు సలాం కొడుతూ అభినందిస్తున్నారు.

- నవతెలంగాణ, చందుర్తి

## ప్రజా ఫిర్యాదులలో జాప్యం వద్దు

### - తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ సందర్శించిన జిల్లా ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

నవతెలంగాణ - తంగళ్ళపల్లి : ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ పోలీసులకు సూచించారు. తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి, పోలీసు స్టేషన్ పరిసరాలు,రికార్డులు పరిశీలించారు.విధుల్లో భాగంగా మెయింటేన్ చేసే రిసెప్షన్, జీడీ ఎంట్రీ తదితర రికార్డులు పెండింగ్ కేసులు, ఫంక్షనల్ వర్టీకాల్స్ పనితీరు పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. 100కు కాల్ రాగానే వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలన్నారు. బ్లూకోల్ట్, పెట్రోల్ కార్ నిరంతరం 24/7 గస్తీ నిర్వహించాలన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం అందరి దగ్గర ఉండాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి ఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి

### జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ అరుణ



పాల్గొన్న అధికారులు ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ - సిరిసిల్ల : అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పిలుపునిచ్చారు. జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జడ్పీ చైర్ పర్సన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉండాలని, వారికి సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించాలని సూచించారు. అంతకుముందు ఆయా శాఖల అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఎఫ్ఓ బాలమణి, జెడ్పీ సీఈవో ఉమా రాణి, జెడ్పీ వైస్ చైర్మెన్ వేణు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ఎంపీని కలిసిన సెస్ చైర్మన్



నవతెలంగాణ - సిరిసిల్ల : దేశంలోనే విద్యుత్ సహకార సంఘాలు మూడు మాత్రమే ఉండగా వాటిలో ఒకటి తెలంగాణ రాష్ట్రంలోని సిరిసిల్లలో ఉంది దీంట్లో భాగంగా సిరిసిల్లలో ఉన్న విద్యుత్ సహకార సంఘం జిల్లా మొత్తంకు విద్యుత్ సరఫరా చేస్తుంది. దీనికి సంబంధించిన సెస్ చైర్మన్ చిక్కాల రామారావు శుక్రవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ విషయమై చిక్కాల రామారావుతో మాట్లాడగా ఈటల రాజేందర్ తనకు స్నేహితుడు బాగా అతను ఎంపీగా గెలుపొందడంతో అతన్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారన్నారు. అంతేకాకుండా విద్యుత్‌కు సంబంధించి పలు సమస్యలపై ఈటల రాజేందర్‌తో చర్చించినట్టు చిక్కాల రామారావు పేర్కొన్నారు.

## పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



నూతన అధ్యక్షుడిని ఘనంగా సన్మానిస్తున్న వస్త్ర ఉత్పత్తిదారులు

నవతెలంగాణ - సిరిసిల్ల : సిరిసిల్ల పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి భూపతి శుక్రవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా ఆడెపు భాస్కర్ ప్రధాన కార్యదర్శిగా అంకాలపు రవి, ఉపాధ్యక్షునిగా దూడం రమేష్, కోశాధికారిగా మండల బాలరాజు, సహాయ కార్యదర్శిగా బండారి అశోక్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మామిడాల భూపతి ప్రకటించారు. వారికి ఎన్నికల ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల అధికారి అందించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం పాలకవర్గంను వస్త్ర ఉత్పత్తిదారులు ఘనంగా పూలమాలలు శాలువాలతో సత్కరించారు.

## బస్ వ్యాన్ ఢీ పలువురికి గాయాలు



నవతెలంగాణ - తంగళ్ళపల్లి : ఆర్టీసీ బస్సు, డీసీఎం వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. తంగళ్ళపల్లి మండలం నేరెళ్ల గ్రామ శివారులోని మూలమలుపు వద్ద శుక్రవారం హైదరాబాదు నుండి వేములవాడకు వస్తున్న ఆర్టీసీ బస్సును సిరిసిల్ల వైపు నుండి సిద్దిపేట వైపుగా వెళుతున్న డీసీఎం వ్యాన్ ఎదురెదురుగా ఢీ ఢీకొన్నాయి. దీంతో బస్ డ్రైవర్‌తోపాటు బస్సులో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108ద్వారా గాయపడినవారిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఎస్ఐ సుధాకర్ వారిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రిలో కలిసి ప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సులో తక్కువ మంది ప్రయాణికులు ఉండటంతో ప్రమాదం తప్పింది.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతి చెందిన అజయ్ మృతదేహం

నవతెలంగాణ - రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ పంపు సమీపంలోని ముల మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరికరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిలిన వివరాల ప్రకారం కలికోట వైపు నుండి రుద్రంగి వస్తున్న ద్విచక్రవాహనాన్ని వేములవాడ వైపు నుంచి కోరుట్ల వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా బైక్ పైన ప్రయాణిస్తున్న రుద్రంగి కి చెందిన బిల్లవేని అజయ్ (19) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు బోయిని అభిలాష్‌కు తీవ్రమైన గాయాలు కాగా ఆ యువకుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సందర్శించి స్థానిక ఎస్ఐని ప్రమాదానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. తండ్రి బిల్లవేని గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతామని ఎస్ఐ సిరిసిల్ల అశోక్ తెలిపారు.

## పిడుగు పాటుకు గేదె మృత్యువాత

నవతెలంగాణ - చందుర్తి : పిడుగుపాటుకు గేదె మృత్యువాత పడిన ఘటన ఎన్గల్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామనికి చెందిన పకిడే రాజయ్య తన వ్యవసాయ క్షేత్రం వద్ద బర్రెను మేతకు కట్టి వేయగా పిడుగు పాటుకు మృత్యువాత పడింది. రైతుకు రూ.80వేల వరకు నష్టం వాటిల్లింది. నష్ట పోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# ఒకే ఒక్కడు..!

- సిబ్బంది లేరు- పనిచేసేది ఎవరు..?
- అర్బన్, రూరల్ మరో మూడు మండలాలకు అదనపు బాధ్యతలు..
- వేధిస్తున్న సిబ్బంది కొరత, ఆరు గురు సిబ్బందికి ఒకే ఒక్కడు..



మండల విద్యాధికారి కార్యాలయంలో ఒకే ఒక్కడు..







మండల విద్యాధికారి గదికి తాళం, కార్యాలయంలో అదనపు గదులకు తాళాలు

నవతెలంగాణ - వేములవాడ :

మండల విద్యాధికారి కార్యాలయంలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నది. సిబ్బంది లేక పనిచేసేది ఎవరో తెలియడంలేదు. ఈ నెల 12తో విద్యా సంవత్సరం మొదలై నాలుగు రోజులవుతోంది. నేటి వరకు వేములవాడ మండల విద్యాధికారి ఎవరు? అనేది పట్టణ ప్రజలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియని పరిస్థితి. డీఈవో రమేష్ కుమార్‌ను సంప్రదించగా వేములవాడ ఎంఈఓ బన్నాజీ అని తెలిపారు. పాఠశాలలు మొదలై నాలుగు రోజులు గడుస్తున్నా విద్యాధికారి కార్యాలయం గది తెరుచుకోలేదు. వేములవాడ అర్బన్, రూరల్ మండల విద్యాధికారి కార్యాలయం ఇద్దరు కోఆర్డినేటర్లు(విద్యాధికారి సహాయకులు) ఇద్దరు కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇద్దరు అటెండర్లు విధులు నిర్వహించాల్సింది ఉండగా సిబ్బంది కొరతతో, అర్బన్, రూరల్ కలిపి ఒకే ఒక్కడు డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒక్కడే విధులు నిర్వర్తిస్తున్నాడు. అర్బన్, రూరల్ ఎంఈఓ కార్యాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని విద్యార్థి సంఘాల నాయకులు పట్టణ ప్రజలు కోరుతున్నారు. గతంలో వేములవాడ అర్బన్, రూరల్, ముస్తాబాద్, ఇల్లంతకుంట, గంభీరావుపేట్ మండలాల విద్యాధికారిగా పని చేసిన బన్నాజీ ఈ మధ్యన జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇల్లంతకుంటలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు సస్పెన్షన్‌కు గురయ్యారు. బన్నాజీ సస్పెన్షన్‌తో సిరిసిల్ల ఎంఈఓ దూస రఘుపతికి వేములవాడ అర్బన్, రూరల్‌తోపాటు ముస్తాబాద్, ఇల్లంతకుంట, గంభీరావుపేట్ ఎంఈఓగా అదనపు బాధ్యతలు కేటాయిస్తూ డీఈవో నియమించారు. కానీ రఘుపతి బాధ్యతలు చేపట్టకపోవడంతో, తిరిగి ఈనెల 7న వేములవాడ జడ్పీహెచ్ఎస్ బాలికల ప్రధానోపాధ్యాయుడిగా వరంగల్ స్కూల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ ఆయనకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. బన్నాజీకి ఎంఈఓగా బాధ్యతలు ఇచ్చినట్లు డీఈవో చెప్పుతున్నారు.. కానీ ఎంఈఓ మాత్రం కార్యాలయానికి రావడం లేదు. ఆయన గది తెరుచుకోవడం లేదు. ఎంఈఓను కలవాలంటే వేములవాడ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలకు వెళ్లి కలవాల్సిందే. కార్యాలయంలో ఉండాల్సిన అధికారి కార్యాలయానికి రావడం లేదని విద్యార్థి సంఘాలు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## హత్య కేసులో జనశక్తి కేంద్ర కమిటీ నేతకు విముక్తి

- ఆయనతో పాటు మరో ఆరుగురికి ఊరట
- 11ఏండ్లు విచారణ సాగిన కేసు కొట్టివేత
- ఇదే కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న విశ్వనాథ్
- జనశక్తి నేత రాజన్న ఆసుపత్రిలో.. ఒకరు మృతి

నవతెలంగాణ - సిరిసిల్ల :

రాష్ట్రంలో 11ఏండ్ల కింద సంచలనం రేపిన సుద్దాల ప్రభాకర్‌రావు హత్య కేసును శుక్రవారం న్యాయస్థానం కొట్టి వేసినట్లు తెలిసింది. ఈ కేసులో 11ఏండ్ల నుంచి న్యాయస్థానానికి విచారణకు వస్తున్న జనశక్తి కేంద్ర కమిటీ నేత వేములవాడకు చెందిన కూర రాజన్న రాష్ట్ర కమిటీ కార్యదర్శి జగిత్యాల జిల్లా వెలగటూరు మండలం కుమ్మరిపల్లికి చెందిన విశ్వనాథ్ అలియాస్ సురేష్ జగిత్యాలకు చెందిన చెట్టి రాజేశ్వర్ సుద్దాలకు చెందిన కాశవేణి మొండయ్య, తిప్పాపూర్‌కు చెందిన మానుక కుంటయ్య మల్కాపేటకు చెందిన ఎక్కల్‌దేవి మల్లేశం ధర్మారంకు చెందిన గున్నాల లక్ష్మణ్‌లకు విముక్తి లభించినట్లు తెలిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సుద్దాలకు చెందిన మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రావు 13 ఫిబ్రవరి 2013న వేములవాడ నుంచి సుద్దాలకు సాయంత్రం సమయంలో కారులో తన కోడలుతో కలిసి వెళుతుండగా సుద్దాల- మారుపాక మధ్యన గల వంతెన వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ప్రభాకర్ రావు నడిపిస్తున్న కారుకు అడ్డుగా వెళ్లి కారు ఆపి కారులో ఉన్న ప్రభాకర్ రావుపై తుపాకీతో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మాజీ సర్పంచ్ ప్రభాకర్ రావును ఆస్పత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. భూ వివాదంతోనే హత్య చేశారని కేసు నమోదు.. సుద్దాల మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రావును భూ వివాదం విషయంలో కొంతమంది అతనిపై కాల్పులు జరిపి హత్య చేశారని అప్పటి వేములవాడ సీఐ జితేందర్ రెడ్డి కేసు నమోదు చేశారు. ఈ కేసులో జనశక్తి కేంద్ర కమిటీ నేత కూర రాజన్న రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్, చిట్టి రాజేశ్వర్, కాశవేణి మొండయ్య, మానుకా కుంటయ్య, ఎక్కల దేవి, మల్లేశం, గున్నాల లక్ష్మణ్ నిందితులని వారిపై సీఐ కేసు నమోదు చేశారు. సుమారు 11 సంవత్సరాల ఆరు మాసాలపాటు ఈ ఘటనపై న్యాయస్థానంలో విచారణ సాగింది. సుద్దాలకు చెందిన కాంతయ్య అలియాస్ అశోక్ ఎన్కౌంటర్‌లో మృతి చెందాడు. ఆయన భార్యకు అప్పటి జనశక్తి నేత మంగన్న ఆధ్వర్యంలో సుద్దాలలోని ఏనుగు వేణుగోపాలరావుకు చెందిన ఐదు ఎకరాల భూమిని ఇప్పించినట్లు సమాచారం. ఆ భూమిని పట్టా చేయకపోగా 5లక్షలకు ఎకరం చొప్పున అమ్మి వేయడంతో దానికి ప్రతీకారంగా జనశక్తి నక్సలైట్లు ప్రభాకర్‌రావుపై కాల్పులు జరిపి చంపినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు న్యాయస్థానంలో విచారణ జరుగుతుండగా మూడేళ్ల క్రితం హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కాశవేణి మొండయ్య కరోనాతో మృతి చెందాడు. ఇదే కేసులో బెయిల్ రాక రెండేళ్లుగా విశ్వనాథ్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ కేసులో ఏడుగురు ఆరోపణలు ఎదుర్కొంటుండగా వారిలో మొండయ్య మృతి చెందగా కూర రాజన్న అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మిగతా ఐదుగురు శుక్రవారం న్యాయస్థానంకు వచ్చారు. పోలీసులు 36 మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టి వేసినట్లు తెలిసింది.

## యారన్ సబ్సిడీ తగ్గించి కార్మికుల పొట్ట కొట్టొద్దు

- పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్
- సమస్యలు పరిష్కరించాలని నేతన్నలతో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : పవర్లూమ్ కార్మికులకు సంబంధించిన యారన్ సబ్సిడీని తగ్గించి కార్మికుల పొట్ట పొట్టొద్దని పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్మికులకు రావాల్సిన 10శాతం యారన్ సబ్సిడీ గతంలో మాదిరిగానే విడుదల చేయాలని, వస్త్ర పరిశ్రమ సంక్షోభం నివారణకు చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందే కార్మికులకు సబ్సిడీ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించి, రూ.18కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. కానీ సబ్సిడీని కార్మికులకు అందించడంలో జౌళిశాఖ కమిషనర్ నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు గతంలో మాదిరిగా సబ్సిడీ ఇవ్వకుండా, 50పైసల నుంచి రూ.1 వరకు మీటర్‌కు తగ్గించి ఇస్తున్నారన్నారు. దీనివల్ల కార్మికుల కష్టార్జితం కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ తీసుకుంటున్న నిర్ణయాలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయే పరిస్థితి నెలకొందన్నారు. పాలకులు సైతం కార్మికుల సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బతుకమ్మ చీరలు ఆర్డర్లు లేక బకాయిలు విడుదల చేయక నేతన్నలు సాంచాలు అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు నక్క దేవదాస్, గుండు రమేష్, సిరిమల సత్యం, అన్నాలదాస్ గణేష్, సబ్బని చంద్రకాంత్, కంది మల్లేశం, బెజిగం సురేష్, ముశం శంకర్ సందుపట్ల పోచ మల్లు, చంద్రయ్య పాల్గొన్నారు

## ప్రాణదాత గిరిధర్‌రెడ్డికి అరుదైన అవార్డు

- 48సార్లు బ్లడ్ డోనేట్ చేసిన గిరిధర్‌రెడ్డి
- ఉగాది సందర్భంగా మహా నంది అవార్డు అందుకున్న గిరిధర్‌రెడ్డి
- మంత్రి పొన్నం చేతుల మీదుగా బ్లడ్ డోనేట్ అవార్డు
- హైయెస్ట్ బ్లడ్ డోనర్ మోటవేటర్‌గా జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్



మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వంగ గిరిధర్‌రెడ్డి



మహానంది అవార్డు అందుకుంటున్న గిరిధర్‌రెడ్డి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట :

అన్ని దానాల్లో రక్తదానం గొప్పదని భావించి, ఎవ్వరికైన రక్తం అవసరం ఉందని తెలియగానే దానం చేయడమే కాకుండా ఇప్పటివరకు 48సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా తన మానవత్వాన్ని చాటుకున్నారు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వంగ గిరిధర్‌రెడ్డి. వరల్డ్ బ్లడ్ డోనర్ డే సందర్భంగా శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి సంస్థ హైదరాబాద్‌లో అరుదైన అవార్డు ప్రదానం చేయగా మంత్రి పొన్నం ప్రభాకర్, వైద్య ఆరోగ్య ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిస్టియనా, రెడ్ క్రాస్ సొసైటి చైర్మన్ అజయ్ మిశ్రా, నారయణకేడ్ ఎంపి సురేష్, మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారయణ, రెడ్ క్రాస్ సొసైటి సభ్యులు శ్రీనివాస్, వేణు, ఏఎఎస్ అధికారి బుర్ర వెంకటేశం చేతుల మీదుగా అరుదైన అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నవతెలంగాణతో గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ రక్త దానం చేయడంలో ఎంతో సంతోషం ఉందని, ఒక ప్రాణాన్ని కాపాడినవాడిని అవుతున్నానని అదే స్ఫూర్తితో 48సార్లు రక్తం దానం చేశానన్నారు. తాను రక్తదానం చేయడమే కాకుండా యువకులకు రక్త దానం చేయాలని అవగాహన కల్పిస్తున్నానని గిరిధర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వంగ మణెమ్మ-రామేశ్వర్‌రెడ్డిలకు 1976 మే 1న గిరిధర్‌రెడ్డి జన్మించారు. ఎల్లారెడ్డిపేటలోనే పదవ తరగతి వరకు చదివి ఇంటర్మీడియట్, డిగ్రీ సిరిసిల్లలో పూర్తి చేశారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎ పొలిటికల్ సైన్స్ చేశారు. ఈ క్రమంలో కాలేజీ సమయంలో ప్రమాదంలో ఉన్న ఓ వ్యక్తికి రక్తదానం చేశారు. అప్పుడు ఓ ప్రాణాన్ని నిలబెట్టాటనే సంతృప్తి గిరిధర్‌రెడ్డికి మరింత స్ఫూర్తినిచ్చింది. ఎవరైనా ఆపదలో ఉన్నారని తెలిస్తే స్వచ్ఛందంగానే ముందుకొచ్చి రక్త దానం చేస్తూ వచ్చారు. ఇలా ఇప్పటివరకు 48సార్లు రక్త దానం చేసి ఎందరో ప్రాణాలను కాపాడేందుకు కారణమయ్యారు. మరోవైపు కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా ఉంటూనే ప్రజాసేవలో భాగంగా రక్తదానం వంటి కార్యక్రమాలను చేపట్టారు.2005లో సహాయ స్వచ్ఛంద్ధ సంస్థను నెలకొల్పి కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ముద్రించి రక్తదానం చేయండి - ప్రాణదాతలు కండి అంటూ ప్రచారం ముమ్మరం చేశారు. ఇలా యువకుల్లో రక్తదానం అవశ్యకతపై అవగాహన కల్పించారు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌కు 31 మార్లు రక్త దానం చేయగా సినీ హీరోలతోపాటు ప్రజాప్రతినిధుల మన్ననలను పొందారు. 2007లో స్టాలీన్ సినిమా విడుదల సందర్భంగా ప్రత్యేకంగా పవన్‌కళ్యాణ్ స్వయంగా గిరిధర్‌ను పిలిపించుకుని మెమెంటోను అందించారు. 2008లో హిరో వెంకటేష్ చేతుల మీదుగా, శంకర్‌దాదా జిందాబాద్ సినిమా విడుదల ఉత్సవాల్లో అవార్డును అందుకున్నారు. 2010అక్టోబర్‌లో మళ్లీ పవన్ కళ్యాణ్ చేతులమీదుగా మరో అవార్డును సొంతం చేసుకున్నారు. 2014లో సినీ నిర్మాత అల్లు అర్జున్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. 2023లో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గరిత్ విన్‌ఓవెల్, సినీ హిరో చిరంజీవి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. 2024లో తొలి వెలుగు ద్వారా ఉగాది సందర్భంగా హైదరాబాద్‌లో మహానంది అవార్డు, హైకోర్టు చీఫ్ జెస్టిస్ చంద్ర హసన్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ప్రజాసేవలో భాగస్వామిగా నిలుస్తున్న గిరిధర్‌రెడ్డి చిరంజీవి తనయుడు రామ్‌చరణ్‌తేజ్ నుంచి కూడా అభినందనలు అందుకున్నారు. చిన్నపట్టి నుండే ఆదర్శ యువకునిగా ఉంటూ చాలమందికి స్ఫూర్తిగా నిలుస్తూ రక్తదానం అవశ్యకతపై యువకుల్లో చైతన్యం పెంచుతున్నారు. 48సార్లు రక్తదానం చేసిన గిరిధర్‌రెడ్డిని ప్రజాప్రతినిధులు, మిత్రులు అభినందించారు.

## ప్రజలను రక్తదానం వైపు చైతన్య పరచటమే లక్ష్యం

### ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొడిశెల రాజశేఖర్



ర్యాలీలు ప్రారంభిస్తున్న యువ ఫౌండేషన్ నిర్వాహకులు

నవతెలంగాణ - వేములవాడ : ప్రపంచ రక్త దాతల దినోత్సవం జూన్-14 సందర్భంగా వేములవాడ పట్టణం లో అవగాహన ర్యాలీ.. ప్రజలను రక్త దానం వైపు చైతన్య పరచటమే మా లక్ష్యం యువ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కానిస్టేబుల్ గొడిశెల రాజశేఖర్ గౌడ్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని మొదటి బైపాస్ రోడ్డు లో యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్త దాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం కు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ రమణా రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కానిస్టేబుల్ రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ రక్త దానానికి దాతలు ఉత్సహంగా నిర్భయంగా ఎలాంటి అపోహలు లేకుండా స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్నింగ్ క్రికెట్ క్లబ్ సభ్యులు, యువ ఫౌండేషన్ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## కరాటేతో మనోధైర్యం : ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్



విద్యార్థులను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ ఆది

నవతెలంగాణ - వేములవాడ రూరల్ : కరాటే నేర్చుకోవడం వలన శరీర అవయవాలు గట్టిపడడమే కాకుండా మనోధైర్యం కలిగి ఉంటారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు ప్రతిభా కనబరిచిన మెడల్స్ సాధించిన విద్యార్థులతోపాటు అలాగే సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొంది కరాటేలో చక్కటి విన్యాసాలు ప్రదర్శించి వివిధ స్థాయి బెల్టులు సాధించిన 40మంది విద్యార్థులను శుక్రవారం ఎమ్మెల్యే గెస్ట్‌హౌస్‌లో ఆది శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే ప్రతి విద్యార్థి ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం ఏకాగ్రతతో సాధన చేయాలని ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్ అబ్దుల్ మన్నాన్, కరాటే కోచ్ కనికరపు రాజశేఖర్, తల్లిదండ్రులు ఉన్నారు.

## విత్తన శుద్ధి చేసుకోవాలి

### మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ



దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారిణి

నవతెలంగాణ - కొనరావుపేట : రైతులు విత్తనాలు నారుపోసే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని వెంకట్రామమ్మ సూచించారు. కొనరావుపేట మండలం పలు గ్రామాలలో శుక్రవారం ఫర్టిలైజర్ మందుల దుకాణాలను క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. దుకాణాలకు సంబంధించిన లైసెన్స్ పత్రాలను పరిశీలించారు. తనిఖీలో భాగంగా నిర్వహకులు నమోదు చేస్తున్న రికార్డులను, రోజువారీగా ఎరువుల ధరల పట్టికలను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని విత్తన, ఫర్టిలైజర్ దుకాణాదారులకు సూచించారు. నకిలీ విత్తనాలు, అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే వారి డీలర్ షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి షాపులో విత్తనాల ధరలు, స్టాక్‌కు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలని, రైతులకు అందించే రసాయనిక ఎరువుల రికార్డులను తప్పకుండా నమోదు చేయాలని, అలాగే లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలుచేసే సమయంలో తప్పకుండా రసీదు తీసుకోవాలని కోరారు. రైతులు లైసెన్స్ పొందిన దుకాణాల నుండే విత్తనాలను కొనుగోలు చేయాలని విత్తన రకం, సంబంధిత బిల్లును తీసుకొని బిల్లులను పంటకాలం పూర్తి అయ్యేవరకు జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. ఎరువుల వివరాలను ఈపాస్ మిషన్‌లో తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. లేదంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలి



అక్షరాలు పెట్టిస్తున్న ఎంపీటీసీ

నవతెలంగాణ - వీర్నపల్లి : పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు అరుణ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలం అంబేడ్కర్ నగర్, గ్రామాలలోని పలు అంగన్‌వాడీ, ప్రైమరీ పాఠశాలల్లో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా నూతనంగా బడిలో చేరిన చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ పిల్లలకు ఆటాపాటలతో అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రేణుక, ప్రధానోపాధ్యాయులు వకుళ, అంగన్‌వాడీ టీచర్ వినయ, జ్యోతి, నాగరాణి, కుమారి, ఉపాధ్యాయులు రఘుపతి పాల్గొన్నారు.

## వన్‌పల్లి రూట్‌లో బస్సులు నడిపించాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ - వీర్నపల్లి : విద్యార్థులు, ప్రయాణికుల ఇబ్బందుల దృష్టిలో పెట్టుకొని బస్సులు నడిపించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య తెలిపారు. వీర్నపల్లి మండల కేంద్రంలో శుక్రవారం సీపీఐ నాయకులు విలేకరుల సమావేశంలో ప్రభుత్వం మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఫ్రీ బస్సు పెట్టారు. సంతోషం కాని వన్‌పల్లిరూట్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సు నాలుగు ట్రిప్‌లు మాత్రమే చేస్తుంది. బడి పిల్లలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని అదనంగా బస్సులు నడిపించి ప్రయాణికుల ఇబ్బందుల తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పర్శయ్య, ప్రభాకర్, అశోక్ ఉన్నారు.

## అంగన్‌వాడీ బడిబాట



నవతెలంగాణ - కొనరావుపేట : కొనరావుపేట మండలం మరిమడ్ల అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమంలో భాగంగా బడిబాట కార్యక్రమం నిర్వహించినట్లు సూపర్వైజర్ గంగ లక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేయడం ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలు అంగన్‌వాడీ కేంద్రం నుండి ప్రైమర్ స్కూల్‌కు చేర్పిస్తామని పిల్లలను మూడు సంవత్సరాల నుండి అంగన్వాడీ కేంద్రంలో ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను అందించడం జరుగుతుంది. పిల్లలు రెండున్నర సంవత్సరాలు నిండగానే అంగన్‌వాడీ లోజాయిన్ చేయడం వల్ల పిల్లల యొక్క మేధావి అభివృద్ధి చిన్న కండరాల అభివృద్ధి శారీరక అభివృద్ధి జరుగుతుంది. పిల్లల ఆటపాట కథ సృజనాత్మకత ద్వారా విద్యను అందిస్తామని రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తాం. అనంతరం అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రేణుక, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం, టీచర్స్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో పుస్తకాలు, విద్యా సామాగ్రి పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపిటిసి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం ఎంపీటీసీ పందిర్ల నాగరాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందించి, అక్షర అభ్యాసం చేయించారు. ఎన్ఆర్ఐ రాధారావు సత్యం ఆర్థిక సహాయం చేయగా ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిలు, బలుపాలు, పలుకలు, అదేవిధంగా ప్రభుత్వం పంపిణీ చేసిన స్కూల్ డ్రెస్సులను అందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు నిరుపేదలు ఉంటారని అలాంటి వారికి విద్యా సామాగ్రి కోసం ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమని ఎంపీటీసీ నాగరాణి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సత్తయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత, ఉపాధ్యాయులు మంజుల, అంజలి, శ్రీనివాస్, విద్యాకమిటి చైర్మన్ ఎస్ మానస, సల్మాన్‌లు పాల్గొన్నారు.

## 15 రోజుల్లో టాస్క్ భవనం ఆధునీకరణ పనులు పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**నవతెలంగాణ-పెద్దపల్లి**

టాస్క్ భవనం ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలని,15 రోజుల్లో ప్రతిపాదించిన పనులు పూర్తిచేసి ప్రారంభానికి సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని టాస్క్ భవనాన్ని ఆకస్మీకంగా సందర్శించి టాస్క్ భవనం ఆధునీకరణ పనులను తనిఖీ చేశారు. పెద్దపల్లి టాస్క్ భవన ఆధునీకరణ పనులను ఆసాంతం పరిశీలించిన కలెక్టర్, పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతూ,జూలై 15 నుంచి టాస్క్ భవనంలో మొదటి బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యేలా జూన్ 30 లోగా పనులు పూర్తి చేయాలని తెలిపారు.

## ఉషు పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

**నవతెలంగాణ-గోదావరిఖని:**



ఖేలో ఇండియా సౌత్ జోన్ మహిళా విభాగం ఉషు పోటీ ల్లో గోదావరిఖనికి చెందిన ఇద్దరు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు పెద్దపల్లి జిల్లా ఉషు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.కుమార్ తెలిపారు. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని బాగల్ కోర్ట్ ఆవరణలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో గోదావరిఖనికి చెందిన నిగిరి శ్రావ్యాంజలి, ఒడ్డేపల్లి నవీనలు తైజీజీయన్ తౌలు (కర్ర,కత్తివి న్యాసం)విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. వీరికి ఖేలో ఇండియా సౌత్ జోన్ నిర్వాహకులు సతీష్ ఆధ్వర్యంలో బంగారు పథకాలు అందజేశారని చెప్పారు. క్రీడాకారులను ఈ సందర్భంగా శిక్షకులు సురేష్ అభినందించారు.

## 11వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మద్దెల రాజేష్



**నవతెలంగాణ-గోదావరిఖని:**

కాంగ్రెస్ పార్టీ రామగుండం కార్పొరేషన్ 11 డివిజన్ అధ్యక్షునిగా మద్దెల రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్ శుక్రవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. తన నియామకానికి సహకరించిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌కి, కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్‌కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులందరికీ రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## పోస్టర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ-గోదావరిఖని:**



ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో న్యాయవాదులకు రెండు రోజుల రాష్ట్రస్థాయి వృత్తి శిక్షణ తరగతులను ఈ నెల 15,16 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కేంద్ర కమిటీ సభ్యురాలు చందాల శైలజ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద శిక్షణ తరగతులకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గోషిక ప్రకాష్, ఎరుకల ప్రదీప్ కుమార్, సానం మురళీ, భాను కృష్ణ, దాదా సలాం, రేష్మ, సుజాత, సభా తబస్సుం, షానవాజ్, ప్రవళిక, మార్కపురం తిలక్, సీనియర్, జూనియర్ న్యాయవాదులున్నారు.

## మిషన్ భగీరథ నల్లాలను పరిశీలించిన ఎంపీడీవో



**నవతెలంగాణ-ముత్తారం:**

ముత్తారం మండలంలోని ఇప్పలపల్లి, సీతంపేట, ఖమ్మంపల్లి తదితర గ్రామాల్లో ఎంపీడీవో లలిత శుక్రవారం మిషన్ భగీరథ నల్లాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఏఏ ఇంటింటికి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నాయి. మిషన్ భగీరథ ద్వారా వస్తున్న మంచినీరు ఆ కుటుంబానికి సరిపోతుందా అనే వివరాలను సేకరించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో వేణుమాధవ్‌తోపాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులున్నారు.

## క్రాంతికుమార్‌కు బ్లడ్‌డోనర్ అవార్డు

**నవతెలంగాణ-మంథని**



ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా జూన్ 14న హైదరాబాద్‌లోని రాజ్ భవన్ లో గవర్నర్ ద్వారా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా జరిగే అవార్డుల ప్రధానోత్సవం లో భాగంగా పెద్దపల్లి జిల్లా మంథని బోయిన్ పేట్‌కు చెందిన పోతరవేని క్రాంతి కుమార్ 48సార్లు రక్తదానం, 6సార్లు ప్లేట్ లెట్స్ దానం చేసినందుకు గవర్నర్ ద్వారా హయ్యెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ తనకు అవార్డు పొందడానికి ప్రోత్సహించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్,వైస్ చైర్మన్ తూమ్ రవీందర్, ఎంసీ మెంబర్ మేడగొని వెంకటేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నేపథ్యంలో 49వ సారి రాజ్‌భవన్‌లో రక్తదానం చేసిన క్రాంతి కుమార్‌ను రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కావేటి రాజగోపాల్, వైస్ చైర్మన్ తూమ్ రవీందర్, మేడ గోని వెంకటేష్ పలువురు అభినందించారు.

## క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

**జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి అక్కపాక సురేష్**

**నవతెలంగాణ-పెద్దపల్లి**

తెలంగాణలో ఉన్న హకీంపేట,కరీంనగర్, ఆదిలాబాద్ మూడు క్రీడాపాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అక్కపాక సురేష్ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. 4వ తరగతి చదివే బాల, బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని, పాఠ్లోనే విద్యార్థులు సెప్టెంబర్ 1-2015నుంచి ఆగస్టు 31-2016 మధ్య జన్మించి ఉండాలని, మండల స్థాయి క్రీడా పోటీలు జూన్21నుంచి 25 తేదీల మధ్య, జిల్లాస్థాయి క్రీడాపోటీలుజూన్ 30లోపు నిర్వహిస్తామని తెలిపారు.

## జీరో విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

**పెద్దపల్లి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.సుదర్శన్**

**నవతెలంగాణ-పెద్దపల్లి :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పెద్దపల్లి సర్కిల్ పరిధిలో జీరో విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టామని పెద్దపల్లి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బొంకూరి సుదర్శన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రధానంగా భద్రత పట్ల నిర్లక్ష్యం, అవగాహనలోపం వలన,విద్యుత్ వినియోగ దారుల గృహాలలో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం వల్ల, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడటం వలన, రైతులు స్విచ్ బోర్డు/మోటార్ స్టార్టర్‌ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించక పోవడం వలన విద్యుత్ ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని అన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి, క్షేత్ర స్థాయిలో పనిచేసే ఉద్యోగులందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని, సెక్షన్ ఇంఛార్జి ప్రతిరోజూ 15 నిమిషాలు పనికి ముందు భద్రతా చర్యల గురించి సిబ్బందితో చర్చించాలని అన్నారు. విద్యుత్ ప్రమాదాలు తగ్గించడానికి క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరు విధిగా భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని, జీరో విద్యుత్ ప్రమాదాల నివారణ లక్ష్యంగా పనిచేయాలని బొంకూరి సుదర్శన్ ప్రకటనలో పేర్కొన్నారు.

# పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

● సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

**నవతెలంగాణ-పెద్దపల్లి**

పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, మెదక్, సిద్దిపేట జిల్లా కలెక్టర్లతో పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీల తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించామని అన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖా స్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవం తంగా పరిష్కరించేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేయా లని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయిం చాలని ఆయన సూచించారు. ధరణి వెబ్ సైట్ సంబం ధించి జీఎల్ఎం, టీఎం 33 దరఖా స్తులలో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పులు చేస్తున్నామని, కొన్ని సమస్యలు తహసీల్దార్ స్థాయిలో, మరికొన్ని సమస్యలు రెవెన్యూ డివిజన్ అధికారి, మరికొన్ని సమస్యలు కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటు న్నామని అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూ సంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని సీసీఎల్ఏ కమిషనర్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందని, దీని కోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలని, మార్కెట్ విలువ నమోదులో ఎక్కడా స్థానికంగా ఎటువంటి వివాదాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారుల,తహసీల్దార్ల స్థాయిలలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి వచ్చే గురువారం నాటికి పరిష్కరిస్తామని అన్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, ధర్మారం మండలాలలో అధికంగా ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నందున ఆ మండలాలకు అవసరమైన అదనపు బృందాలను కేటాయించి దరఖాస్తులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా చూస్తామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ డివిజన్ అధికారులు హనుమనాయక్, తహసీల్దార్‌లు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి

● పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

**నవతెలంగాణ-పెద్దపల్లి**

ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, ప్రజలంతా తమ పిల్లలను నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమ ణారావు కోరారు. శుక్రవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పెద్దపల్లిలోని అమర్‌నగర్ మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. పాఠశాలను ఆసాంతం పరిశీలించిన ఎమ్మెల్యే అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపట్టిన పనుల వివరాలు అడిగి



తెలుసుకున్నారు. పాఠశాలలో నిర్మించిన రీడింగ్ కార్నర్ రూమ్ ను, తరగతి గదులలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమ ణారావు మాట్లాడుతూ, జూన్ 6 నుంచి జూన్ 19 వరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమాన్ని మన పెద్దపల్లి జిల్లాలో విజయ వంతం చేసేందుకు ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అన్నారు. పాఠశాలలో వచ్చే చిన్న, చిన్న సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆ సమస్యల సత్వర పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. పాఠశాలలో ఉన్న గ్రంథాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గ్రంథాలయంలో మంచి పుస్తకాలు కొనుగోలు చేసి విద్యార్థుల కోసం అందించేందుకు పదివేల రూపాయలను సొంత నిధుల నుంచి విరాళం ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రెడ్డి డి.మాధవి, మండల విద్యాశాఖ అధికారి సురేందర్, ప్రధానోపాధ్యాయులు మంజులత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ పాల్గొన్నారు.

# రక్తదానం చేసిన 32 మంది రక్తదాతలు

**జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్**



**నవతెలంగాణ-పెద్దపల్లి**

ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో మూడు చోట్ల ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాల్లో 32 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. ప్రమోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ ప్రపంచ రక్తదాతల దినోత్సవంను పురస్కరించుకొని ఆరోగ్య శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా పెద్దపెల్లి వారి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రామగుండం సింగరేణి ఆసుపత్రి నందు మూడు చోట్ల రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పెద్దపల్లి నందు 15 మంది, రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు 12 మంది, సింగరేణి ఆసుపత్రి యందు 5 మంది రక్తదానం చేశారని డీఎంహెచ్‌వో తెలిపారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నందు నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ మాట్లాడు తూ,ఒకరు రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడవచ్చుని, ఇది ప్రాణ దానంతో సమానమని, అందుకే యువకులు, విద్యా ర్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి (ఎన్.టి.ఇ.పి.), డాక్టర్ కె.వి. సుధాకర్ రెడ్డి,రెడ్ క్రాస్ సొసైటి తరుపున వీరగోని శ్రీనివాస్, డి.వి.వి. ఎస్.మూర్తి, జనరల్ ఆసుపత్రి- రామగుండం నందు ఐ.ఆర్.ఎస్. ప్రతినిధి వల్లు అంజన్‌కుమార్, బ్లడ్ బ్యాంక్ ఇంచార్జి సంపత్, ఇతర అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన రామగుండం ఎమ్మెల్యే

**నవతెలంగాణ-గోదావరిఖని:**

గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రు స్టేడియంలో ఎమ్మెల్యే నిధులు (సీడీఎఫ్) నుంచి 15లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠా కూర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల వేళ స్టేడియంలో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఇక్కడి వాకర్స్, సీనియర్ సిటిజన్, యువ క్రీడాకారులు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని చేసిన విజ్ఞప్తి మేరకు, వారికిచ్చిన హామీతో 15 లక్షల రూపాయల నిధులతో ఈ ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇచ్చిన



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

మాటకు కట్టుబడి పనిచేయ డం తన నైజమని, ప్రజలం దరి మద్దతుతో రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా పయనింపజేసేందుకు తన సాయయశక్తుల కృషి చేస్తున్నానని అన్నారు. ఈ ఓపెన్ జిమ్‌ను ప్రజలందరూ సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. అనంతరం స్టేడియం వాకర్స్ టీం సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ని శాలువాతో సత్కరించారు. అనంతరం స్టేడియం లోని వాకర్స్, సీనియర్ సిటిజన్, యువ క్రీడాకారులకు ఎమ్మెల్యే ఉడకబెట్టిన గుడ్లు, అరటిపండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామగుండం మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, సీనియర్ నాయకులు పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు ఎండి. ముస్తాఫా, పెద్దెల్లి తేజశ్వి ప్రకాష్, బాలరాజ్ కుమార్, నాయకులు కోట రవి తదితరులు న్నారు.

# యువత క్రీడారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉంది

**రాష్ట్ర నాయకులు శ్రీనుబాబు**

**నవతెలంగాణ-మంథని**

యువకులు క్రీడారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉందని శ్రీపాద ట్రస్టు చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దుద్దిళ్ల శీనుబాబు అన్నారు. శుక్రవారం మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంథని ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను దుద్దిళ్ల శ్రీనుబాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీనుబాబు మాట్లాడుతూ క్రీడల వలన మానసిక ఒత్తిడిని తగ్గుతుందన్నారు. యువతి,యువకులు



క్రీడా కారులకు టీషర్ట్స్ పంపిణీ చేస్తున్న శ్రీనుబాబు

చెడు అలవాట్లకు దూరంగా ఉండి, క్రీడా రంగంలో ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. అనంతరం క్రీడాకారులకు టీషర్ట్లలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమా- సురేష్ రెడ్డి, మంథని సీఐ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు ఐలి ప్రసాద్, పెద్దపల్లి జిల్లాకిసాన్ సెల్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అజీమ్‌ఖాన్, ఓడ్నాల శ్రీనివాస్, గోటికారి కిషన్ జి,నూకల బానయ్య, పోలుశివలు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించేలా ఏజెన్సీలకు

## ఉత్తర్వులు జారీ చేయాలని వినతి

**నవతెలంగాణ-గోదావరిఖని:**

ఎన్టీపీసీ రామగుండం సంస్థలోని సివిల్ డిపార్ట్‌మెంట్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పెయింటింగ్, మేషన్, కార్పెంటర్ తదితర పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్టప్రకారం రావలసిన కనీస వేతనం, అలవెన్స్, బోనస్, సెలవు దినాల వేతనం చెల్లించే విధంగా హెచ్‌ఆర్ యజమాన్యం సంబంధిత ఏజెన్సీలకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాంసాని శంకర్ శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు.గత కొన్ని సంవత్స రాలుగా సివిల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు, వారికి కాంట్రాక్టర్ చట్ట ప్రకారం కార్మికులకు రావాల్సిన వేతనాలు, అలవెన్స్ చెల్లించడం లేదని, కార్మికులు ఆర్థికంగా చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే కాంట్రాక్టర్ వారికి చట్టప్రకారం వేతనాలు చెల్లించే విధంగా, హెచ్‌ఆర్ అధికారులు చర్యలు తీసుకుని, సమస్యను పరిష్కరించాలని యజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

## స్క్రాప్ పట్టివేత

**నవతెలంగాణ-గోదావరిఖని:**



పట్టుకున్న సింగరేణి స్క్రాప్

గోదావరిఖని 7బి కాలనీలోని వినాయక మండపం వెనుకాల పాత ఇంటి దగ్గర సింగరేణి స్క్రాప్ ఉందని ఆర్జీ-1 ఏరియా సెక్యూరిటీ అధికారి వీరారెడ్డికి వచ్చిన పక్కా సమాచారంతో ఆయన జూనియర్ ఇన్‌స్పెక్టర్ చంద శ్రీనివాస్, అక్బర్ అలీ, జమదార్ సంక రాజేష్, ఇంటెలిజెన్స్ టీంఎం.తిరుపతి, ఎస్.రాధాకృష్ణ, ఎసీటీఎస్ టీం గుర్రాల నర్సయ్య, మల్లికార్జున్ తో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 1,780 కిలోల విలువజేసే సింగరేణికి సంబంధించిన స్క్రాప్‌ను రికవరీ చేసినట్లు, దీని విలువ 44,500 రూపాయల వరకు ఉంటుందని తెలిపారు.

## మురికి కాలువను శుభ్రం చేసిన పారిశుధ్య సిబ్బంది

**నవతెలంగాణ కథనానికి స్పందన**

**నవతెలంగాణ-ఓదెల**



ఓదెల మండలం ఇందుర్తి గ్రామంలోని 2వ వార్డులో "పడకేసిన పారిశుధ్యం" అనే శీర్షికతో నవతెలంగాణ పత్రికలో రాసిన కథనానికి అధికారులు స్పందించి శుక్రవారం నీటి నిల్వ ఉన్న మురికి నీటి కాలువను పారిశుధ్య సిబ్బందిచే పూర్తిగా శుభ్రం చేయించారు. మురికినీటి కాలువను శుభ్రం చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ నవతెలంగాణ పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన పొత్కపల్లి విద్యార్థులు

**నవతెలంగాణ-ఓదెల**



విద్యార్థినిలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థినిలు కందెం వైష్ణవి, ఫాసియా తబస్సుమ్‌లు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు ప్రతి సంవత్సరానికి ఒక్కొక్కరికి రూ. 12000 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు కేంద్ర ప్రభుత్వం స్కాలర్షిప్ అందిస్తుం దన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై శ్రీనివాస్, భద్రయ్య, ఎన్ శ్రీనివాస్,రమేష్,జైపాల్ రెడ్డి,రఘుపతి, రామకృష్ణ,అమృత కిషోర్,షబానా బేగం,జి రవి, టీ రవిందర్,పద్మావతి దేవి,శంకరమ్మ,సుజన, సంజీవ్,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొని విద్యార్థినిలను అభినందించారు.

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం కొరకు

## జూలై 31లోగా దరఖాస్తు చేయాలి

**జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి**

**నవతెలంగాణ-పెద్దపల్లి**




ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2025 అవార్డులకు జూలై 31 లోగా ఆన్‌లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో 5 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల లోపు బాల, బాలికలు ఇతరుల కోసం అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి సైన్స్ టెక్నాలజీ, ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన బాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి, అర్హత గలవారు జూలై 31 లోపు ఆన్ లైన్ https://awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి ప్రకటనలో పేర్కొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

**స్టేషన్ ఫైర్ ఆఫీసర్ డి.శ్రీనివాస్**



**నవతెలంగాణ-పెద్దపల్లి**

ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని పెద్దపల్లి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ డి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని రామ మెటర్నరీ హాస్పిటల్, శ్రీనిక చిల్డ్రన్ హాస్పిటల్ నందు వైద్యులకు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలు నివారణ చర్యల గురించి వివరించడం జరిగిందని, ఆసుపత్రి యజమానులకు హాస్పటల్లో కొరతగా ఉన్న అగ్నిమాపక సాధనాలను సమకూర్చవలసిందిగా ఆదేశించడం జరిగిందని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ తెలిపారు. ఎలక్ట్రికల్ ఫైర్స్ సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైర్ సేఫ్టీ సిస్టమ్, ఎమర్జెన్సీ డోర్ కలిగి ఉండాలని తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రులలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు రోగులను రక్షించే విధానం వైద్య సిబ్బందికి వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైర్ మాన్ కె.శ్రీనివాస్, పి.నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయులకు సన్మానం

**నవతెలంగాణ-గోదావరిఖని:**



ఎల్కపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, అంతర్గాం జిల్లా పరిషత్ పాఠశాలను రామగుండం బీజేపీ ఇన్‌ఛార్జి కందుల సంధ్యారాణి శుక్రవారం సందర్శించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్లు విమల, ఏకాంబరంలను సత్కరించి, జ్ఞాపికల ను అందజేసి, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అయినా ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా వంద శాతం ఉత్తీర్ణత సాధించడం హర్షణీయం అన్నారు. ఈ ఫలితాల వల్ల ప్రజల్లో కూడా ప్రభుత్వ పాఠశాలల మీద నమ్మకం కలుగుతుందని ఉద్ఘాటించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల సంఖ్య పెంచడంలో కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్య క్షులు బాణాల స్వామి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శోభ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

9

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కరీంనగర్

శనివారం | జూన్ 15, 2024 | www.navatelangana.com


## అర్హులైన ప్రతి ఒక్కరికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ సాయం

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**నవతెలంగాణ - చొప్పదండి**

అర్హులైన ప్రతి ఒక్కరికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులు 61మందికి ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జక్కని నరేందర్, ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ ఎంపీపీ మునిగాల విజయలక్ష్మిచందు, నాయకులు పాల్గొన్నారు.

# అలంకారప్రాయంగా ఆరోగ్యకేంద్రాలు

- నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచని వైనం..
- బూజునూర్, సీతంపేట ప్రజల అవస్థలు

**నవతెలంగాణ - ఇల్లందకుంట**

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది ఇల్లందకుంట మండల పరిధిలోని బూజునూర్, సీతంపేట గ్రామాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిస్థితి. పీహెచ్‌సీలకు భవనాలు పూర్తై సుమారు రెండేండ్లు గడుస్తున్నా ఇంకా ప్రారంభానికి నోచుకోవడం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించి వెంటనే పీహెచ్‌సీలు ప్రారంభించాలని జనం కోరుతున్నారు.

### పొంచిన సీజనల్ ముప్పు

వర్షాకాలం ప్రారంభంలో వచ్చే సీజనల్ వ్యాధులు ముప్పు పొంచిన నేపథ్యంలో వెంటనే అధికారులు పీహెచ్‌సీలు ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. బూజునూరు గ్రామ పీహెచ్‌సీని ఎన్నికల కోడ్ వల్ల ఓపెన్ చేయలేకపోయామని, కాలం వెల్లదీసిన ఆఫీసర్లు ఇప్పటికైనా దృష్టి పెట్టాలని గ్రామస్తులు అంటున్నారు.





సీతంపేటలో అలంకారప్రాయంగా ఉన్న ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

### ఎన్నికల కోడ్, ప్రయివేటు వ్యక్తి అడ్డగింత..

ఇల్లందకుంట మండల పరిధిలోని 18 గ్రామాల్లో అన్నింటికంటే ముందే బూజునూర్, సీతంపేట గ్రామాలకు పీహెచ్‌సీలు మంజూరు అయ్యాయి. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ కింద కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులతో నిర్మాణాలను రెండు గ్రామాల్లో పూర్తి చేశారు. బూజునూర్‌లోని నిర్మాణాన్ని వైద్య శాఖకు అప్పగించి ప్రారంభించకపోవడంతో అది అలంకారప్రాయంగా మారింది. సీతంపేటలో మాత్రం నిర్మాణం పూర్తైన తర్వాత సదరు నిర్మాణం తనకు చెందినదంటూ ప్రయివేటు వ్యక్తి అడ్డుకోవడం గమనార్హం. మొత్తంగా రెండు పీహెచ్‌సీలు ప్రజలకు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలకు ఆరోగ్య సేవలు అందడం లేదు. అనారోగ్యం పాలై ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్తే అక్కడ వారి జేబులు గుల్ల అవుతున్నాయి. వెంటనే సంబంధిత ఆఫీసర్లు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



బూజునూర్ పీహెచ్‌సీని ఎలక్షన్ కోడ్ వల్ల ప్రారంభించలేకపోయాం. ఉన్నతాధికారుల అనుమతితో ఓపెనింగ్‌కు చర్యలు తీసుకుంటాం. సీతంపేట పీహెచ్‌సీ విషయమై ప్రయివేటు వ్యక్తి తన భూమిలో భవనాన్ని నిర్మించారని అడ్డుకున్నారు. ఈ విషయం కూడా ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లాం. పై అధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటాం.

**తులసీరాం, ఇల్లందకుంట మండల వైద్యారోగ్య అధికారి**

## జ్యోతిష్మతి అటానస్ కళాశాలలో రక్తదాన శిబిరం

**నవతెలంగాణ - తిమ్మాపూర్**



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రక్తదానంతో ఒకరికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని జ్యోతిష్మతి ఆటానమస్ కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని జ్యోతిష్మతి అటానమస్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రతిమ వైద్య కళాశాల సంయుక్తంగా 'వరల్డ్ బ్లడ్ డోనర్ డే'ను పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రిన్సిపాల్ కేఎస్ రావుతో కలిసి కళాశాల చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని దానాల కన్నా రక్తదానం చేయడం గొప్పదన్నారు. కళాశాలలోని 60మంది విద్యార్థులు 52 యూనిట్ల రక్తాన్ని దానం చేసినట్లు చెప్పారు. రక్తదానం చేసిన విద్యార్థులను కళాశాల చైర్మన్ అభినందించి సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ ఎం.రాజ్ కుమార్, జి.జగదీశ్వర్, దినేష్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకులపై ఏసీపీకి ఫిర్యాదు

**నవతెలంగాణ - హుజురాబాద్**



కొందరు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబుపై సోషల్ మీడియా లో అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం స్థానిక ఏసీపీ శ్రీనివాస్ జికి కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి పొన్నం, ప్రణవ్ బాబులపై అసత్య ప్రచారాలు చేస్తూ వారి ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొల్లూరి కిరణ్ కుమార్, సొల్లు బాబు, మేకల తిరుపతి, కొలిపాక శంకర్, నేరేళ్ళ మహేందర్ గౌడ్, సందమల్ల బాబు, మిడిదొడ్డి రాజు, చల్లూరి రాహుల్, లంకదాసరి లావణ్య, యేముల పుష్పలత, ఆలేటి సుశీల, పుల్ల రాధ, యండి కరీమా, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌కు 4 రోజులు సెలవు

**నవతెలంగాణ - జమ్మికుంట**

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు శని, ఆదివారాలు సాధారణ సెలవులు కాగా సోమవారం బక్రీద్ పండుగ, మంగళవారం బిసిగిరి షరీఫ్ ఉత్సవాల జాతర సందర్భంగా మార్కెట్ కు వరుసగా నాలుగు రోజులు సెలవులు ప్రకటించినట్టు మార్కెట్ సెక్రటరీ గుగులోత్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి ఈనెల 19న మార్కెట్ పునఃప్రారంభం అవుతుందని, కాబట్టి రైతులు గమనించి సహకరించాలని మార్కెట్ సెక్రటరీ కోరారు. శుక్రవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు విడి పత్తి 130 క్వింటాళ్ల 12వాహనాలలో రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్ట ధర రూ.7,250, మోడల్ - 7,150, కనిష్ట - 6,800 పలికిందని మార్కెట్ సెక్రటరీ తెలిపారు.

## యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు సన్మానం

**నవతెలంగాణ - జమ్మికుంట**



యూత్ కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇటీవల నియమితులైన మొహమ్మద్ సజ్జద్‌ను శుక్రవారం వీణవంక మండలంలోని చల్లూరు గ్రామ మైనార్టీలు పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఖుబా మస్జిద్ సదర్ సాహబ్ ఎండి ఖమ్రొద్దీన్, జామా మస్జిద్ సదర్ సాహబ్ ఎండి జాఫర్ సాహబ్, ఇమామ్‌లు ముఫ్తి జుబెయిర్, అన్సారి పాల్గొన్నారు.

## సర్వేనెంబర్ 368లో స్థలం ప్రభుత్వానిదే

### భూ కబ్జా దారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

### కౌన్సిలర్ బొంగోని వీరన్న

**నవతెలంగాణ - జమ్మికుంట**

జమ్మికుంట మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామంలో సర్వేనెంబర్ 368లో సుమారు 33 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల ఆక్రమించుకుంటున్నారని ఒకటవ వార్డు కౌన్సిలర్ బొంగోని వీరన్న ఫిర్యాదు చేసిన విషయం విదితమే. రెవెన్యూ అధికారులు సర్వేయర్ వెళ్లి సర్వే చేసి ఆ భూమి ప్రభుత్వ భూమిని ఇచ్చిన నివేదిక ఆధారంగా శుక్రవారం కౌన్సిలర్ బొంగోని వీరన్న విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో సర్వేనెంబర్ 368లో 33గుంటల శిఖం కుంట భూమిని ధర్మారం గ్రామానికి చెందిన గొడుగు సారయ్య అనే వ్యక్తి ఆ స్థలం తనదే అంటూ దానిలో టిప్పర్లతో మొరం పోసి చదును చేశారని తెలిపారు. ఆ స్థలం ప్రభుత్వానికి చెందినది అంటూ గత నెల 28వ స్థానిక తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. సర్వేయర్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కలిసి మోకా మీద సర్వే చేసి ఆ స్థలం ప్రభుత్వ స్థలమే అని తహసీల్దార్‌కు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. ఇకపై ఈ భూమిపై ఎవరికి హక్కు లేదని వీరన్న తెలిపారు. ఈ స్థలాన్ని ఆక్రమించి కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు వీరన్న తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**నవతెలంగాణ - చొప్పదండి**

చొప్పదండి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కుడిదేల కాంతయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, కొత్తూరి మహేష్, ముద్దసాని రంగన్న ఉన్నారు.

## ధరణి, ప్రజావాణి ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకోవాలి

### సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

**నవతెలంగాణ - కరీంనగర్**

జిల్లాల్లో ధరణి, ప్రజావాణి కార్యక్రమాల ద్వారా వచ్చే ఫిర్యాదులు దరఖాస్తులపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో పెండింగ్ ధరణి, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, భూముల మార్కెట్ విలువలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు, మెటేషన్ ల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వారిగా ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయడంతో పాటు ప్రతిరోజు వచ్చే దరఖాస్తులను కలెక్టర్లు సమీక్షించాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూ సంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందని, దీని కోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలన్నారు. సబ్ రిజిస్టర్ కార్యాయాల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్, గంగాధరలలో అనువైన భవనం లేదా భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ..జిల్లాలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టి త్వరగా ఫైల్లు డిస్పోజ్ చేసేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఎప్పటి పనులు అప్పుడే పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన మండలాలకు అదనపు సిబ్బందిని కేటాయించి దరఖాస్తులు వేగవంతంగా పరిష్కారమయ్యేలా చూస్తామని అన్నారు. హుజురాబాద్, గంగాధరలలో సబ్ రిజిస్టర్ కార్యాలయ ఏర్పాటుకు భవనం లేదా స్థలాన్ని గుర్తిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషన్ కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్, డీఆర్ఓ పవన్ కుమార్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీఓలు మహేశ్వర్, రమేష్ బాబు, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎదుర్కొన్నప్పుడే విజయాలను సాధించగలం..

### కలెక్టర్ పమేలా సత్పతి

**నవతెలంగాణ - కరీంనగర్**



కలెక్టర్‌కు చిత్రపటాన్ని అందిస్తున్న విద్యార్థులు

నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే క్రమంలో ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కొన్నప్పుడే అనుకున్న విజయాలతో పాటు పాఠాలను కూడా నేర్చుకోగలుగుతామని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దస్గర్వాడి ఉన్నత పాఠశాలలో మ్యూజిక్, డ్రాయింగ్, టైలరింగ్ తదితర వాటి శిక్షణను పొందిన విద్యార్థులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కలలకు ఎలాంటి అడ్డంకులు, ఆంక్షలు ఉండవని వాటిని సాధించుకోవాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. ఇంజనీరింగ్ లాంటి ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ విద్యాశాఖ అధ్వర్యంలో 42రోజులు దస్గర్వాడి పాఠశాలలో నిర్వహించిన శిక్షణ శిబిరం ద్వారా సంగీతం, చిత్రలేఖనం లాంటి అదనపు బోధన తరగతులకు హాజరైన వారిని కలెక్టర్ అభినందించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా సంగీతం లాంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వడాన్ని చూసి చాలా సంతోషంగా అనిపించిందన్నారు. జీవన ప్రయాణంలో ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయాన్ని గ్రహించాలని, మనం కనె కలలను కలలు గానే ఎన్ని అడ్డంకులు, బాధ్యతలు ఉన్న వాటిని అదిగమించి నిజం చేసుకునేలా కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు నేర్చుకున్న సంగీతాన్ని వినిపించడంతో పాటు వారు తయారుచేసిన పేపర్ పూలకుండీలు, డ్రాయింగ్స్ తదితరాలు కలెక్టర్‌కు బహుకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ పవన్ కుమార్, కోర్స్ డైరెక్టర్ గొట్టే ప్రమోద, కోర్స్ ఇన్‌చార్జీ ఏనుగు ప్రబాకర్ రావు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గొర్రెల పంపిణీలో డబ్బులు కాజేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

### కలెక్టర్‌కు ఫిర్యాదు

**నవతెలంగాణ - జమ్మికుంట**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకంలో గిరవేన శ్రీనివాస్ అనేకమంది లబ్దిదారుల నుండి డీడీలు కట్టి, అధికారులను మభ్యపెట్టి లక్షలాది రూపాయలు కాజేశారని, విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్టు మండలంలోని కోరపెల్లి గ్రామ ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షుడు గిరిబోయిన సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోరపల్లి గ్రామానికి చెందిన గిరవేన శ్రీనివాస్ జమ్మికుంట మండల యాదవ సంఘం అధ్యక్షునిగా పేరు చెప్పుకొని జిల్లా పరిధిలో గొర్రెలను ఇప్పిస్తానని నమ్మించి పైరవీలు చేస్తూ, అనేకమంది పేరుతో డీడీలు కట్టి వారికి కొంత డబ్బులు ముట్టజెప్పి, సంబంధిత అధికారులను మభ్యపెట్టి ఆంధ్రప్రదేశ్ నుండి గొర్లను తీసుకురాకుండానే లక్షలాది రూపాయలు కా జేసీ, ప్రభుత్వ సొమ్ము లూటీ చేశారని ఆరోపించారు. ఎన్‌సిడిసి లోన్‌లు ఇప్పిస్తానని చెప్పి నుండి డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. ఆయనవెంట నాయకులు గిరవేన సారయ్య శ్రీనివాస్, శ్రీనివాస్, రాజయ్య ఉన్నారు.

## కేంద్ర సహాయ మంత్రిని కలిసిన నాయకులు



**నవతెలంగాణ - తిమ్మాపూర్**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను బీజేపీ నాయకులు శుక్రవారం ఢిల్లీలో కలిసారు. పూల బొకే అందించి శాలువాలతో సన్మానించారు. మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో నాయకులు జీడి మల్లేష్, గంగిశెట్టి రాజు, కందుల శ్రీనివాస్‌రెడ్డి, సుగుర్తి జగదీశ్వరచారి, రాపాక ప్రవీణ్, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, పైడిపల్లి శ్రీనివాస్, కట్కూరి అశోక్‌రెడ్డి, అక్కతి వాసు, ఎగ్గేటి హరీష్, శ్రవణ్, మల్లారెడ్డి ఉన్నారు.

## ఐపీఈతో 'వివేకానంద' ఎంఓయూ



**నవతెలంగాణ - కరీంనగర్**

కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల వారు హైదరాబాద్‌లోనే ప్రతిష్టాత్మకమైన మేనేజ్‌మెంట్ విద్యాసంస్థ ఆయన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (ఐపీఈ)తో ఎంఓయు కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు. ఈ ఒప్పందం వల్ల ఐపీఈ కళాశాల వారు వివేకానంద కళాశాలలో అధ్యాపకులకు, విద్యార్థులకు వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే వివేకానంద కళాశాల అధ్యాపక, విద్యార్థుల బృందం ఐపీఈ సందర్శన, ఐపీలో జరిగే ట్రెనింగ్ కార్యక్రమాలలో పాల్గొనవచ్చు. ఈ ఒప్పందం వల్ల అధ్యాపకులు, విద్యార్థుల విషయ పరిజ్ఞానం పెంపొందించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ మూర్తి, డీన్ అకాడమిక్ ప్రొఫెసర్ శ్రీకాంత్, పీజీడీఎం ప్రోగ్రాం అధిపతి ప్రొఫెసర్ రామకృష్ణ, వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ



**నవతెలంగాణ - గన్నేరువరం**

ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించాలని ఎంపీటీసీ ఎలేటి స్వప్నచంద్రారెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పారువెల్ల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌ను పాఠశాల ఏపిసి చైర్మన్ యాల్ల తార, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి, చెక్కిళ్ళ తిరుపతి, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల బలోపేతమే ప్రభుత్వ ధ్యేయం

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**నవతెలంగాణ - చొప్పదండి**

రాష్ట్రంలో సహకార సంఘాలను బలోపేతం చేయడమే ప్రభుత్వ ధ్యేయం అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్, చొప్పదండి ఐఓసీఎల్ కన్జ్యూమర్ పంపును ఇటీవల కేంద్ర ప్రభుత్వ సహకారంతో, రిటైల్ అవుట్లెట్‌గా మార్చగా, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విచ్చేసి పంపును పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతులకు స్వల్పకాలిక రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల సరఫరా వంటి పలు రకాల సేవలను అందిస్తూ రాష్ట్రంలోనూ, దేశంలో ఉత్తమ సంఘంగా పేరు ప్రఖ్యాతలు రావడంలో కృషిచేసిన అధ్యక్షులు, పాలకవర్గం సిబ్బంది, సభ్యులను ప్రశంసించారు. సంఘం అభివృద్ధికి కావలసిన అన్ని రకాల సహాయ సహకారాలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందించేందుకు కృషిచేస్తానని అన్నారు. ఇస్కో కంపెనీ జిల్లా మేనేజర్ బాలాజీ చొప్పదండి సహకార సంఘానికి రూ.15లక్షల విలువ గల డ్రోన్ బ్యాటరీ ఆటో జనరేటర్‌లను రైతులు తమ పంట పొలాలకు పురుగుల మందులు ఎరువులు పిచికారి చేయుటకు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్, సంఘం అధ్యక్షుడు వెల్మ మల్లారెడ్డి, మాజీ అధ్యక్షుడు గుంటి మల్లయ్య, క్యాతం పురుషోత్తం, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, మునిగాల చందు, క్రిబ్‌కో రాష్ట్ర మేనేజర్ రామకృష్ణయ్య, జిల్లా సహకార అధికారి రామానుజచారి, కేడీసీసీబీ సీఈఓ ఎస్.సత్యనారాయణరావు, ఉపాధ్యక్షుడు, పాలకవర్గ సభ్యులు, సీఈఓ కళ్లెం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## రైతులకు రుణమాఫీ చేయాలి

### రైతు సంఘం నాయకులు

**నవతెలంగాణ - శంకరపట్నం**



రైతులకు రెండు లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మరెడ్డి రాజిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం శంకరపట్నం మండలం కేశవపట్నం కేడీసీసీ బ్యాంకు మేనేజర్ స్రవంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ రైతులకు రెండు లక్షల రుణమాఫీ వెంటనే చేసి, కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తానని ఎన్నికలలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు దాని ఊసే లేదని ఖరీఫ్ పంటలు వేసుకునే టైం వచ్చిందన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, పెట్టుబడికి సరిపోను డబ్బులు అవసరం కాబట్టి ప్రభుత్వం వెంటనే రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కల్తీ లేకుండా విత్తనాలు సప్లై చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు నకిలీవి అమ్మిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై ఇవ్వాలనని, పంట బీమాను అమలు చేయాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సిఫారస్ వెంటనే అమలు చేయాలన్నారు. పిట్టల తిరుపతి, కాసు శివయ్య, రాములు, సమ్మయ్య పాల్గొన్నారు.

## విద్యార్థినికి అభినందన

**నవతెలంగాణ - చొప్పదండి :** మండలంలోని రాగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని దీకొండ ప్రియదర్శిని ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు మొగిలి లచ్చయ్య, ఉపాధ్యాయులు అభినందించారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చదివించాలని సూచించారు.

## అవార్డు గ్రహీత పోచంపల్లి సమ్మయ్యకు సన్మానం

**నవతెలంగాణ - హుజురాబాద్ :** మహానంది అవార్డు గ్రహీత పోచంపల్లి సమ్మయ్యను శుక్రవారం స్థానిక టిడబ్ల్యూజేఎఫ్ కార్యాలయంలో పెన్షనర్స్ అండ్ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎండి ఖాలీ హుస్సేన్, సందేల వెంకన్న, పెన్షనర్స్ సంఘం నాయకులు బొంగోని వెంకటయ్య, ఐలి సతీష్, పోచంపల్లి సమ్మయ్య పోచంపల్లి శ్రీనివాస్, అనిల్, హరీష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ స్కూల్ పిల్లల నమోదుపై అవగాహన

**నవతెలంగాణ - చొప్పదండి :** చొప్పదండి మండల కేంద్రంలోని నవభారతి సమైక్య భవనంలో శుక్రవారం అంగన్వాడి కేంద్రాలలో ప్రీ స్కూల్ పిల్లల నామోదు పెంచడానికి, మహిళ సమైక్య సభ్యులకు (అంగన్వాడి బడిబాటపై) అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండున్నర నుండి ఐదు సంవత్సరాల పిల్లలందరిని అంగన్వాడీ కేంద్రాలలోనే నమోదు చేయాలని సూచించారు. ఆరు సంవత్సరాల పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. ఏపీఎం నర్మద, అంగన్వాడీ సూపర్వైజర్లు రమాదేవి, రేణుక పాల్గొన్నారు.

## నోట్‌బుక్కులు పంపిణీ

**నవతెలంగాణ - శంకరపట్నం :** శంకరపట్నం మండలం గద్దపాక జెడ్పిహెచ్ స్కూల్లో శుక్రవారం పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌ను వైస్ ఎంపీపీ పులికోట రమేష్ విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, టీచర్లు, స్కూల్ చైర్మన్ పావని, స్వరూప పాల్గొన్నారు.

## అంధుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**నవతెలంగాణ - కరీంనగర్ రూరల్ :** కరీంనగర్ జిల్లా కేంద్రంలో శాతవాహన యూనివర్సిటీకి ఎదురుగా ఉన్న ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ నర్మదా శుక్రవారం తెలిపారు. 1 నుంచి 7 వరకు ఇంగ్లీష్ మీడియంలో, 1 నుంచి 10 వరకు తెలుగు మీడియంలో బోధన ఉందని, ఉచిత విద్యా, భోజన వసతి ఉందన్నారు. 6 నుంచి 14 ఏండ్ల వయసు కలిగి జిల్లా మెడికల్ బోర్డు జారీ చేసిన సదరం సర్టిఫికెట్లో 40 నుంచి 100శాతం అంధత్వం కలిగిన వారు అర్హులన్నారు.

## 'మంత్రి పొన్నంపై ఎమ్మెల్యే ఆరోపణలు సరికాదు'

**నవతెలంగాణ - హుజురాబాద్ :** మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బూడిద రవాణాపై ఆరోపణలు చేయడం సరికాదని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు, జెడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ అన్నారు. శుక్రవారం హుజురాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్‌కు మంచి పేరు వస్తుంటే ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్యగౌడ్ మాట్లాడుతూ బీసీ నాయకులపై అవాకులు, చవాకులు పేలితే సహించేది లేదని అన్నారు. సమావేశములో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేష్ చారి, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల అంజనేయులు, దాసరి రామ్మూర్తి గౌడ్, గంప వెంకన్న, మోత్కూరి శ్రీనివాస్, కొలిపాక వెంకటేష్ పాల్గొన్నారు.

## సెంట్రల్ లైటింగ్ వెంటనే పూర్తి చేయాలి

### బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్

**నవతెలంగాణ - చొప్పదండి :** చొప్పదండి మున్సిపాలిటీలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు నాయకులతో కలిసి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె.నాగరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. పనులు నిలిచిపోయి మూడు నెలలు అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. డివైడర్‌తో రోడ్డు క్రాస్ చేసేటప్పుడు తరచు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆయనవెంట అనుమాండ్ల రాజశేఖర్, తాడూరి శివకృష్ణ, వడ్లూరి సుధాకర్, జిట్ట కుమార్, గుండేటి శివశంకర్, స్వర్గం కళ్యాణ్, కొత్త అఖిల్, పొన్నాల అజయ్ ఉన్నారు.

# కూరలు పిరం... పప్పులు కొనలేం...

## వినియోగానికి సరిపడా లేని సాగు విస్తీర్ణం...



- పంట దిగుబడులొచ్చే వరకు ధరల మంటలే
- ప్రతి ఏటా ఇదే తంతు.. పట్టించుకోని ప్రభుత్వాలు
- సబ్సిడీ ఎత్తేయడంలో సాగుకు ఆసక్తి చూపని రైతులు
- ఇతర రాష్ట్రాల నుంచి అధిక దిగుమతులు
- మార్కెట్ సౌకర్యం కల్పించాలంటున్న అన్నదాతలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి/ మొఫిసిల్ యంత్రాగం

'ఏం కొనేటట్టులేదు.. ఏం తినేటట్టులేదు. నాగులో నాగన్న.. ఈ ధరల మీద ధరలు పెరిగే నాగులో నాగన్న' అనే పాట పాతదే అయినా వర్తమానానికి వర్తిస్తుంది. సేరు పప్పుకొనబోతే సెటాకంత రాకపాయే... కిలో కాయలు కొందామంటే పావు కిలో రాకపాయే అన్నట్టు ఉంది మార్కెట్‌లో కాయగూరలు, పప్పు ధరల పరిస్థితి. మార్కెట్ మాయా జాలంతో పండించే రైతుకు గిట్టుబాటు ధర దక్కట్లేదు. వినియోగదారుల జేబుకు చిల్లులు పడుతున్నాయి. వినియోగానికి సరిపడ పంట రాష్ట్రంలో పండకపోవడం, ఏటా అకాల వర్షాల వల్ల పంట నష్టమేర్పడడంతో కాయకూరల ధరలు మండిపోతున్నాయి. దోసకాయ, దొండ, బెండ, వంకాయ, ఆలుగడ్డ ధరలు పైకి ఎగబకాయి. పచ్చిమిర్చి, క్యాప్సికం, బీర, కాకరకాయలైతే పావు కిలోకే సరిపెట్టేస్తున్నారు. కూరగాయలు, పప్పులే కాదు మాంసం, కోడిగుడ్ల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. ఉల్లిని కొనలేని పరిస్థితి ఏర్పడింది. కాయకూరల సాగుకు సరైన ప్రోత్సహకాల్లేకపోవడం, సాగు చేసిన రైతుకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతో ఏటేటా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ వరకు పంటలు పండుతాయి. దీంతో ఆగస్టు వరకు ఇతర రాష్ట్రాల మీదనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అప్పటిదాకా దళారులు కొరతను సృష్టించి ధరలు పెంచడం మామూలైంది. పంట చేతికందేవరకు ధరలు అందుబాటులోకి రావడం కష్టమేనని తెలుస్తోంది. దీనకంతటికీ ప్రభుత్వాల నిర్లక్ష్యమే. ప్రభుత్వాలు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే కాయగూరల సాగు పెరిగే అవకాశం ఉంది. స్కూల్స్ ప్రారంభమైనందున ప్రభుత్వ స్కూల్స్‌లో మధ్యాహ్నభోజనం, హాస్టల్స్, రెసిడెన్షియల్స్‌లో భోజనం, టిఫిన్స్ విషయంలోనూ కాయగూరలు, పప్పుల ధరల ప్రభావం పడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ధరలు పరిస్థితి, కూరగాయల సాగుపై బుధ, గురువారాల్లో నవతెలంగాణ బృందం పరిశీలించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

### ప్రోత్సాహమేది...?

రాష్ట్రంలో 41.75 లక్షల టన్నుల కూరగాయలు అవసరం. ప్రస్తుతం 23.46 లక్షల టన్నుల కూరగాయలే మాత్రమే ఉన్నాయి. 18.29 లక్షల టన్నుల కూరగాయల కొరత ఉంది. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారుల అంచనా. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో భూములకు రేట్లు పెరగడంతో ఎక్కువమంది కూరగాయల సాగుకు ఆసక్తి చూపడం లేదు. దాంతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కూడా ప్రభుత్వాలు కల్పించడం లేదు. 2020-21 నుండి రాష్ట్రంలో కూరగాయల సాగులో సబ్సిడీలను ఎత్తివేశారు. విత్తనాలు, డ్రిప్, మల్చింగ్ పేపర్, పందిళ్ళు, ట్రెల్లిస్, ప్లాస్టిక్ క్రేట్స్ 50 శాతం సబ్సిడీ పై ఇచ్చేవారు. గత 4-5 ఏండ్లుగా ప్రభుత్వం ఉద్యాన శాఖ లో సబ్సిడీలను ఇవ్వడం లేదు. దీంతో రైతులు కూరగాయల పంటలు వేసేందుకు సుముఖత చూపడం లేదు. వ్యవసాయ ప్రణాళికలోనూ 70 లక్షల ఎకరాల్లో పత్తి, 60 లక్షల ఎకరాల్లో వరి సాగుకు ప్రభుత్వం అంచనా వేసింది. మిగతా 10 లక్షల ఎకరాల్లోనే కాయగూరలు, నూనెలు, పండ్లతోటలు, ఇతర పంటలు సాగు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వాల ప్రాధాన్యతల్లోనే ఈ పంటల సాగుకు సరైన ప్రోత్సాహం ఇవ్వడం లేదని తెలుస్తోంది.

### హైదరాబాద్‌కు ఎక్కువగా తరలింపు...

ఉమ్మడి మెదక్ జిల్లాలో రోజువారీగా ప్రజలు వినియోగించే కాయగూరలకు సరిపడగా సాగు విస్తీర్ణం లేదు. సంగారెడ్డి జిల్లాల్లోని జహీరాబాద్, ఝరాసంఘం, న్యాల్‌కల్, కోహీర్ వంటి ప్రాంతాల్లో 12 వేల ఎకరాల్లో ఆలుగడ్డ, 2 వేల ఎకరాల్లో అల్లం పడిస్తారు. సంగారెడ్డి, సదాశివపేట, కొండాపూర్ ప్రాంతాల్లో 1500 ఎకరాల్లో ఉల్లిగడ్డ సాగు చేస్తున్నారు. దొండ, బెండ, దోస, చిక్కుడు, పచ్చిమిర్చి పండిస్తున్నప్పటికీ మార్కెట్ అవసరాలకు సరిపడ లేదు. దళారులు తోటపైనే సరుకును కొనుగోలు చేసి హైదరాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్తుండడంతో స్థానికంగా కాయగూరల కొరత వల్ల ధరలు మండుతున్నాయంటున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కంది, పెసర, మినుము సాగు 2.50 లక్షల ఎకరాలపైనే ఉంది. అయితే పంట దిగుబడి చేతికొచ్చాక గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు ఇతర పంటల వైపు మళ్లుతున్నారు. ప్రస్తుతం సాగు చేసిన పంట చేతికొచ్చే వరకు ధరల ప్రభావం ఇలాగే ఉంటుందని వ్యాపారులు పేర్కొన్నారు. గతంలో కాయగూరలు సాగు చేసే రైతులకు డ్రిఫ్, విత్తనాల సబ్సిడీ ఉండేది. ముఖ్యంగా కోల్డ్ స్టోరేజీల్లేకపోవడం వల్ల కూడా పంట నిల్వ ఉంచుకునే సదుపాయంలేదని రైతులు చెబుతున్నారు.

> **పెరిగిన పప్పుల ధరలు**
>
> పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం పెరగకపోవడం, వర్షాల వల్ల పంట నష్టపోవడంతో వివిధ పప్పుల ధరలు కూడా పెరుగుతూ పోతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన కంది పప్పు ధర కిలో రూ.185 ఉంది. సాధారణ రకమైతే రూ.175 పలుకుతుంది. పెసర పప్పు ధర కూడా రూ.125, శనపప్పు ధర రూ.92, మినపప్పు ధర రూ.140 వరకు ఉంది.



### చిత్తూరు, కర్నూల నుంచి ఖమ్మానికి...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు వేల ఎకరాల్లో కూరగాయ పంటలు సాగవుతున్నాయి. పట్టణాలకు దగ్గరగా ఉన్న గ్రామాల్లోనే ఈ పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. 4000 మంది రైతులు 3400 ఎకరాల్లో కూరగాయ పంటలు సేద్యం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 1780 ఎకరాల్లో 200 మందికి పైగా రైతులు సేద్యం చేస్తుండగా.. కొత్తగూడెం జిల్లాలో 1600 మంది రైతులు సాగు చేస్తున్నారు. టమాటా అత్యధికంగా 500 ఎకరాలకు పైగా సాగవుతుండగా, బెండకాయ కూడా అంతే మొత్తంలో సేద్యం చేస్తున్నారు. దోసకాయ, మునగకాయలను సుమారు 400 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఆకుకూరలు 300 ఎకరాల్లో, కాకరకాయ, వంకాయ మరో 300 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రజల అవసరాలకు సరిపడా సాగు లేకపోవడంతో కర్నూల్, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి భారీ మొత్తంలో దిగుమతి చేసుకుంటున్నారు.

### ఉమ్మడి రంగారెడ్డిలో రియల్ ఎస్టేట్ ప్రభావం..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని గ్రామీణా మండలాల్లో కూరగాయలు పండిస్తున్నారు. శంషాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల, మహేశ్వరం, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాల్లో కూరగాయాలు సాగు చేస్తున్నారు. ఉల్లి 397 ఎకరాలు, అలుగడ్డ 28ఎకరాలు, కొత్తమీర 41ఎకరాలు, అన్ని రకాల కూరగాయాలు మొత్తం 66,222 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో నవాబుపేట, మర్పల్లి, పరిగి, తాండూర్, కోట్‌పల్లి, పూడూర్ మండలాల్లో కూరగాయాలు సాగు చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వల్ల గతంలో కంటే కూరగాయాల సాగు తగ్గింది. అకాల వర్షాల వల్ల పంట దెబ్బతిని దిగుబడి తగ్గింది. దాంతో ధరలు కూడా పెరిగాయి.

### ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో తగ్గుతున్న పంట

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కూరగాయల సాగు క్రమంగా తగ్గుతోంది. 35,200 వేల ఎకరాలకు పైగా కూరగాయలను సాగు చేసేవారు. తాజాగా అధికారిక లెక్కల ప్రకారం 15 వేల ఎకరాల్లో సాగు తగ్గింది. నాగర్ కర్నూల్ జిల్లాలో 5 వేల ఎకరాలు, గద్వాలలో 3500 వేల ఎకరాలు, వనపర్తిలో 3500ఎకరాలు, నారాయణ పేటలో 3000 వేల ఎకరాలను సాగు చేస్తున్నారు. జిల్లాకు సరిపడే కూరగాయలు దిగుబడి లేక ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

### ఇతర రాష్ట్రాల నుంచి వరంగల్‌కు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రధానంగా ఖిలా వరంగల్, దామెర, గీసుగొండ, సంగెం, ఆత్మకూరు మండలాల్లో కూరగాయలు ఎక్కువగా పండిస్తారు. మే నెల లోపే ఇక్కడ కూరగాయల రాబడులు బంద్ అవుతాయి. మే నెల చివరి వారం నుండే ఇతర రాష్ట్రాల నుండి కూరగాయలు వరంగల్ కు అధికంగా వస్తాయి. ప్రస్తుతం టమాటా మదనపల్లి మార్కెట్ నుండి రోజూ 240 క్వింటాళ్ల వస్తుంది. పచ్చి మిర్చి మహారాష్ట్ర నుండి రోజూ 350 క్వింటాళ్ల వస్తున్నది. వరంగల్ లక్ష్మీపురం మార్కెట్లో కిలో టమాట రూ. 50.00 వుంటే.. రిటైల్గా రూ.80.00 వరకు అమ్ముతున్నారు. మీర్చి కిలో రూ.70.00 నుండి రూ.80.00 ల వరకు అమ్ముతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో బెండకాయ, తోటకూర, బచ్చలి కూర, చుక్కకూర, సొరకాయ, మినహా ఎలాంటి కూరగాయలు పండడం లేదు. అన్ని రకాల కూరగాయలు ఆంధ్ర నుంచి దిగుమతి అవుతున్నాయి మహబూబాబాద్ జిల్లాలో బెండకాయలు రూ.30(కిలో), తోటకూర రూ.10(5కట్టలు), బచ్చల కూర రూ.10 (6 కట్టలు), చుక్కకూర రూ.10(5కట్టలు), మిగిలిన అన్ని కూరగాయలు ఆంధ్ర నుంచి దిగుమతి అవుతున్నాయి. రైతు బజార్ లేకపోవడంతో రైతుల కూరగాయలు పండించి తీసుకొని రావడం లేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో కూరగాయల ధరలు మండుతున్నాయి. హన్మకొండ జిల్లా లో వాన కాలంలో 628 ఎకరాలు, ఎండా కాలంలో 984 ఎకరాలలో కూరగాయలు పండిస్తారు. ఈ రెండు కాలాల్లో ఈ జిల్లాలో రెండు కాలాల్లో మొత్తంగా 1612 ఎకరాల్లో కాయగూరలు, ఆకుకూరలు పండిస్తున్నారు. వరంగల్ జిల్లాలో 3,899 ఎకరాల్లో కాయగూరలు, ఆకుకూరలు పండిస్తున్నారు. వాస్తవానికి కూరగాయల సాగుకు సంబంధించి అసలు లెక్కలు అధికారుల వద్ద లేవు. జూన్, జూలై, ఆగస్టు వరకు ఈ ధరలు తీవ్రంగా వుండే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

> **ధరలు చుక్కల్లో ...**
>
> పంటలు లేకపోవడం, దళారుల మాయాజాలంతో మార్కెట్లో కాయగూరలు ధరలు చుక్కలనంటుతున్నాయి. ఆకు కూరలు, కాయగూరల ధరలు మండిపోతుండడంతో వినియోగదారులు విలవిలలాడుతున్నారు. మండుతున్న ధరల పరిస్థితిని పరిశీలిస్తే... సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో పచ్చిమిర్చి గాటు రకం కిలో రూ.100 ఉండగా సాధారణ రకం రూ.80 అమ్ముతుంది. అల్లంవెల్లుల్లి కిలో ధర రూ.200 పైనే ఉంది. కాకర, బీరకాయ కిలో ధర రూ.80, టమాటా, చామగడ్డ, క్యారెట్, దోస, వంకాయ కిలో ధర కూడా రూ.60 నుంచి రూ. 80 పలుకుతుంది. బెండ, దొండ, ఆలుగడ్డ సైతం రూ.50 నుంచి రూ.70 కిలో అమ్ముతున్నారు. పచ్చి మిర్చి కిలో రూ.120, వంకాయ కిలో రూ.100 అయింది. చిన్న సైజు నాలుగు మునగకాయల ధర రూ.50 ఉంది. గోరుచిక్కుడు, చిక్కుడు ధరలు కూడా మండుతున్నాయి. పాలకూర, గొంగూర, మెంతినకూర ధరలు కూడా పెరిగాయి.

---

# ట్రాక్టర్, లారీ ఢీ

- ఇద్దరు మృతి.. ఐదుగురి పరిస్థితి విషమం
- అశ్వారావుపేట మండలంలో ఘటన



నవతెలంగాణ - అశ్వారావుపేట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట - ఖమ్మం రహదారిలోని నారమువారి గూడెం సమీపంలో కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో గుమ్మడివల్లికి చెందిన 16 మంది కూలీలు ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లాలోని జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం నుంచి మామిడి మొక్కలు లోడు చేసుకుని అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంలోని ఓ ప్రయివేట్ నర్సరీకి తరలిస్తున్నారు. ఈ మొక్కలు లోడు, కూలీలతో నారంవారిగూడెం వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వచ్చిన ట్రాలీ లారీ అదుపుతప్పి ఢీ కొట్టి ఈడ్చుకు వెళ్లిడంతో ట్రాక్టర్ బోల్తా పడి కూలీలందరూ చెల్లాచెదురయ్యారు. ఈ ప్రమాదంలో గుమ్మడవల్లికి చెందిన వెంకటలక్ష్మి(45) అక్కడికక్కడే మృతి చెందగా, బత్తుల దుర్గయ్య (60) అశ్వారావుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తీవ్ర గాయాలయిన స్వాతి, అనిల్, ముసలియ్య, నీరజ, దుర్గమ్మను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. మిగతా వారికి స్థానికంగా చికిత్స అందిస్తున్నట్టు డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.

---

# బీఆర్ఎస్ పనైపోయింది..

- కాంగ్రెస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయం : ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్
- ఆయనతో బండి సంజయ్ భేటీ
- రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై చర్చ

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో



తెలంగాణలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పనై పోయిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయమనే విషయం కూడా పార్లమెంట్ ఫలితాలతో రుజువైందని చెప్పారు. శుక్రవారం ఢిల్లీ సౌత్ ఎవెన్యూలోని తరుణ్ చుగ్ నివాసంలో ఆయనను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై నేతలు చర్చించినట్లు చుగ్ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కేవలం ఐదు నెలల్లోనే ప్రజా విశ్వాసం కోల్పోయిందన్నారు. ఆ పార్టీపై ప్రజలకు ఉన్న నిరాశను ఎన్నికల ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. సాధ్యం కాని హామీలిచ్చిన కాంగ్రెస్, వాటిని అమలు చేయకుండా తెలంగాణ ప్రజలకు ద్రోహం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల ఫలితాలు ఆ పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న ఆగ్రహానికి అద్దం పడుతున్నాయన్నారు. మరోవైపు బండి సంజయ్‌కు పలువురు నేతలు, తెలుగు రాష్ట్రాలకు చెందిన 2022 బ్యాచ్ ఐఏఎస్ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

---

# త్వరలో 13వేల టీచర్ పోస్టుల భర్తీ

- ప్రభుత్వ బడులకు రూ.600 కోట్లు
- నాలుగు నెలల్లో 'ఉదయ సముద్రం' ప్రారంభం
- బ్రాహ్మణ వెల్లంలలో ఇందిరమ్మ ఇండ్లతో నూతన కాలనీ
- నార్కట్‌పల్లి బస్ డిపో పునరుద్ధరణ : రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నవతెలంగాణ -నార్కట్‌పల్లి




ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యను అందించాలి. ప్రభుత్వ బడులకు రూ. 600 కోట్లు కేటాయించాం.. త్వరలోనే 13వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తాం.. అలాగే, బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టును నాలుగు నెలల్లో ప్రారంభిస్తాం.. అని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంత్రి యూనిఫామ్స్, పుస్తకాలను పంపిణీ చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చదువుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలందరినీ బడికి పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయడం ద్వారా నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా రూ. 600 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు చేపట్టినట్టు తెలిపారు. అందులో భాగంగా జిల్లాకు రూ.50 కోట్లు మంజూరు చేసినట్టు వెల్లడించారు. పాఠశాలల్లో పనులతో పాటు, విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టే బాధ్యత కూడా మహిళా సంఘాలకు అప్పగిస్తామన్నారు. త్వరలోనే 13 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. టాయిలెట్స్‌ను తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా బ్రాహ్మణ వెల్లెంలకు త్వరలోనే ఇండ్లు కట్టించి పేదల కోసం నూతన కాలనీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటికే శంకుస్థాపన చేసిన రోడ్డు పనులు రూ.70 కోట్లతో ప్రారంభం కానున్నాయని తెలిపారు. నాలుగు నెలల్లో బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టును ప్రారంభిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించే విధంగా డిజైన్ చేసినట్టు చెప్పారు. నార్కట్‌పల్లి బస్ డిపోను పునరుద్ధరించేందుకు అన్ని చర్యలూ చేపట్టామని, త్వరలోనే కొత్తగా 20 బస్సులను డిపోకి అందిస్తామని తెలిపారు.

చదువుకుంటేనే కుటుంబాలు బాగు పడతాయని, మంత్రి కోమటిరెడ్డి ఆశయాల కనుగుణంగా పాఠశాలలను తీర్చిదిద్దుతామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బ్రాహ్మణ వెల్లెంల పాఠశాలను జిల్లాలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందనా దీప్తి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# పోకిరీలలకు షీ టీమ్స్ దడ

- వేధిస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- మహిళల పట్ల పురుషులు బాధ్యత, మర్యాదగా నడుచుకోవాలి : రాచకొండ సీపీ డా.తరుణ్ జోషి
- 15 రోజుల్లో 147 మంది ఆకతాయిల ఆటకట్టు
- కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్



నవతెలంగాణ-హయత్‌నగర్

బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీ టీమ్స్, పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తే లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ సీపీ డా.తరుణ్ జోషి అన్నారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నాయని తెలిపారు. బాలికలను, మహిళలను వెంబడించే.. వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు చెప్పారు. కమిషనరేట్ పరిధిలో మహిళలను, యువతులను వేధింపులకు గురిచేసిన 147 (మేజర్స్-87, మైనర్స్-60) మందిని షీ టీమ్స్ పట్టుకున్నాయి. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు వారి కుటుంబసభ్యుల సమక్షంలో శుక్రవారం ఎల్బీనగర్‌లో ఉన్న రాచకొండ కమిషనరేట్ క్యాంప్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గత నెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 183 ఫిర్యాదులు అందాయని రాచకొండ విమెన్ సేఫ్టీవింగ్ డీసీపీ టి.ఉషా విశ్వనాథ్ తెలిపారు. ఫిర్యాదులపై విచారణ చేపట్టి దర్యాప్తు పూర్తి చేశామన్నారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఆడవారికి ఎదురయ్యే వేధింపుల నుంచి రక్షించేందుకు రాచకొండ షీ టీమ్స్ పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. పురుషులు మహిళల పట్ల బాధ్యతగా, మర్యాదగా నడుచుకోవాలని, వారికి అండగా నిలవాలని సూచించారు. స్త్రీలను గౌరవించడం వ్యక్తిత్వంలో భాగం కావాలని, ఆడవారిని ఇబ్బందులు పెట్టే వారిని ఉపేక్షించేది లేదన్నారు. అటువంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు వేధింపులకు గురైనప్పుడు వెంటనే షీ టీమ్స్ రాచకొండ వాట్సాప్ నెంబర్ 8712662111 ద్వారా లేదా ఆయా ప్రాంత షీ టీమ్ అధికారుల నెంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. భువనగిరి ఏరియా- 8712662598, చౌటుప్పల్ ఏరియా-8712662599, ఇబ్రాహీంపట్నం ఏరియా -8712662600, కుషాయిగూడ ఏరియా - 8712662601, ఎల్బీనగర్ ఏరియా -8712662602, మల్కాజిగిరి ఏరియా-8712662603, వనస్థలిపురం ఏరియా -8712662604కు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశం, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

---

# నకిలీ పత్రాల విషయంలో కార్పొరేటర్ అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు



నవతెలంగాణ - మీర్‌పేట్

నకిలీ పత్రాలు సృష్టించి భూమి రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ మొక్క నరేందర్ కుమార్ అలియాస్ నందును పోలీసులు అరెస్టు చేశారు. మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం..తాను రియల్ ఎస్టేట్ చేస్తానని.. అందులో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని కార్పొరేటర్ మొక్క నరేందర్(నందు) స్నేహితుడు చిత్రోజు కృష్ణకు చెప్పాడు. ఈ మేరకు కృష్ణ నుంచి నరేందర్ రూ.5 కోట్లు తీసుకున్నాడు. కొంగరకలాన్‌లోని సర్వే నెంబర్ 76అ, 74ఆ, 75అ తదితర నెంబర్లలో దాదాపు 6 ఎకరాల 17గుంటల భూమిపై తప్పుడు అగ్రిమెంట్ పత్రాలు సృష్టించాడు. దాన్ని కృష్ణ, బొడ్డుపల్లి సతీష్ కుమార్, మొక్క నరేందర్ కుమార్ పేర్లపై అగ్రిమెంట్ చేసినట్టు చూపెట్టాడు. తర్వాత భూమి రిజిస్ట్రేషన్ చేయించాలని కృష్ణ పలుమార్లు కార్పొరేటర్‌ను అడిగాడు. అయితే కార్పొరేటర్ వాయిదాలు వేస్తూ రావడంతో అనుమానం వచ్చిన కృష్ణ భూమి యజమానులైన తుమ్మల ధీరజ్ రెడ్డి, తోట మాధవరెడ్డి, గుండు శ్రీకాంత్‌ను కలిశాడు. తమ భూమిని ఎవరికీ అమ్మలేదని వారు తెలిపారు. దాంతో మోసపోయినట్టు గ్రహించిన కృష్ణ మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టి కార్పొరేటర్ నరేందర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

---

# యూపీలో కార్పొరేట్, కమ్యూనల్ శక్తులకు గుణపాఠం

- వ్యకాస జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్




నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కార్పొరేట్, కమ్యూనల్ శక్తులకు ఉత్తరప్రదేశ్ ప్రజలు, సామాజిక శక్తులు తగిన గుణపాఠం చెప్పారని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. ఏఐఏడబ్ల్యుయూ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. 80 పార్లమెంటు స్థానాలున్న యూపీలో 43 స్థానాల్లో ఇండియా బ్లాక్‌ను గెలిపించి, బీజేపీ ఎన్డీయే కూటమిని 37 స్థానాలకు పరిమితం చేయటం దేశవ్యాప్తంగా అభ్యుదయ, ప్రజాస్వామిక శక్తులకు గొప్ప స్ఫూర్తినిచ్చిందన్నారు. కార్పొరేట్ కమ్యూనల్ శక్తులకు యూపీలో సీట్లు తగ్గటంలో గ్రామీణ పేదలు, కార్మిక కర్షకులతో పాటు సామాజిక తరగతులు ముఖ్య భూమిక పోషించాయన్నారు. రాముడి పేరుతో ముస్లిం వ్యతిరేకత, కుల ఇంజనీరింగ్‌తో ప్రజలను చీల్చడానికి మోడీ, యోగి ఎన్ని కుట్రలు కుతంత్రాలకు పాల్పడినా, ప్రజలు వారికి కర్రు కాల్చి వాత పెట్టారని విమర్శించారు. ఎన్నికలకు ముందుగా హిందూ మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టే చర్యల్లో భాగంగా మోడీ రామాలయాన్ని ప్రారంభించారన్నారు. ఆ రామాలయ నిర్మాణం జరిగిన చోట ఫజియాబాద్ జనరల్ ఎంపీ స్థానంలో ఒక దళితుడు గెలవడం అసాధారణ విషయమన్నారు. ఆయన గెలుపు ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ లక్ష్యంగా, మత ఉన్మాదాన్ని ప్రజలు తిప్పికొట్టేలా ఉందని అభివర్ణించారు. ఉన్మాదం కాదు ఉపాధి కావాలని, కార్పొరేట్ల కొమ్ము కాయటం కాదు, కష్టజీవుల, వ్యవసాయ కార్మికుల వెతలు మార్చండనే వాదన ముందుకు రావడం హర్షించదగ్గ పరిణామని అన్నారు. అలాగే బీజేపీకి పరోక్షంగా సహకరించాలనుకున్న బీఎస్పీని ఈసారి ప్రజలు తిరస్కరించారని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ఉపాధ్యక్షులు బ్రిజిలాల్ భారతి, యూపీ రాష్ట్ర అధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర నాయకులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నమ్మకం లేకుంటే...

**అనుమానం పెనుభూతం అంటారు పెద్దలు. ఒకసారి అది మనసులోకి వచ్చిందంటే అంత తేలిగ్గా వదలదు. మన సంతోషంతో పాటు కుటుంబ సభ్యుల సంతోషాన్ని కూడా సర్వనాశనం చేసేస్తుంది. వారేమనుకుంటే అదే నిజమని నమ్మేస్తారు. ఎదుటి వారు ఎంత చెప్పినా అస్సలు అర్థం చేసుకోరు. భాగస్వామి తనని కాదని ఎవరితోనో సంబంధం పెట్టుకున్నారని అనుకుంటారు. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్‌లో చదువుదాం...**



అజయ్‌కి సుమారు 45 ఏండ్లు ఉంటాయి. సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం. భార్య ఈ మధ్యనే టీచర్‌గా జాబ్ చేయడం మొదలుపెట్టింది. వీరికి ఇద్దరు కొడుకులు. అజయ్‌కి తల్లిదండ్రులు లేరు. ఒక అక్క, చెల్లి మాత్రమే ఉన్నారు.కుటుంబాలతో బిజీగా ఉండి అజయ్ వాళ్ళ ఇంటికి పెద్దగా రారు. ఎప్పుడైనా వచ్చి రెండు మూడు గంటలు అలా ఉండి వెళ్ళిపోతారు. అజయ్ భార్య లతకు తల్లిదండ్రులతో పాటు ఒక అక్క, చెల్లి, ఇద్దరు అన్నలున్నారు. వారు కూడా అప్పుడప్పుడు వస్తుంటారు. లత ఎప్పుడైనా వాళ్ళ అమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళి ఒక్క రోజు ఉండి 'నేను లేకపోతే అజయ్‌కి ఇబ్బంది అవుతుంది' అని చెప్పి వెళ్ళిపోతుంది. కుటుంబం మొత్తం కలిసి ఎక్కడికైనా వెళ్ళినా పల్లవి రెండు రోజుల కంటే ఎక్కువ ఎక్కడా ఉండనివ్వదు. 'ఇంటికి వెళ్ళిపోదాం' అంటూ తీసుకొచ్చేస్తుంది.

ఇక ఇంటికి వచ్చినప్పటి నుండి అజయ్‌ని అనుమానపు మాటలతో ఇబ్బంది పెడుతుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో అజయ్ మా దగ్గరకు వచ్చి 'మేడమ్ నేనూ, పల్లవి మంచి స్నేహితులం. ఆమె నాకు అత్త కూతురు కూడా. ఇద్దరం ఒకే వయసు వారు కావడంతో అన్నీ షేర్ చేసుకుంటూ ఉంటాం. సదరాగా మాట్లాడుకుంటాం. ఆమె నాకు అన్ని విషయాల్లో మంచి సలహాలు ఇస్తుంటుంది. ఈ విషయం మా కుటుంబంలో అందరికీ తెలుసు. దాంతో మా స్నేహం గురించి ఎవ్వరూ తప్పుగా అనుకునేవారు కాదు. డిగ్రీ అయిపోయినతర్వాత పల్లవికి పెండ్లి చేశారు. ఆమెకు పెండ్లయిన పదేండ్లకు నా పెండ్లి అయ్యింది.

లత నా జీవితంలోకి వచ్చిన తర్వాత పల్లవితో మాట్లాడనిచ్చేది కాదు. ఆమెకు దూరంగా ఉండమనేది. నాకు బాగా ఇబ్బందిగా అనిపించింది. ఎందుకంటే నా తల్లిదండ్రుల తర్వాత నేను పూర్తిగా నమ్మింది పల్లవిని మాత్రమే. నేను నిజంగా పల్లవిని ప్రేమించి ఉంటే ఆమెనే పెండ్లి చేసుకునేవాడిని. కానీ నాకు ఆమెపై అలాంటి ఉద్దేశం లేదు. మేమిద్దరం మంచి స్నేహితులం మాత్రమే. ఒక అబ్బాయి, అమ్మాయి స్నేహితులుగా ఉంటే తప్పేముంది. మేము బంధువులం కూడా కాబట్టి ఎవరి ఇంట్లో ఫంక్షన్ ఉన్నా ఆమె వచ్చేది, నేనూ వెళ్ళేవాడిని. కానీ ఫంక్షన్ అయిపోయిన తర్వాత లత నాకు చుక్కలు చూపించేది. మా ఇద్దరి మధ్య నువ్వు అనుకున్నట్టు ఏమీ లేదు. అని ఆధారాలు చూపించినా నమ్మదు.

**లత, నా జీవితంలోకి వచ్చిన తర్వాత పల్లవితో మాట్లాడనిచ్చేది కాదు. ఆమెకు దూరంగా ఉండమనేది. నాకు బాగా ఇబ్బందిగా అనిపించింది. ఎందుకంటే నా తల్లిదండ్రుల తర్వాత నేను పూర్తిగా నమ్మింది పల్లవిని మాత్రమే. నేను నిజంగా పల్లవిని ప్రేమించి ఉంటే ఆమెనే పెండ్లి చేసుకునే వాడిని.**

లత నన్ను అనుమానిస్తుందని పల్లవికి తెలిసి 'లతకు అనుమానంగా ఉంటే మనిద్దరం మాట్లాడుకోవడం ఎందుకు, పెండ్లి తర్వాత ఎవరికైనా కొన్ని పరిమితులు ఉండాలి. ఇందులో లతను తప్పుపట్టాల్సింది ఏమీ లేదు. ఏ భార్య అయినా భర్త తనతోనే ఉండాలనుకుంటుంది, అది సహజం. కాబట్టి నువ్వు నాతో మాట్లాడటం తగ్గించి ఆమెకు టైం కేటాయించు. మన కుటుంబ సభ్యులంటే మనల్ని మొదటి నుండి చూస్తున్నారు కాబట్టి ఏమీ అనుకోరు. కానీ లతకు ఇదంతా తెలీదు, మనమే అర్థం చేసుకోవాలి' అని చెప్పింది. అప్పటి నుండి పల్లవి నాకు దూరంగా ఉంటుంది. ఇప్పుడు ఫోన్ కూడా చేయడం లేదు. ప్రస్తుతం ఆమెను కలిసి పదేండ్లు అవుతుంది. ఏదైనా ఫంక్షన్ ఉన్నా నేను వెళ్ళిపోయిన తర్వాత తను వస్తుంది. లేదా నేను వచ్చే సరికి తను వెళ్ళిపోతుంది. నేను కూడా లతకు ఇష్టం లేదని పల్లవి గురించి ఆలోచించడమే మానేశాను. ఈ విషయాలన్నీ లతకు తెలుసు. అయినా ఆమెకు నాపై అనుమానం పోలేదు. అప్పట్లో పల్లవి విషయంలోనే అనుమానించేది. ఇప్పుడు ఎవరితో మాట్లాడినా అనుమానిస్తుంది. నా ఫోన్ తీసుకొని చెక్ చేస్తుంది. ఆడవాళ్ళ నెంబర్లు డిలీట్ చేసేస్తది. పెద్ద వాళ్ళతో మాట్లాడినే 'అమ్మాయిలు సరిపోక ఆంటీలతో సంబంధ పెట్టుకున్నావా' అంటుంది. చివరకు ఇంటర్ చదువుతున్న తన అక్క కూతురితో మాట్లాడినా అలాగే అంటుంది. ఇలాంటి లతతో ఎలా బతకాలో నాకు అర్థం కావడలేదు. నా బాధ చెప్పుకోడానికి ఎవ్వరూ లేరు. అందుకే మీ దగ్గరకు వచ్చాను' అంటూ బాధపడ్డాడు.

అజయ్ చెప్పింది విన్న తర్వాత మేము లతను పిలిపించి మాట్లాడితే 'నా భర్త నాకు మాత్రమే సొంతం అనుకోవడం తప్పా. అజయ్ నాతో మాత్రమే మాట్లాడాలి, కేవలం నాపై మాత్రమే ప్రేమ చూపించాలి. పల్లవి నా ముందు అజయ్‌ని అది కాదురా, ఇది కాదురా అనేది. ఈయన కూడా ఆమెను అలాగే పిలుస్తుంటాడు. అది నాకు అస్సలు నచ్చలేదు. ఆమెకు తాగనని మాట ఇచ్చాడంట. మా పెండ్లి తర్వాత ఒకరోజు మా వాళ్ళు బలవంతం చేస్తే తాగాడు. ఆ రోజు రాత్రి పదకొండు గంటలకు ఆమెకు ఫోన్ చేసి సారీ చెప్తున్నాడు. ఆమెకు అంత ప్రాధాన్యం ఎందుకివ్వాలి. ఇలా చేస్తే నాకు అనుమానం రాదా? ఇంటి చుట్టుపక్కల వాళ్ళు కూడా అజయ్‌తో మంచిగా మాట్లాడతారు. నాతో మాత్రం సరిగ్గా మాట్లాడరు. అందుకే నాకు అనుమానం. నాతో మాట్లాడుతూనే ఒక్కోసారి 'అది కాదు రా' అంటుంటారు. అంటే పల్లవి తన మనసులో ఉన్నట్టే కదా? అందుకే ఫోన్ నెంబర్లు డిలీట్ చేశాను. నేను చేసిన దాంట్లో నాకైతే తప్పేం కనిపించడం లేదు' అంది.

దానికి మేము 'భార్యా భర్తలు ఇద్దరూ ఒకరిపై ఒకరు నమ్మకంతో ఉండాలి. అలా కాకుండా ఎవరితో మాట్లాడినా అనుమానం పెంచుకుంటే జీవితంలో సంతోషమే ఉండదు. నిజంగా అతను ఎవరితోనైనా సంబంధం పెట్టుకున్నట్టు నీ దగ్గర ఆధారాలు ఉంటే మాతో చెప్పు. మేం మాట్లాడతాం. అలా కాకుండా అనవసరంగా అనుమాన పడుతూ నువ్వు బాధపడుతూ నీ భర్తను బాధపెడుతున్నావు. దీని వల్ల నీ కుటుంబం మొత్తం ఇబ్బంది పడుతుంది. నువ్వు ఇంత ఇబ్బంది పెట్టినా అతను నీతోనే ఉంటున్నాడు. అంటే నువ్వంటే అతనికి చాలా ఇష్టం. లేదంటే ఈ పాటికి నిన్ను వదిలించుకోడానికి ప్రయత్నించేవాడు. ఒక్కసారి ఆలోచించు. ఇలాగే ప్రతి దానికి అనుమాన పడితే రేపు నిజంగా అలాంటి పరిస్థితి రావొచ్చు. అనవసరంగా మీ సమస్యను పెద్దది చేసుకోకు. ఇప్పటికైనా అతన్ని అర్థం చేసుకో. ఇద్దరూ కలిసి సంతోషంగా ఉండండి. మీ ఇద్దరూ సంతోషంగా ఉండాలని పల్లవి నీ భర్తకు దూరంగా ఉంటుంది. అలాంటి ఆమె గురించి నువ్వు తప్పుగా అనుకోవద్దు' అని చెప్పాము.

**ప్రతి దానికి అనుమాన పడితే రేపు నిజంగా అలాంటి పరిస్థితి రావొచ్చు. అనవసరంగా మీ సమస్యను పెద్దది చేసుకోకు. ఇప్పటికైనా అతన్ని అర్థం చేసుకో. ఇద్దరూ కలిసి సంతోషంగా ఉండండి. మీ ఇద్దరూ సంతోషంగా ఉండాలని పల్లవి నీ భర్తకు దూరంగా ఉంటుంది. అలాంటి ఆమె గురించి నువ్వు తప్పుగా అనుకోవద్దు..**

దాంతో ఆమె కాస్త ఆలోచనలో పడింది. ఖాళీగా ఉండి ఇతర ఆలోచనలు వస్తున్నాయని మేమే ఏదైనా ఉద్యోగం చూసుకోమని ఆమెకు సలహా ఇచ్చాము. అందుకే ఈ మధ్యనే టీచర్‌గా చేరింది. ప్రస్తుతం ఇద్దరి మధ్య సమస్యలు కొంత వరకు తగ్గాయి. ఇద్దరూ సంతోషంగా ఉంటున్నారు.

- వై వరలక్ష్మి
9948794051

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

## ఇలా చేద్దాం...

వంట గదిలో బొద్దింకలు సంచరించడం సర్వసాధారణమైన సమస్య. దాదాపు అందరి ఇంట్లో ఈ సమస్య ఎదురయ్యే ఉంటుంది. బొద్దింకలు రాగానే వెంటనే మార్కెట్లో లభించే స్ప్రేలను కొనుగోలు చేస్తుంటాం. అయితే వీటి ధర అధికంగా ఉంటుంది. నిత్యం ఇలా డబ్బులు పెట్టి కొనుగోలు చేయలేము, అలా అని బొద్దింకలను అలానే వదిలేయలేము. పొరపాటున అవి మనం తినే ఆహార పదార్థాలపై వాలితే భారీ మూల్యం చెల్లించాల్సిందే. మరి



బొద్దింకలను సహజమైన పద్ధతిలో ఎలా తరిమికొట్టవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం..

లవంగం, వేప నూనెతో బొద్దింకలను తరిమికొట్టవచ్చు. ఇందుకోసం ముందుగా కొన్ని లవంగాలను తీసుకొని వాటిని మిక్సీలో పొడిగా మార్చుకోవాలి. అనంతరం అందులో వేప నూనె పోయాలి. ఈ మిశ్రమాన్ని బొద్దింకలు తిరిగే చోట పెట్టాలి అంతే బొద్దింకలు అటు సైడ్ రమ్మన్నా రావు.

పెప్పర్‌మింట్ ఆయిల్ కూడా బొద్దింకలను తరిమికొడుతుంది. ఇందుకోసం పెప్పర్‌మింట్ ఆయిల్‌లో ఉప్పు, నీటిని కలిపి స్ప్రే చేయాలి. దీంతో బొద్దింకలు అటువైపు రావు.

కిరోసిన్ వాసనకు కూడా బొద్దింకలు రావు. బొద్దింకలు ఎక్కువగా ఉండే చోట కాస్త కిరోసిన్‌ను చల్లాలి దీంతో బొద్దింకలు పారిపోతాయి.

బొద్దింకలను తరిమికొట్టడానికి, బేకింగ్ సోడాలో కొంచెం పంచదార కలిపి బొద్దింకలు ఎక్కడ వస్తున్నాయో అక్కడ వేస్తే అటువైపు రావు.

దాల్చిన చెక్కను చిన్న ముక్కలుగా చేసి అక్కడక్కడ వేయండి. ఈ వాసనకు కూడా బొద్దింక అటువైపు రాదు. పుదీనా ఆకులు కూడా బొద్దింకలు రాకుండా చేస్తాయి.

బొద్దింకలు ఎక్కువగా రావడానికి ప్రధాన కారణం కిచెన్ సింక్‌లో ఉండే పగుళ్ల కాబట్టి వాటిని వైట్ సిమెంట్‌తో పూడ్చేయాలి. ఈ పగుళ్లలో బొద్దింకలు గుడ్లు పెడుతాయి.

# ఆ జీవోనే రేవంత్‌కు ఆయుధమా..?

(మొదటిపేజి తరువాయి)

పెట్టుబడి సాయం చేస్తామని ప్రకటించింది. అందుకనుగుణంగా 04.04.2018న కీలకమైన ఉత్తర్వు(జీవోనెం.231)ను విడుదల చేసింది. 'సాగు చేసిన భూమికే పెట్టుబడి సాయం...' అని ఆ జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. ఒకవేళ రైతు వానాకాలంతోపాటు యాసంగి పంట వేస్తే... ఆయన ఎంతమేర సాగు చేస్తే, అన్ని ఎకరాలకు ఈ పథకం వర్తిస్తుందంటూ సదరు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కానీ ఆ జీవోను కేసీఆర్ సర్కారే ఉల్లంఘించచదనే విమర్శలు వెల్లువెత్తాయి. పంట వేయని బీడు భూములు, రియల్ ఎస్టేట్ కోసం పక్కకు పెట్టిన స్థలాలు, వెంచర్లు వేసి ఖాళీగా వదిలేసిన వాటితోపాటు ఇతరత్రా పడావుపడ్డ భూములకు కూడా రైతు బంధు పైసలు పడ్డాయి. తద్వారా పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగమవుతోందంటూ ప్రతిపక్షాలు ఆక్షేపించాయి. అయినా బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదు. ఇదే ఇప్పుడు రేవంత్ సర్కారుకు ఆయుధంగా మారబోతున్నది. కేసీఆర్ హయాంలో విడుదల చేసిన జీవోనెం.231ను పక్కాగా అమలు చేయటం ద్వారా అటు ఖజానాపై భారాన్ని తగ్గించటంతోపాటు ప్రధాన ప్రతిపక్షాన్ని కూడా రాజకీయంగా ఇరకాటంలో పడేయొచ్చని సీఎం రేవంత్ భావిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు కాంగ్రెస్ పక్కా వ్యూహాన్ని రచించనుందని తెలిసింది. మరోవైపు 'పంట వేయని భూములకు' రైతు బంధును నిలిపేస్తే సుమారు రూ.2 వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల వరకూ భారం తగ్గుతుందని ఆర్థిక శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు సీఎం రేవంత్‌కు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు త్వరలోనే నివేదిక సమర్పించనున్నారు.

# అహంకారం వల్లే 240 సీట్లకు పరిమితం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీ అహంకారం వల్లే 240 సీట్లకు పరిమితమైందని ఆర్ఎస్ఎస్ నేత ఇంద్రేశ్ కుమార్ మండిపడ్డారు. రాజస్థాన్ రాజధాని జైపూర్ సమీపంలోని కనోటాలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నేత ఇంద్రేష్ కుమార్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీ పేలవమైన పనితీరును విమర్శించారు. అహంకారమే దీనికి కారణమని దుయ్యబట్టారు. 'రాముడిపై భక్తిని ప్రదర్శించి, అహంకారంతో ఉన్న పార్టీని రాముడు 240 సీట్ల వద్దే నిలిపివేశాడు. అయితే అది అతిపెద్ద పార్టీగా అవతరించింది' అని అన్నారు.

సార్వత్రిక ఎన్నికల తరువాత నాగ్‌పూర్‌లోని కార్యకర్త వికాస్ వర్గ్ వేడుకల సందర్భంగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగిస్తూ ఎన్నికల ప్రచారంలో అబద్ధాలు, భాషను ఉపయోగించడాన్ని విమర్శించారు. ఇలాంటి ఎన్నికల ప్రసంగం పార్టీలు పాటించాల్సిన మర్యాదను ఉల్లంఘించాయని అన్నారు. " నిజమైన సేవకుడు గౌరవాన్ని కాపాడుకుంటాడు. ఆయన పని చేస్తున్నప్పుడు గౌరవాన్ని అనుసరిస్తాడు. 'ఈ పని నేనే చేశాను' అనే అహంకారం ఆయనకు ఉండదు. ఆ వ్యక్తిని మాత్రమే నిజమైన 'సేవకునిగా పిలుచుకుంటాం" అని ఆర్ఎస్ఎస్ చీఫ్ భగవత్ అన్నారు.

## అందరికీ అందుబాటులో ధరణి పోర్టల్

(మొదటిపేజి తరువాయి)

సిఫారసులపై సుదీర్ఘంగా చర్చించామనీ, తుది నివేదిక ప్రభుత్వానికి సమర్పించేకంటే ముందు అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

# జులై 22 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు!

(మొదటిపేజి తరువాయి)

2024-25 సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను సమర్పించే అవకాశం ఉంది. ప్రధానిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన మోడీ ప్రభుత్వం తొలి బడ్జెట్‌ను జులై 22న సమావేశాలు ప్రారంభం రోజే లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని సదరు వర్గాలు తెలిపాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను సమర్పించనున్నట్టు పేర్కొన్నారు. అయితే బడ్జెట్ సమావేశాల తేదీలకు సంబంధించి ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.

ఇదిలా ఉండగా.. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఎన్నికల అనంతరం పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్టు ప్రభుత్వం అప్పట్లోనే తెలిపింది. ఈ నేపథ్యంలోనే కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో 2024-25 సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సిద్ధమైనట్టు సమాచారం.

**ఈ నెల 24 నుంచి 18వ లోక్‌సభ తొలి సమావేశాలు**

18వ లోక్‌సభ తొలి సమావేశాలు ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్నట్టు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఈ సమావేశాలు జూన్ 24 నుంచి ప్రారంభం కానుండగా, రాజ్యసభ సమావేశాలు జూన్ 27 నుంచి మొదలు కానున్నాయి. జులై 3 వరకూ ఎనిమిది రోజులపాటు ఉభయ సభల సమావేశాలు కొనసాగనున్నాయి. ఈ సమావేశాల్లో కొత్త సభ్యుల ప్రమాణ స్వీకారం, లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఉంటుంది.

**26న స్పీకర్ ఎన్నిక**

జూన్ 24, 25 తేదీల్లో ఎన్నికైన ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆ తర్వాత 26న కొత్త లోక్‌సభ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. ఆ పదవికి అభ్యర్థులకు మద్దతు తెలిపే తీర్మానాల నోటీసులను 25న మధ్యాహ్నం 12 గంటల్లోగా అందించాలని లోక్‌సభ సచివాలయం ఇప్పటికే తెలిపింది.

జూన్ 27న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. ఈ ప్రసంగంలో రానున్న ఐదేండ్ల ప్రభుత్వం చేయబోయే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి వెల్లడించనున్నట్టు తెలిసింది. రాష్ట్రపతి ప్రసంగం తరువాత ప్రధాని మోడీ తన మంత్రి మండలిని పార్లమెంట్‌కు పరిచయం చేయనున్నారు. ఆ తరువాత రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఉంటుంది. అనంతరం ప్రధాని మోడీ సమాధానం ఇవ్వనున్నారు.

# కారు స్టీరింగ్ ఎవరికి?

(మొదటిపేజి తరువాయి)

మాజీ మంత్రి హరీశ్‌రావుకు అప్పగిస్తే ఎలా ఉంటుందంటూ కేసీఆర్ పలువురిని అడిగినట్టు తెలిసింది. తెలంగాణ ఉద్యమంతోపాటు ప్రభుత్వంలో కూడా కీలక బాధ్యతలు నిర్వర్తించిన హరీశ్‌కు బీఆర్ఎస్‌లో 'మాస్ పల్స్' తెలిసిన నాయకుడిగా పేరుంది. ఒకవేళ ఆయనకు పార్టీ పగ్గాలు అప్పజెబితే దళిత సామాజిక వర్గానికి చెందిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ప్రధాన కార్యదర్శి పదవిని అప్పగించాలని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. దళితుణ్ని ముఖ్యమంత్రి చేస్తానన్న ఆయన, ఆ మాటను నిలబెట్టుకోలేదన్న అపవాదు కూడా ఉంది. ఈ క్రమంలో ప్రవీణ్ కుమార్‌నే అధ్యక్ష స్థానంలో కూర్చోబెడితే 'ఉభయ తారకం'గా ఉంటుందనే చర్చ కూడా కారు పార్టీలో జోరందుకుంది. ఈ విషయంపై కూడా కేసీఆర్ దృష్టి సారించినట్టు విశ్వసనీయ సమాచారం. ఇలా ముందుకెళితే గతంలో ఉన్న మచ్చను పోగొట్టుకోవచ్చు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను మళ్లీ దగ్గర చేసుకోవచ్చనే వ్యూహంతో కేసీఆర్ ఉన్నట్టు కీలక నేతలు వ్యాఖ్యానించారు.

మరోవైపు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయటంలో భాగంగా గత నాలుగైదు రోజులుగా బీఆర్ఎస్ బాస్ ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఇందుకోసం వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మేధావులు, ఉద్యమ సహచరులతోపాటు పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీలు, ఇతర ప్రజా ప్రతినిధులతో లోతైన చర్చలు కొనసాగిస్తున్నారు. ఈ భేటీలు, చర్చల సారాంశం ఆధారంగా త్వరలోనే పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన నిర్ణయించారు. ఈ మీటింగుకు సంబంధించిన తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు. దీంతోపాటు అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీలోని వివిధ స్థాయి కార్యకర్తలకు, కమిటీల్లోని ప్రతినిధులకు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించాలని భావించినప్పటికీ లోక్‌సభ ఎన్నికల వల్ల అది సాధ్యం కాలేదు. అందువల్ల ఇప్పుడు ఆ శిక్షణా శిబిరాలకు శ్రీకారం చుట్టాలని కేసీఆర్ నిర్ణయించారు. సంబంధిత షెడ్యూల్‌ను రూపొందించాలంటూ ఆయన నేతలను ఆదేశించారు.

# కృత్రిమ మేధస్సును నిషేధించాలి

(మొదటిపేజి తరువాయి)

అత్యవసరం వుంది. అంతిమంగా వాటి వినియోగాన్ని నిషేధించాలి." అని పోప్ విజ్ఞప్తి చేశారు. "గొప్పదైన, సక్రమమైన మానవ నియంత్రణను ప్రవేశపెట్టడానికి సమర్ధవంతమైన, నిర్దిష్టమైన నిబద్ధత నుంచి ఇది ప్రారంభమవుతుంది. ఒక మానవుని ప్రాణాన్ని తీసేయడానికి యంత్రాలను ఎన్నడూ ఎంపిక చేసుకోరాదు." అని ఆయన వ్యాఖ్యానించారు.

జీ-7 సదస్సుకు హాజరైన తొలి కేథలిక్ చర్చి అధినేత పోప్ ఫ్రాన్సిస్, ఆయుధ పరిశ్రమ పట్ల ఎప్పుడూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ వుంటారు. యుద్ధాలు, మరణాల నుంచి లాభాలను ఆర్జించరాదని ఆయన వ్యాఖ్యానించారు. కృత్రిమ మేధస్సును ఇప్పటికే యుద్ధ రంగాల్లో ఉపయోగిస్తున్నారు. ఆధునిక యుద్ధ తంత్రాల్లో దీన్ని ఉపయోగించాలన్న ఆలోచన వల్ల పెరిగే ఘర్షణల ముప్పు, నిర్ణయాలు తీసుకోవడంలో మానవుల పాత్ర వంటి అంశాలపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కృత్రిమ మేధస్సు చాలా ఉత్తేజితకరమైన, భయాందోళనలు కలగచేసే సాధనమని ఆయన సదస్సులో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. ఎఐ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని, అయితే అది సురక్షితమైన, నైతికమైన సాధనం కాదని అన్నారు. యంత్రాలపై ఆధారపడడం ద్వారా మానవులు తమకు తాము నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని మనం లాగేసుకోరాదని ఆయన హెచ్చరించారు.

# కవితతో కేటీఆర్ ములాఖాత్

(మొదటిపేజి తరువాయి)

చర్చలపై చర్చించారు. అయితే ఈ సందర్భంగా కవిత పూర్తి ధీమాగా కన్పించారని తెలిసింది. ధైర్యంగా ఉన్నానని, తన గురించి ఆందోళన వద్దని చెప్పినట్టు సమాచారం. అయితే ఈ అక్రమ కేసును ఎదుర్కొనే దిశలో న్యాయ సలహాలు, సూచనలు అందించాలని అన్న కేటీఆర్‌ను కోరినట్టు తెలిసింది.

**రెండు నెలల తర్వాత..**

దాదాపు రెండు నెలల తర్వాత కేటీఆర్ కవితను కలిశారు. ఏప్రిల్ 14 న చివరిసారి బావ అనిల్‌తో కలిసి ములాఖాత్ అయ్యారు. అంతకు 21 రోజులకు ముందు (మార్చి 21) చివరిసారి తల్లి శోభరావు, కవిత ఆడపడుచు సౌమ్య (సంతోష్ సోదరి)తో వెళ్లి కలిసారు. మార్చి 15 న కవితను ఈడీ అరెస్ట్ చేసిన తర్వాత ... కేటీఆర్, హరీశ్‌రావులు హుటాహుటిన ఢిల్లీ వచ్చారు. ఈడీ కస్టడీలో మొదటి ఐదు రోజులు కేటీఆర్ కవితను కలిసి మనోధైర్యం నింపారు. న్యాయపరంగా ఈ కేసును ఎదుర్కోవడంలో పూర్తి మద్దతుని చ్చారు. తీహార్ జైలుకు వెళ్లిన తర్వాత కవితను కలవడం ఇదే తొలిసారి.

మార్చి 15న సోదాల పేరుతో హైదరాబాద్‌లోని ఆమె నివాసానికి ఈడీ అధికారులు వెళ్లి అరెస్ట్ చేశారు. అదే రోజు రాత్రి ఢిల్లీకి తరలించారు. మార్చి 15న రౌస్ ఎవెన్యూ కోర్టులో హాజరుపరుచగా, ఈడీ కస్టడీకి అనుమతించింది. ఇలా రెండు దఫాలుగా ఈడీ కస్టడీని పొడగించిన కోర్టు, మార్చి 26న జ్యూడీషియల్ కస్టడీ విధించింది. దీంతో ఆమెను పోలీసులు తీహార్ జైలుకు తరలించారు. జ్యూడీషియల్ కస్టడీలో ఉండగానే, ఏప్రిల్ 11న తీహార్ జైల్‌లోనే సీబీఐ ఆమెను అదుపులోకి తీసుకుంది.

## జమిలీపై కోవింద్ కమిటీ నివేదిక

(మొదటిపేజి తరువాయి)

అందుకు సిద్ధమవుతోంది. జమిలీ ఎన్నికలపై అధ్యయనం చేసిన రామ్‌నాథ్ కోవింద్ నేతత్వంలోని కమిటీ ఈ ఏడాది మార్చి 15న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నివేదిక అందించింది. లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, తర్వాత వంద రోజుల్లోపు స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని అందులో సిఫారసు చేసింది. వీటితోపాటు మూడు స్థాయిల ఎన్నికలకు ఉమ్మడి ఓటర్ల జాబితా, ఓటరు కార్డులను రూపొందించాల్సిన అవసరముందని సూచించింది.

మరోవైపు ఇదే అంశంపై అటు న్యాయశాఖ కూడా త్వరలోనే తన నివేదికను అందజేయనున్నట్టు సమాచారం. లోక్‌సభ, అసెంబ్లీతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించాలని సూచించనున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ ఎన్నికలను 2029 నుంచి అమలుచేయాలని, ఒకవేళ హంగ్ ప్రభుత్వం లేదా అవిశ్వాసం వంటి సందర్భాలు ఎదురైతే ఏకీకత ప్రభుత్వం కోసం నిబంధనను సిఫారసు చేయనున్నట్టు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి.

## వాయనాడ్ నుంచి ప్రియాంక పోటీ..!

(మొదటిపేజి తరువాయి)

విషయం తెలిసిందే. నిబంధనల ప్రకారం.. ఫలితాలు వెలువడిన తర్వాతి 14 రోజులలోపు ఆ అభ్యర్థి మరో స్థానానికి రాజీనామా చేయాలి. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ వాయనాడ్‌సీటుని వదులుకోనున్నట్టు సీనియర్ కాంగ్రెస్ నేత శుక్రవారం తెలిపారు. ఇటీవల వాయనాడ్ పర్యటన సమయంలో రాహుల్ గాంధీ.. ఏ నియోజకవర్గాన్ని వదులుకోవాలనే డైలమాలో ఉన్నట్టు ప్రకటించారు. అయితే తన నిర్ణయం అందరికీ సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ క్రమంలోనే వాయనాడ్ నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేసే అవకాశం ఉందని ఆ సీనియర్ నేత స్పష్టం చేశారు. రెండేండ్ల క్రితమే రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారని, అయితే ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేదని అన్నారు. ఈ రెండు సీట్లలో ఒకదానికి రాజీనామా చేసే అంశంపై త్వరలో పార్టీ ప్రకటన విడుదల చేస్తుందని తెలిపారు.

# పెద్దపల్లిలో అమానుషం

(మొదటిపేజి తరువాయి)

తెలిపిన వివరాల ప్రకారం.. కాట్నపల్లిలోని ఓ రైస్‌మిల్లులో బీహార్‌కు చెందిన వలస కూలీలు అక్కడే నివాసం ఉంటూ మిల్లులో పని చేస్తున్నారు. బీహార్‌లోని విశాలి జిల్లాకు చెందిన వినోద్‌మజ్హి అలియాస్ రాజ్‌కుమార్(28) మిల్లులో హమాలీగా పని చేస్తున్నాడు. మిల్లులో తను ఉండే గది దగ్గరలోనే మరో గదిలో మరో కుటుంబం ఉంటోంది. వారికి ఆరేండ్ల చిన్నారి ఉంది. ఈ క్రమంలో గురువారం (13వ తేదీ) అర్ధరాత్రి కరెంటు పోవడంతో రాజ్‌కుమార్ బయటకు వచ్చాడు. అదే సమయంలో తన గది సమీపంలోనే ఆరుబయట తోటి కార్మికుని కుటుంబం పడుకోగా.. చిన్నారి తల్లి పక్కన నిద్రిస్తోంది. అది గమనించి అతను చిన్నారి నోరు మూసి చప్పుడు కాకుండా అక్కడి నుంచి ఎత్తుకెళ్లి మిల్లు వెనుక భాగంలోని నిర్మానుష్య ప్రాంతంలో లైంగికదాడి చేసి గొంతు నులిమాడు. అపస్మారక స్థితికి చేరిన చిన్నారి ఊపిరి ఆడక ప్రాణం వదిలింది. అదే రాత్రి అక్కడి నుంచి రాజ్‌కుమార్ పరారయ్యాడు. కొద్దిసేపటికి పక్కలో పాప కనిపించక పోవడంతో భయపడిన తల్లి బోరున విలపిస్తూ మిగతా కూలీలను నిద్రలేపింది. వారంతా అదే రాత్రి చుట్టుపక్కల గాలించగా.. మిల్లు వెనుక భాగంలో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు. తెల్లవారే సరికే విషయం కాట్నపల్లి, సుల్తానాబాద్ పట్టణం వరకూ తెలియడంతో పెద్దఎత్తున జనం చేరుకున్నారు. చిన్నారిని దుండగుడు నోరు మూసి ఎత్తుకెళ్తున్న దృశ్యం సీసీ కెమెరాలో స్పష్టంగా కనిపిస్తోంది. పాపను చిదిమేసిన వాడిని ప్రాణంతో వదలకూడదని, వెంటనే ఉరి తీయాలంటూ బాలిక తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపిన పోలీసులు రాత్రంతా నిందితుని కోసం గాలించి ఉదయం పట్టుకున్నారు. ఈ అమానవీయ ఘటనపై స్పందించిన ఆయా రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు కరీంనగర్ వెళ్లే రాజీవ్ రహదారిపై ధర్నా చేశారు.

# విజయంతో ముగించాలని!

- నేడు కెనడాతో భారత్ పోరు
- గ్రూప్ దశలో రోహిత్‌సేన చివరి పోరు
- మ్యాచ్‌కు పొంచి ఉన్న వర్షం ముప్పు
- రాత్రి 8 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ఐసీసీ టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశను అజేయంగా ముగించేందుకు టీమ్ ఇండియా ఎదురుచూస్తుంది. గ్రూప్-ఏలో వరుసగా ఐర్లాండ్, పాకిస్థాన్, అమెరికాలను చిత్తు చేసిన భారత్ నేడు పసికూన కెనడాతో తలపడనుంది. అమెరికాతో మ్యాచ్‌లో తరహాలోనే నేడు కెనడా జట్టులోనూ భారత సంతతి ఆటగాళ్లు ఎక్కువగా ఉన్నారు. అయితే, గ్రూప్ దశలో అజేయంగా నిలిచే భారత ప్లాన్‌కు వరుణుడు ఆటంకం కలిగించే అవకాశం ఎక్కువగా ఉంది. నేడు భారత్, కెనడా మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది.

నవతెలంగాణ-లాడర్‌హిల్



పొట్టి ప్రపంచకప్‌లో భారత్ తొలిసారి మరో స్టేడియంలో ఆడేందుకు రంగం సిద్ధం చేసుకుంది. వార్మప్ మ్యాచ్ సహా గ్రూప్-ఏ దశలో మూడు మ్యాచులను టీమ్ ఇండియా న్యూయార్క్‌లోని నాసా కౌంటీ అంతర్జాతీయ స్టేడియంలోనే ఆడేసింది. వార్మప్ సహా మూడు మ్యాచుల్లోనూ మెరుపు విజయాలు నమోదు చేసింది. ఆరు పాయింట్లతో గ్రూప్-ఏలో అగ్రస్థానంలో కొనసాగుతున్న టీమ్ ఇండియా ఇప్పటికే సూపర్ 8 బెర్త్ సొంతం చేసుకుంది. సూపర్8లో అడుగుపెట్టేందుకు గ్రూప్ దశ చివరి మ్యాచ్‌లో విజయం సాధించటంపై భారత్ ఇప్పుడు కన్నేసింది. ఫ్లోరిడాలోని లాడర్‌హిల్ స్టేడియంలో నేడు కెనడాతో భారత్ ముఖాముఖి తలపడనుంది. ప్రపంచ క్రికెట్ అగ్రజట్టు భారత్‌తో పసికూన కెనడా తలపడనుండటం ఇదే ప్రథమం. లాడర్‌హిల్ వేదికగా భారత్, కెనాడా మ్యాచ్ నేడు.

### యశస్వికి చోటు కష్టమే

టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు ఎక్స్ ఫ్యాక్టర్ అవుతాడనుకున్న యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌కు నేడు కెనడాతో మ్యాచ్‌లోనూ చోటు లభించటం కష్టంగానే కనిపిస్తోంది. భారత్ ఇప్పటికే సూపర్8కు చేరుకోవటంతో పసికూన కెనడాతో మ్యాచ్‌కు సీనియర్లకు విశ్రాంతి ఇవ్వటం ఆనవాయితీ. కానీ గ్రూప్ దశలో మూడు మ్యాచుల్లోనూ బ్యాటర్లు ఆశించిన ప్రదర్శన చేయలేదు. పేస్ స్వర్గధామ పిచ్‌పై బ్యాటర్లు విఫలమయ్యారు. దీంతో ఫ్లోరిడాలో బ్యాటర్లు పరుగుల వేటలో దూకుడు చూపించాలని అనుకుంటున్నారు. దీనికి తోడు ఓపెనర్ విరాట్ కోహ్లి మూడు ఇన్నింగ్స్‌ల్లోనూ విఫలమయ్యాడు. నేడు కెనడాతో మ్యాచ్‌లో విరాట్ కోహ్లి కచ్చితంగా ఆడనున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మ విశ్రాంతి తీసుకుంటే తప్ప యశస్వి జైస్వాల్‌కు తుది జట్టులో చోటు దక్కటం కష్టమే. వికెట్ కీపర్ సంజు శాంసన్ సైతం తుది జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్నాడు. భారత జట్టులో నిలకడగా రాణిస్తున్న బ్యాటర్ రిషబ్ పంత్. నేడు పంత్ విశ్రాంతి తీసుకుంటే సంజు శాంసన్‌కు పిలుపు దక్కొచ్చు. ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా సహా శివం దూబె, హార్దిక్ పాండ్యలు సైతం బ్యాట్‌తో మెరవాలని ఆశిస్తున్నారు. అర్షదీప్ సింగ్, మహ్మద్ సిరాజ్‌తో కలిసి జశ్‌ప్రీత్ బుమ్రా మరోసారి పేస్ బాధ్యతలు పంచుకోనున్నాడు.



### కెనడా పోటీ ఇవ్వగలదా?!

పసికూన కెనడా గ్రూప్-ఏలో ఆడిన మూడు మ్యాచుల్లో రెండింట పరాజయం చవిచూసింది. పాకిస్థాన్, అమెరికా చేతిలో ఓడిన కెనడా.. మరో పసికూన ఐర్లాండ్‌పై విజయం సాధించింది. కెనడా క్రికెట్ జట్టు చరిత్రలోనే నేడు అత్యంత కీలక మ్యాచ్ ఆడనుంది. అగ్రజట్టు భారత్‌తో ఆడటం కెనడాకు ఇది తొలిసారి. దీంతో ఫలితం గురించి ఆలోచన లేకుండా ఉత్తమ ప్రదర్శన చేయాలని ఆ జట్టు భావిస్తుంది. ఇక కెనడా జట్టులోనూ భారత సంతతి ఆటగాళ్లు ఎక్కువగా ఉన్నారు. ఆరోన్ జాన్సన్, నవనీత్, పర్గాట్ సహా శ్రేయాస్ మోవవ్వ, రవీందర్‌పాల్ సింగ్‌లు కెనడాకు కీలకం కానున్నారు. కలీమ్ సనా, జెరెమీ, హేలిగర్, బిన్ జాఫర్‌లు బంతితో ముఖ్య భూమిక పోషించేందుకు ఎదురుచూస్తున్నారు. న్యూయార్క్‌తో పోల్చితే బ్యాటింగ్‌కు కాస్త మెరుగైన లాడర్‌హిల్ పిచ్‌పై భారత బ్యాటర్ల దూకుడును నిలువరించటం కెనడా బౌలర్లకు శక్తికి మించిన పని కానుంది.

### వర్షం ప్రమాదం

భారత్ ఇప్పటివరకు న్యూయార్క్‌లో డ్రాప్ ఇన్ పిచ్‌లపై ఆడింది. బ్యాటింగ్‌కు ఏమాత్రం అనుకూలించిన పిచ్‌పై మెరుగైన ప్రదర్శనతో మూడు విజయాలు సాధించింది. లాడర్‌హిల్ పిచ్ కాస్త భిన్నంగా ఉండనుంది. పరుగుల వరద పారకున్నా బ్యాటింగ్, బౌలింగ్‌కు సమతూకం ఉండనుంది. కానీ వాతావరణ పరిస్థితులు ఆందోళనకు దారితీస్తున్నాయి. ఇక్కడ నేపాల్, శ్రీలంక మ్యాచ్ వర్షంతో రద్దు అయ్యింది. ఈ వారం అంతా వరదలతో కూడిన వర్షం సూచనలు ఉన్నాయి. నేడు సైతం భారీ వర్షం సూచనలు ఉన్నాయి. దీంతో భారత్, కెనడా మ్యాచ్‌కు వరుణుడు అంతరాయం కలిగించే ప్రమాదం ఎక్కువగా ఉంది. ప్రతికూల పరిస్థితులతో మ్యాచ్ ముందు రోజు టీమ్ ఇండియా ప్రాక్టీస్ సెషన్ సైతం సాధ్యపడలేదని సమాచారం. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

### తుది జట్లు (అంచనా)

**భారత్ :** రోహిత్ శర్మ (కెప్టెన్), విరాట్ కోహ్లి, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, శివం దూబె, హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, మహ్మద్ సిరాజ్, జశ్‌ప్రీత్ బుమ్రా.

**కెనడా :** ఆరోన్ జాన్సన్, నవనీత్ దాలివాల్, పర్గాట్ సింగ్, నికోలస్ కిర్టన్, శ్రేయాస్ మోవ్వ (వికెట్ కీపర్), రవీందర్‌పాల్ సింగ్, బిన్ జాఫర్ (కెప్టెన్), కలీమ్ సనా, దిలాన్, జునైద్ సిద్దికి, జెరెమీ గార్డన్.

## ముగిసిన పోరాటం!

- క్వార్టర్స్‌లోనే మన షట్లర్లకు నిరాశ
- ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500

**సిడ్నీ (ఆస్ట్రేలియా) :** ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుల పోరాటానికి తెరపడింది. 2024 పారిస్ ఒలింపిక్స్ ముంగిట మంచి ప్రదర్శనపై కన్నేసిన మన షట్లర్లకు ప్రతి టోర్నమెంట్‌లోనూ నిరాశే ఎదురవుతోంది. సిడ్నీలో భారత షట్లర్ల పోరాటానికి క్వార్టర్‌ఫైనల్లోనే తెరపడింది. పురుషుల సింగిల్స్‌లో హెచ్.ఎస్ ప్రణయ్, సమీర్ వర్మలు పరాజయం పాలయ్యారు. ఐదో సీడ్ హెచ్.ఎస్ ప్రణయ్ 19-21, 13-21తో వరుస గేముల్లో రెండో సీడ్ కొడాయ్ నరొక (జపాన్) చేతిలో చిత్తయ్యాడు. తొలి గేమ్‌లో పోటీనిచ్చిన ప్రణయ్.. రెండో గేమ్‌లో చేతులెత్తేశాడు. మరో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో సమీర్ వర్మ 12-21, 13-21తో ఓటమి చెందాడు. వరుస గేముల్లో కనీస పోటీ ఇవ్వకుండానే సమీర్ వర్మ పరాజయం పాలయ్యాడు. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ 17-21, 12-21తో పరాజయం పాలైంది. మూడో సీడ్ చైనీస్ తైపీ షట్లర్ చేతిలో ఆకర్షి పోరాడి ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి, సుమిత్ రెడ్డి జంట సైతం నిరాశపరిచింది. క్వార్టర్‌ఫైనల్లో టాప్ సీడ్ జియాంగ్, జిన్ (చైనా) చేతిలో 12-21, 14-21తో వరుస గేముల్లో పరాజయం పాలై ఇంటిబాట పట్టింది.



## పీఈటీల పదోన్నతులకు లైన్‌క్లియర్

### అడ్డంకులను తొలగిస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు

**హైదరాబాద్ :** వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, భాషా పండితుల పదోన్నతులకు లైన్ క్లియర్ అయ్యింది. 2017, 2019లో పీఈటీలు, భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ 10479 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతీకరించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని న్యాయస్థానంలో సవాల్ చేయగా.. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ పోస్టుల ఉన్నతీకరణ, పదోన్నతుల ప్రక్రియను సమర్థిస్తూ తీర్పు వెలువరించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పుపై కొందరు ఎస్జీటీలు సుప్రీంకోర్టుకు వెళ్లారు. శుక్రవారం సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణకు రాగా.. హైకోర్టు డివిజన్ బెంచ్ నిర్ణయాన్ని సమర్థిస్తూ అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువరిస్తూ.. ఎస్జీటీల దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక న్యాయవాదిని నియమించి పీఈటీల పదోన్నతులకు అనుకూలంగా తీర్పు రావడానికి కృషి చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, విద్యాశాఖ ఉన్నతాధికారులకు వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం తెలంగాణ (పెటా టిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి. కృష్ణమూర్తి గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)గా పదోన్నతులు కల్పించేందుకు ఏ విధమైన అడ్డంకులు లేనందున.. తక్షణమే వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలని ఈ సందర్భంగా పెటా టిఎస్ నాయకులు కోరారు.



## రేసులోనే ఇంగ్లాండ్!

### ఓమన్‌పై ఏకపక్ష విజయం

**నార్త్‌సౌండ్ :** డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్ సూపర్8 ఆశలు సజీవంగా నిలుపుకుంది. గ్రూప్-బిలో ఓమన్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన ఇంగ్లాండ్ నెట్‌రన్‌రేట్‌గా అమాంతం మెరుగుపర్చుకుంది. స్పిన్నర్ ఆదిల్ రషీద్ (4/11), పేసర్లు మార్క్‌వుడ్ (3/12), జోఫ్రా ఆర్చర్ (3/12) మ్యాజిక్‌తో ఓమన్ 13.2 ఓవర్లలో 47 పరుగులకు కుప్పకూలింది. ఓమన్ బ్యాటర్లలో షోయబ్ ఖాన్ (11) ఒక్కడే రెండెంకల స్కోరు సాధించాడు. స్వల్ప లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 3.1 ఓవర్లలోనే ఊదేసింది. జోశ్ బట్లర్ (24 నాటౌట్), ఫిల్ సాల్ట్ (12), జానీ బెయిర్‌స్టో (8 నాటౌట్) రాణించారు. మరో 101 బంతులు ఉండగానే విజయం సాధించిన ఇంగ్లాండ్ నెట్‌రన్‌రేట్‌లో స్కాట్లాండ్‌ను అధిగమించింది. ఇంగ్లాండ్ తన చివరి మ్యాచ్‌లో



## సూపర్8కు అఫ్గాన్

### పాపువ న్యూగినీపై ఘన విజయం

**తారౌబ (ట్రినిటాన్) :** అఫ్గనిస్థాన్ అదరగొట్టింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో సూపర్8 దశకు చేరుకుంది. వెస్టిండీస్, న్యూజిలాండ్‌లతో కూడిన గ్రూప్ ఆఫ్ డెత్‌లో పోటీపడిన అఫ్గనిస్థాన్ వరుస విజయాలతో సూపర్8 బెర్త్ సొంతం చేసుకుంది. శుక్రవారం పాపువ న్యూగినీపై అఫ్గనిస్థాన్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గ్రూప్-సిలో మూడు మ్యాచుల్లోనూ నెగ్గిన అఫ్గనిస్థాన్ ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. గ్రూప్-సిలో ఆరు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన వెస్టిండీస్ సైతం సూపర్8కు చేరుకుంది. గ్రూప్ దశలో చివరి దశలో అఫ్గాన్, విండీస్ తలపడనున్నాయి. ఈ గ్రూప్‌లో అగ్రజట్టు న్యూజిలాండ్ ఆడిన రెండు మ్యాచుల్లోనూ పరాజయం పాలై సూపర్8 ఆశలు ఆవిరి చేసుకుంది. ఇక, తొలుత బ్యాటింగ్ చేసిన పాపువ న్యూగినీ 95 పరుగులకే కుప్పకూలింది. అఫ్గాన్ పేసర్ ఫరూకీ (3/16), నవీన్ (2/4) రాణించటంతో పాపువ న్యూగినీ 19.5 ఓవర్లలో 95 పరుగులకు ఆలౌటైంది. కిప్లిన్ (27) న్యూగినీ తరపున అత్యధిక పరుగులు చేశాడు. అఫ్గాన్ ఎక్స్‌ట్రాల రూపంలో 25 పరుగులు ఇవ్వటం సైతం న్యూగినీకి కలిసొచ్చింది. స్వల్ప లక్ష్యాన్ని అఫ్గాన్ 15.1 ఓవర్లలోనే ఛేదించింది. గుల్బాదిన్ (49 నాటౌట్), మహ్మద్ నబి (16 నాటౌట్) ఛేదనలో రాణించారు.



## ప్రతిభకు ప్రోత్సాహం..



రామ్‌గోపాల్ వర్మ

చిత్ర పరిశ్రమలోకి రావాలనుకునే యువ ప్రతిభావంతులను ప్రోత్సహించడమే తమ ఆర్జీవీ యువర్ ఫిల్మ్ కాంటెస్ట్ లక్ష్యమని దర్శక, నిర్మాత రామ్ గోపాల్ వర్మ అన్నారు. ఆర్జీవీ యువర్ ఫిల్మ్ కాంటెస్ట్ వివరాలను శుక్రవారం రామ్ గోపాల్ వర్మ మీడియాకి వివరించారు. ఈ కార్యక్రమంలో పోటీకి ఎంపికైన షార్ట్ ఫిలిమ్స్ మేకర్స్, ఆర్జీవీ డెన్ ప్రొడ్యూసర్ రవి పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ఈ కాంటెస్ట్‌కు ఎంట్రీలు రావడం విశేషం.

దర్శక, నిర్మాత రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ, 'మొదటి సినిమా 'శివ' సమయంలో నా గురించి ఎవరికీ తెలియదు. ఆ సినిమా ప్రేక్షకాదరణ పొందింది కాబట్టి రామ్ గోపాల్ వర్మ అంటే ఎవరో అందరికీ తెలిసింది. కానీ ప్రతిభ ఉండి నాలా ఇంకా ప్రపంచానికి తెలియాల్సిన వారు ఎంతో మంది ఉన్నారు. ముందు మన కాన్సెప్ట్ చెప్పేందుకు ఎవరో ఒకరు అవకాశం ఇవ్వాలి కదా. అలాంటి వారికి ఇండస్ట్రీతో ఒక యాక్సెస్ ఇచ్చే ఉద్దేశంతో నిర్వహిస్తున్న కాంటెస్ట్ ఆర్జీవీ యువర్ ఫిల్మ్. ఈ కాంటెస్ట్ అనౌన్స్ చేసిన తర్వాత దాదాపు 400 ఎంట్రీలు వచ్చాయి. ఇవి వివిధ రాష్ట్రాల నుంచి కూడా ఉన్నాయి. వీటిలో 11 షార్ట్ ఫిలిమ్స్ షార్ట్ లిస్ట్ చేసి ఎంపిక చేశాం. నార్త్ ఇండియా నుంచి కూడా వచ్చాయి గానీ అవి షార్ట్ లిస్ట్ కాలేదు. షార్ట్ లిస్ట్ అయిన వాటిని సోషల్ మీడియాలో పోల్‌కు పెట్టి ప్రేక్షకులు ఎక్కువమంది బెస్ట్ డైరెక్టర్‌గా ఓటు వేసిన వారికి మా సంస్థలో అవకాశం ఇస్తాం. ఒక్క డైరెక్టర్స్ అనే కాదు. డీవోపీ, మ్యూజిక్ డైరెక్షన్ ఇలా..ప్రతి క్రాఫ్టులో టాలెంటెడ్ వారిని సెలెక్ట్ చేస్తున్నాం. ఈ పోల్‌కు రెండు వారాల టైమ్ తీసుకుంటాం. ఈ కాంటెస్ట్‌లో సెలెక్ట్ అయిన వారి ప్రతిభను ముందుగా మా సంస్థలో ఉపయోగించుకోవాలనేది నాది, ప్రొడ్యూసర్ రవి స్వార్థం (నవ్వుతూ). ఈ కాంటెస్ట్ ద్వారా ఎంపిక చేసిన సాంకేతిక నిపుణుల వివరాలను, తీయబోయే సినిమాల గురించి త్వరలోనే తెలియజేస్తాం' అని తెలిపారు.

# నవచిత్రం

## లేడీ బాస్ నీరా వాసుదేవ్




శ్రీ లీల

హీరో నితిన్ నటిస్తున్న యూనిక్ యాక్షన్, హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. ఇందులో శ్రీలీల ఫిమేల్ లీడ్ రోల్ పోషిస్తుంది. వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. శ్రీలీలకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ ఆమె పాత్రను లేడీ బాస్ నీరా వాసుదేవ్‌గా పరిచయం చేశారు. శ్రీలీల టైట్ సెక్యూరిటీతో ప్రైవేట్ జెట్‌లో దిగినట్లు ఈ వీడియో ప్రజెంట్ చేస్తోంది. ఆమె వెయిట్ తెలియకపోయినా హెడ్ వెయిట్ ఇన్ఫినిటీ. ఆమె యారోగెంట్ క్యారెక్టర్‌లో కనిపిస్తుంది. టీజర్‌లో 'జ్యోతీ, సునామీలో టి సైలెంట్ ఉండాలి... నా ముందు నువ్వు సైలెంట్‌గా ఉండాలి' అని శ్రీలీల చెప్పిన డైలాగ్ అలరించింది. మూవీలో నితిన్ పాత్రకు శ్రీలీల పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. విజువల్స్ గ్రాండ్‌గా అనిపించాయి. ప్రొడక్షన్ వాల్యూస్ టాప్-క్లాస్‌గా ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 20న ఈ సినిమా విడుదల కానుంది.

## కన్నప్ప సినిమా కాదు.. మన చరిత్ర





విష్ణు

విష్ణు మంచు నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల పై డా.మోహన్ బాబు నిర్మించిన ఈ మూవీకి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. శుక్రవారం ఈ చిత్ర టీజర్‌ను రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించారు.

ఈ సందర్భంగా డా.మోహన్ బాబు మాట్లాడుతూ, ' కన్నప్ప ఏ తరానికి అయినా కొత్తగానే ఉంటుంది. భక్తి భావం, ధూర్జటి మహాకవి ఎలా రాశారు? శ్రీకాళహస్తి మహత్యం ఏంటి? అన్నది ఈ చిత్రంలో చూపించాం. ఎంతో వ్యయప్రయాసలతో నిర్మించాం. భారత దేశంలోని నాలుగు మూలల ఉన్న మహా నటుల్ని ఈ చిత్రంలో తీసుకున్నాం. శరత్ కుమార్ తీసిన 'పెదరాయుడు' సినిమాను నేను తీశాను. ఎలాంటి పాత్రనైనా అవలీలగా శరత్ కుమార్ పోషించగలరు. ఇది కేవలం భక్తి చిత్రమే కాదు. అన్ని రకాల అంశాలుంటాయి. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే ఈ సినిమా తీశాం. ముందుగా కన్నప్ప కోసం కృష్ణంరాజుతో మాట్లాడాం. విష్ణు కోసం కన్నప్ప తీయాలని అనుకుంటున్నానని చెబితే.. ప్రభాస్ కోసం రాసుకున్న కథను కూడా కృష్ణంరాజు ఇచ్చేశారు. నిర్మాతగా నాకు మాత్రమే కాకుండా.. కన్నప్ప టీంకు ప్రజలందరి ఆశీస్సులు కావాలి. ఈసినిమా తప్పకుండా అలరిస్తుంది' అని అన్నారు.

'కన్నప్ప'ను ప్రతీ ఒక్క ప్రేక్షకుడు భుజానికి ఎత్తుకుని ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా అభిమానుల నుంచి వస్తున్న సపోర్ట్‌ని చూస్తూనే ఉన్నాను. అందుకే వాళ్లలోంచి కొంత మందిని ఇక్కడకు పిలిచాను. 2014లో కన్నప్ప జర్నీ ప్రారంభమైంది. నా తండ్రి మోహన్ బాబు, విన్ని, వినయ్ ఇచ్చిన ప్రోత్సాహం వల్లే కన్నప్పను తెరపైకి తీసుకురాగలిగాను. కన్నప్ప మైథాలజీ కాదు.. కన్నప్ప మన చరిత్ర. కన్నప్ప నా బిడ్డలాంటిది. ఈ కన్నప్ప కోసం ఇంత మంది ఆర్టిస్టులని ఎందుకు తీసుకున్నామనేది సినిమా చూస్తేనే అందరికీ అర్థమవుతుంది. చరిత్రలో నిలిచిపోయే సినిమా తీస్తున్నామని ముందుకు వెళ్లాం. ఈ కన్నప్ప మీ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నా.

**- మంచు విష్ణు**

'ఈసినిమాలో నాకు నా ఆర్టిస్టులే బలం. విష్ణు చేసిన యాక్టింగ్, పడిన కష్టం గురించి నేను ఎంత చెప్పినా తక్కువే. విష్ణు, శరత్ కుమార్, మోహన్ బాబు అంత డెడికేటెడ్‌గా పని చేశారు. ప్రతీ ఒక్కరూ అద్భుతంగా నటించారు. నా అంచనాలని మించి నటించారు. రామాయణం, మహాభారతం మైథాలజీ కాదు.. అది మన చరిత్ర. సౌత్, నార్త్ అని ఉండదు. ఓ భక్తుడి కథను చెప్పాం. మనం దేవుడి దగ్గరకు వెళ్లి కోరికలు కోరుతాం. కానీ ఏం కోరకుండా దేవుడికే నేత్రాలను సమర్పించారు కన్నప్ప. అలాంటి గొప్ప భక్తుడి కథను చెప్పాం. అంతకంటే గొప్ప కథ ఇంకెక్కడ దొరుకుతుంది' అని ముఖేష్ కుమార్ సింగ్ చెప్పారు.

శరత్ కుమార్ మాట్లాడుతూ,'కన్నప్ప కేవలం సినిమా కాదు.. మన చరిత్ర. ప్రతీ ఒక్కరూ తమ తమ పాత్రల్లో జీవించారు. ఇంకా ఇప్పటికీ ఆ పాత్రల్లోనే ఉండిపోయాం. చరిత్రను అందరూ మర్చిపోతున్నారు. మనం మన చరిత్రను చెప్పుకోవాలి. కన్నప్పను అందరూ వీక్షించాలి' అని అన్నారు. మధుబాల మాట్లాడుతూ, 'ఇలాంటి ప్రాజెక్ట్‌లో నటించడం ఆనందంగా, గర్వంగా ఉంది' అని తెలిపారు. ప్రీతి ముకుందన్ మాట్లాడుతూ, 'ఇందులో ఓ మంచి పాత్ర పోషించినందుకు చాలా హ్యాపీగా ఉంది' అని చెప్పారు.

## బాల్యాన్ని గుర్తు చేసే కమిటీ కుర్రోళ్ళు



'పెరిగి పెద్దై బాధ్యతలను మోస్తున్న పెద్దవాళ్లైనా, యువత అయినా ఏదో ఒక సందర్భంలో చిన్నతనమే బావుందని అనుకుంటాం. అలా అనుకోవటం కూడా నిజమే. ఎలాంటి పొరపచ్చాలు, అడ్డుగోడలు, బాధలు లేకుండా స్నేహితులతో కలిసి సరదాగా గడిపే బాల్యమే ఎంతో గొప్పది. ఈ పాయింట్‌ను బేస్ చేసుకుని రూపొందుతున్న చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'.

నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందుతోన్న ఈ సినిమాకు యదు వంశీ దర్శకుడు.

పక్కా ప్లానింగ్‌తో మేకర్స్ అనుకున్న సమయానికి కన్నా ముందే సినిమా షూటింగ్‌ను పూర్తి చేయటం విశేషం. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో బిజీగా ఉంది. త్వరలోనే విడుదలకు సిద్ధమవుతుంది.

ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ శుక్రవారం ఈ చిత్ర టీజర్ విడుదల చేసింది. హీరో నితిన్ సోషల్ మీడియా వేదికగా టీజర్‌ను లాంచ్ చేసి, మేకర్స్‌కు అభినందనలు తెలిపారు.

కొంత మంది యువకులు వారి బాల్యాన్ని తలుచుకుంటే అప్పట్లో ఆటలు ఆడుకుంటూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరదాగా గడిపిన రోజులను గుర్తుకు తెచ్చుకుంటారు. చిన్నతనంలో వాళ్లందరూ కలిసి ఓ ఇడ్లీ అంగట్లో ఇడ్లీలు తినటం, పంపు సెట్టుకాడా సరదాగా స్నానాలు చేయటం వంటి సన్నివేశాలను మనం చూడొచ్చు. అలాగే టీనేజ్‌లో మనసుకు నచ్చిన అమ్మాయిలను ప్రేమించటం, ఆ సందర్భంలో జరిగిన కామెడీని వారు గుర్తుకు తెచ్చుకోవటం వంటి సన్నివేశాలు టీజర్‌ని మరింత ఆసక్తికరంగా ఉండేలా చేశాయి. ఇదే టీజర్‌లో ఊర్లో జరిగే గొడవలను కూడా చూడొచ్చు. అసలు సరదాగా ఉండాల్సిన యువత ఊళ్లో గొడవల్లో ఎందుకు తలదూర్చుతారు?, ఆ గొడవల కారణంగా వారి జీవితాలు ఎలాంటి మలుపులు తీసుకున్నాయనే విషయాలు తెలియాలంటే సినిమా వచ్చే వరకు ఆగాల్సిందే అని మేకర్స్ అంటున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు - పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక, రచన, దర్శకత్వం - యదు వంశీ.

## ఫాదర్స్ డే స్పెషల్‌గా ఆహాలో స్ట్రీమింగ్



చైతన్య రావ్, సూర్య

చైతన్య రావ్, యష్ణ చౌదరి లీడ్‌రోల్స్‌లో నటించిన చిత్రం 'డియర్ నాన్న'. సూర్య కుమార్ భగవాన్ దాస్, సంధ్య జనక్, శశాంక్, మధునందన్, సుప్రజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. అంజి సలాది దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాకేష్ మహంకాళి నిర్మించారు. ఫాదర్ డే స్పెషల్ గా ఈ చిత్రం శుక్రవారం నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. కరోనా బ్యాక్‌డ్రాప్, ఫాదర్ ఎమోషన్, చైతన్య రావ్, సూర్య కుమార్ భగవాన్ దాస్ మధ్య వచ్చే ఎమోషనల్ సీన్స్ చాలా క్యూరియాసిటీని పెంచాయి.

ప్రొడక్షన్ వ్యాల్యూస్, కంటెంట్ యూనిక్‌గా ఉన్నాయి. ఫ్యామిలీ ఎమోషన్స్ ముఖ్యంగా ఫాదర్ అండ్ సన్ మధ్య వచ్చే సీన్స్ మనసుని హత్తుకున్నాయి. ఫాదర్స్ డే కి డియర్ నాన్న పర్ఫెక్ట్ ట్రీట్ అని చిత్ర బృందం తెలిపింది.

ఈ చిత్రంలో సివిఎల్ నరసింహ, ఆదిత్య వరుణ్, వినీల్ ఇతరకీలక పాత్రలు పోషించారు. అనిత్ కుమార్ మాధాడి డీవోపీగా పని చేసిన ఈ చిత్రానికి గిఫ్టన్ ఎలియాస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా, శ్రవణ్ కటికనేని ఎడిటర్‌గా, కృష్ణ చైతన్య లిరిక్స్ అందిస్తుండగా పివిఎన్ఎస్ రోహిత్ పాటల్ని పాడారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.